ప్రతి నిత్యం తాజా వార్తలతో నిజాలు నిగ్గు తేలుస్తూ, సమకాలీన అంశాలను విశ్లేశిస్తూ ముస్తాబయి మీ ముందుకు వస్తున్న అక్షరం తెలుగు దినపత్రిక
సుఫల అక్షరం
తెలుగు దినపత్రిక సామాన్యుడి అస్త్రం
Your Ad Here.
ప్రకటనలకు (అడ్వర్టైస్‌మెంట్) కొరకు సంప్రదించండి
EDITOR & PUBLISHER: 9391690609, OFFICE: 7893003409.
aksharamtsnews@gmail.com .... www.aksharamtelugudaily.com

www.aksharamtelugudaily.com RNI NO: TELTEL/2018/75419

# సుఫల అక్షరం

సామాన్యుడి అస్త్రం / తెలుగు దినపత్రిక

SUPHALA AKSHARAM

SUNDAY 24 MAY 2026 EDITOR : SHAIK YACOOB PASHA PAGES : 12 VOLUME : 09 ISSUE : 67 COST : 3\- KHAMMAM, TELANGANA

ఆదివారం 24 మే 2026 ఎడిటర్ : షేక్ యాకూబ్ పాషా పేజీలు : 12 సంపుటి : 09 సంచిక : 67 వెల : రూ.3/- ఖమ్మం, తెలంగాణ

CIRCULATED BY : ADILABAB,, A SIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULABMA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOODNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRICILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI

## దేశవ్యాప్తంగా భానుడి భగభగలు

బయటకు రావాలంటే భయపడతున్న జనాలు



➤ 2వ పేజిలో..



## యాదగిరిగుట్టలో సీఎం పర్యటన

- వందకోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- రూ.43.80 కోట్లతో వేదపాఠశాలకు భూమిపూజ

యాదగిరిగుట్ట,మే23 యాదగిరిగుట్టలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా రూ.100 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. శనివారం ఉదయం యాదగిరిగుట్టకు చేరుకున్న సీఎం రేవంత్ శ్రీలక్ష్మీనర్సింహ స్వామిని దర్శించుకున్నారు. అనంతరం రూ.43.80 కోట్లతో నిర్మించనున్న వేద పాఠశాలకు రేవంత్ శంకుస్థాపన చేశారు. కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతితో కలిసి వేదపాఠశాలకు భూమిపూజ చేశారు. అనంతరం రూ.9.87 కోట్లతో కొండపై స్వామివారి నిత్య కల్యాణ మండపం నిర్మాణానికి, రూ.1.41 కోట్లతో వైకుంఠ ద్వారం నుంచి కొండపైకి వెళ్లే మెట్ల మార్గం పై కప్పు నిర్మాణానికి, రూ.1.35 కోట్లతో నిర్మించనున్న రథశాల వైపు మాడవీధులకు మెట్ల నిర్మాణానికి, రూ.43.12 కోట్లతో డార్మిటరీ హాల్స్, దీక్షాపరుల సదన్ నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఉదయం ప్రత్యేక హెలికాప్టర్లో యాదగిరిగుట్ట పెద్దగుట్టపైకి చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డికి.. ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య,

➤ మిగతా 2వ పేజిలో..

# రెండో విడతలో రెండున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లు




- ప్రతి నియోజకవర్గానికి 2 వేల చొప్పన మంజూరు
- పాత ఇందిరమ్మ ఇల్ల పూర్తికి నిధులు కేటాయింపు
- జూన్ 1న కొరారి గ్రామంలో ఆదివాసీల ఇందిరమ్మ కాలనీ ప్రారంభం
- కేబినేట్ నిర్ణయాలను వివరించిన మంత్రి పొంగులేటి

హైదరాబాద్,మే23: రాష్ట్రంలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. మొత్తం 2 లక్షల 50 వేల మంది పేద కుటుంబాల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ప్రతి నియోజకవర్గానికి 2 వేల చొప్పున ఇళ్లను మంజూరు చేయాలని నిర్ణయించింది. కేబినేట్ వివరాలను మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ కుమార్‌లు మీడియాకు వివరించారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభించి గోడలు, శ్లాబు దశలో నిలిచిపోయిన వాటిని కూడా పూర్తి చేయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. పునాదులు పూర్తయి గోడలు, శ్లాబు పడని ఇళ్లకు రూ.3 లక్షలు, గోడలు పూర్తయి శ్లాబు నిలిచిపోయిన ఇళ్లకు రూ.2 లక్షలు చొప్పున అందిస్తాం. అసంపూర్తిగా ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పూర్తి చేసేందుకు నియోజకవర్గానికి 500 ఇళ్లకు చొప్పున నిధులు కేటాయిస్తూ క్యాబినెట్ తీర్మానించింది. తొలి విడతలో నిర్మాణం ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్లలో జూన్ రెండు నాటికి దాదాపు లక్ష ఇళ్ల గృహ ప్రవేశాలు జరుగుతాయి. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం కొరారి గ్రామంలో కొలాం ఆదివాసీలకు ప్రభుత్వం కట్టించిన 28 ఇందిరమ్మ ఇళ్లను జూన్ 1వ తేదీన ప్రారంభించాలని నిర్ణయించాం. జూన్ 1వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క,రాష్ట్ర మంత్రులంతా అక్కడికి వెళ్లి ఈ కార్యక్రమంలో పాల్గొంటాం అని మంత్రి పొంగులేటి తెలిపారు. హైదరాబాద్ మహానగరం క్యూర్ పరిధిలోని 24 నియోజకవర్గాల్లో అల్పాదాయ వర్గాల వారి కోసం లక్ష ఇళు నిర్మించి ఇవ్వాలని రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయించిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో వివిధ దఫాలుగా చేసిన సర్వేల ప్రకారం 15 వేల కుటుంబాలు గుడిసెల్లో నివాసం ఉంటున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. వెంటనే ఆ కుటుంబాల న్నింటికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందించాలని రాష్ట్ర క్యాబినెట్ తీర్మానించింది. గుడిసెలు లేని ఆదర్శ రాష్ట్రంగా తెలంగాణను నిలపాలని క్యాబినెట్ నిర్ణయించింది. వచ్చే ఏడాది జూన్ 26 నుంచి జులై 7వ తేదీ వరకు జరగనున్న గోదావరి పుష్కరాలకు సంబంధించి వివిధ పనులు చేపట్టేందుకు రూ.1000 కోట్ల నిధులకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఇందులో తొలి విడతగా రూ.300 కోట్లు మంజూరుకు క్యాబినెట్

➤ మిగతా 2వ పేజిలో..



## వరుసగా మూడోసారి పెట్రో ధరల పెంపు

**పెట్రోల్‌పై 87 పైసలు, డీజిల్ పై 91 పైసల వాయింపు**

న్యూఢిల్లీ,మే23 పెట్రోల్ డీజిల్ ధరలు వరుసగా మూడోసారి పెరిగాయి. శనివారం పెట్రోల్‌పై 87 పైసలు, డీజిల్ పై కేంద్ర ప్రభుత్వం 91 పైసలు పెంచింది. 10 రోజుల్లో ధరలు పెంచటం ఇది మూడోసారి. పెట్రోల్, డీజిల్ ధరల పెంపు విషయంలో ఆయిల్ కంపెనీలు ఓ ప్యాట్రన్ ఫాలో అవుతున్నట్లు సోషల్ మీడియాలో జోరుగా చర్చ నడుస్తుంది. ఇప్పటి వరకు నాలుగు రోజులకు ఒకసారి పెంచటం జరిగింది. 15వ తేదీ తర్వాత 19.. ఆ తర్వాత 23వ తేదీ.. అంటే ధరల పెంపు మధ్య 4 రోజుల గ్యాప్ ఉండేలా చూసుకుంటున్నారు. ఇదే సమయంలో మరో ఆసక్తికరమైన అంశంపై సోషల్ మీడియాలో చర్చ నడుస్తుంది. గతంలో పెట్రోల్, డీజిల్ ధరల పెంపును రాత్రి టైంలో అనౌన్స్ చేసేవాళ్లు.. రేపటి ఉదయం పత్రికల్లో ఆ వార్త వచ్చేసింది. ఇప్పుడు ఈ విధానం మారింది. అర్ధరాత్రి తర్వాత.. తెల్లవారుజామున ధరల పెంపు ప్రకటన చేస్తున్నారు. ఉదయం ఆరు గంటల సమయంలోనే ఈ వార్త జనానికి తెలుస్తుంది. పెంచిన ధరలు ఈ ఉదయం 6 గంటల నుంచే అమల్లోకి వచ్చాయని ప్రకటిస్తున్నారు. పెట్రోల్, డీజిల్ రేట్లు పెంపు అనేది టీవీల్లో, సోషల్ మీడియాలో చూసి మాత్రమే జనం తెలుసుకుంటున్నారు.



## హరీష్ రావువి పగటి కలలు

- అధికారంలోకి రావడం కల్ల
- ఫ్యూచటర్ సిటీపై బాధ్యాతారాహిత్య ప్రకటన
- అభివృద్ధిని అడ్డుకోవడమే లక్ష్యంగా బిఆర్ఎస్
- మండిపడ్డ మంత్రి శ్రీధర్ బాబు

2



## యువత ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలి

- దేశవ్యాప్తంగా రోజ్‌గార్ మేళాలో 51 వేల మందికి ఉద్యోగాలు
- ఇప్పటివరకు 12.5 లక్షల మందికి ఉద్యోగావకాశాలు
- 19వ రోజ్‌గార్ మేళాలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

హైదరాబాద్,మే23 దేశవ్యాప్తంగా 47 ప్రాంతాల్లో జరిగిన రోజ్‌గార్ మేళాలో 51 వేల మందికి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. యువత స్వయం సమృద్ధి సాధించి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. శనివారం నాడు బోయిగూడలోని రైల్ కళారంగ్‌లో జరిగిన 19వ రోజ్‌గార్ మేళాలో కేంద్ర మంత్రి పాల్గొని ప్రసంగించారు. ఈరోజు 220 మంది కొత్తగా

➤ మిగతా 2వ పేజిలో..

## ఎపికి ప్రత్యేక హోదా కాంగ్రెస్‌తోనే సాధ్యం

- రాహుల్ ప్రధాని అయితేనే ఎపికి లబ్ది
- రాజ్యాంగాన్ని రద్దు చేసే కుట్రలో బిజెపి
- మీడియా సమావేశంలో కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



హైదరాబాద్,మే23 ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదాపై తెలంగాణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి అయితేనే ఏపీకి

➤ మిగతా 2వ పేజిలో..

# భద్రత, వాణిజ్య,సాంకేతిక రంగాల్లో సహకారం

**ప్రధాని మోడీతో అమెరికా విదేశాంగ మంత్రి రూబియో చర్చలు**



న్యూఢిల్లీ,మే23 భద్రత, వాణిజ్యం, సాంకేతిక రంగాలలో అమెరికా-భారత్ సహకారాన్ని మరింతగా పెంపొందించే మార్గాలపై ప్రధాని మోదీతో చర్చించినట్లు అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో పేర్కొన్నారు. తమ దేశానికి భారత్ ఓ కీలక భాగస్వామి అన్నారు. అమెరికా-భారత్ మధ్య వాణిజ్య సంబంధాలు మరింత బలపడుతున్నాయని.. భారతీయ కంపెనీలు తమ దేశంలో 20 బిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడులు పెట్టాయని తెలిపారు. నాలుగు రోజుల పర్యటన నిమిత్తం భారత్‌కు చేరుకున్న మార్కో రూబియో ప్రధాని మోదీతో సమావేశమయ్యారు. వైట్‌హౌస్‌ను సందర్శించాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తరపున ఆయన మోదీని ఆహ్వానించారు. సేవాతీర్థ్ లో దాదాపు గంటకు పైగా ప్రధానితో భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. భారత్‌కు ముడి చమురు సరఫరా చేయడానికి తమ దేశం సిద్ధంగా ఉందన్నారు. అదే సమయంలో ప్రపంచ ఇంధన మార్కెట్‌ను తన ఆధీనంలోకి

➤ మిగతా 2వ పేజిలో..

## తెలంగాణ ఎండల తీవ్రతపై ప్రభుత్వం అలర్ట్

- వడదెబ్బకు 16 మంది మృతి చెందినట్లు గుర్తింపు
- మృతుల కుటుంబాలకు 4లక్షల చొప్పన పరిహారం
- పరిస్థితిపై అధికారులతో మంత్రి పొంగులేటీ సమీక్ష

హైదరాబాద్,మే23 రాష్ట్ర వ్యాప్తంగా హీట్ వేవ్‌పై హై అలర్ట్ ప్రకటించినట్లు తెలంగాణ రెవెన్యూ, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. తీవ్ర

➤ మిగతా 2వ పేజిలో..

# రెండోవిడతలో రెండున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లు

➢ మొదటి పేజీ తరువాయి

ఆమోదం తెలిపింది. విద్యుత్ పంపిణీ, మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్కీమ్‌లలో చేరేందుకు తెలంగాణ డిస్కంలు తయారు చేసిన ప్రతిపాదనలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రాష్ట్రంలోని అన్ని జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం అమలు చేసేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రభుత్వం పాఠశాలలతో పాటు అన్ని జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకూ ఉదయం అల్పాహారంతో పాటు పాలు అందించాలని నిర్ణయించింది. రాష్ట్రంలోని డిసిఎంఎస్‌లను మార్క్ ఫెడ్లో విలీనం చేయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. తెలంగాణ రూరల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ హాకాలో విలినం చేయాలని క్యాబినెట్ నిర్ణయించింది. పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకం భూ సేకరణ, పునరావాసం, మౌలిక వసతుల సదుపాయాల కల్పనకు రూ.587 కోట్లు కేటాయిస్తూ రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. తెలంగాణను 2030 నాటికి ప్రపంచంలోని టాప్ 5 లైఫ్ సైన్సెస్ హబ్‌లలో ఒకటిగా నిలబెట్టాలన్నది రాష్ట్ర ప్రభుత్వ సంకల్పం. అందుకే నెక్స్ట్ జనరేషన్ లైఫ్ సైన్సెస్ పాలసీ 2026-30ని రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించింది. దావోస్‌లో ఈ పాలసీని లాంఛనంగా ఆవిష్కరించాం అని తెపిపారు. ఈ పాలసీ ద్వారా వచ్చే ఐదేళ్లలో 5 లక్షల ఉద్యోగాలతో పాటు 25 బిలియన్ డాలర్ల పెట్టుబడులు ఆకర్షించాలనేది లక్ష్యంగా పెట్టుకున్నాం. లైఫ్ సైన్సెస్, ఫార్మా, బయోటెక్, మెడికల్ ఇన్నోవేషన్ రంగాల్లో భారీ పెట్టుబడులకు గమ్యస్థానంగా మారుస్తాం. యువతకు పరిశోధన, తయారీ, డిజిటల్ హెల్త్, గ్లోబల్ ఇన్నోవేషన్ రంగాల్లో మంచి అవకాశాలు కల్పిస్తాం. ఇప్పటివరకు ఎక్కువగా తయారీ మీద దృష్టి ఉంటే, ఇక నుంచి విలువైన ఇన్నోవేషన్ మీద ఎక్కువ ఫోకస్ పెడతాం. రీసెర్చ్ అండ్ డెవెలప్మెంట్ యూనిట్లను కూడా పరిశ్రమలుగా గుర్తించే విధంగా ఈ పాలసీలో మార్పు తీసుకొస్తున్నాం. గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లు, గ్లోబల్ ఇన్నోవేషన్ సెంటర్లు తెలంగాణకు రావడానికి ఈ పాలసీ ఉపయోగపడుతుందని మంత్రులు వివరించారు.

# దేశవ్యాప్తంగా భానుడి భగభగలు

### బయటకు రావాలంటే భయపడతున్న జనాలు

న్యూఢిల్లీ,మే23 దేశంలో భానుడు తన ఉగ్రరూపం చూపిస్తున్నాడు. చాలా ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది గంటల నుంచే ఎండలు భగభగ మండుతున్నాయి. జనం ఇళ్ల నుంచి అడుగు బయటపెట్టాలంటే భయంతో వణికిపోతున్నారు. అత్యవసర పనులు ఉంటే తప్ప ఇళ్లకే పరిమితం అవుతున్నారు. రానున్న వారం రోజులపాటు కూడా తీవ్రమైన వడగాలులు వీచే అవకాశం ఉందని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. రెండు తెలుగు రాష్ట్రాలు సహా వాయవ్య, మధ్య, తూర్పు భారత్‌లోని పలు మైదాన ప్రాంతాల్లో వడగాలులు వీస్తాయని అంచనావేసింది. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, పంజాబ్, హర్యానా, చండీగఢ్, ఢిల్లీ, రాజస్థాన్‌లలోని పలు ప్రాంతాల్లో వడగాలులు వీస్తాయని ఐఎండీ వెల్లడించింది. విదర్భ, ఆంధ్రాలోని తీరప్రాంతం, యానాం, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఒడిశా, తెలంగాణ, జమ్మూకశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలోనూ వడగాలులు వీచే అవకాశముందని తెలిపింది. శుక్రవారం ఉదయం దాదాపు 11 గంటల సమయానికి నమోదైన ఉష్ణోగ్రతల ప్రకారం.. ప్రపంచంలోనే 50 అత్యంత వేడి నగరాలన్నీ భారత్‌లోనే ఉన్నాయి. ఎయిర్‌క్వాలిటీ ఇండెక్స్ ఈ గణాంకాలను వెల్లడించింది. జాబితాలోని సగం నగరాలు ఉత్తరప్రదేశ్‌లోనివే కావడం గమనార్హం. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, బీహార్, తెలంగాణ, హర్యానా, మధ్యప్రదేశ్ తదితర రాష్టాల్లోని పలు ప్రాంతాలూ ఇందులో ఉన్నాయి.

# హరీష్ రావువి పగటి కలలు

హైదరాబాద్,మే23 ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు బాధ్యతా రాహిత్యంగా మాట్లాడుతున్నారని మంత్రి శ్రీధర్‌బాబు విమర్శించారు. ఇది బ్లాక్ మెయిల్ రాజకీయమని మండిపడ్డారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలా? వద్దా? ఆయన చెప్పాలన్నారు. 'ఇలా చేస్తే పెట్టుబడులు రావు. పక్క రాష్ట్రాలకు వెళ్తాయి. ఫ్యూచర్ సిటీలో కాలుష్యకారక పరిశ్రమలు ఉండవు. దాన్ని రద్దు చేస్తామనడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. తమ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని బీఆర్ఎస్ అడ్డుకుంటోందని మంత్రి ఆరోపించారు. ఆ పార్టీ బ్లాక్‌మెయిలింగ్ రాజకీయాలకు యత్నిస్తోందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన మొదటిరోజు నుంచే బీఆర్ఎస్ నేతలు విమర్శలే ప్రధాన అంశంగా ముందు కెళ్తున్నారని తెలిపారు. జంట నగరాలకు సంబంధించిన మెట్రోను విస్తరించాలనుకుంటే అడ్డుకుంటున్నారని బీఆర్ఎస్ పార్టీ నేతలపై మంత్రి శ్రీధర్ బాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతలు చీప్ పాలిటిక్స్.. బ్లాక్ మెయిల్ పాలిటిక్స్ చేయొద్దని అన్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. ఎక్కడ అభివృద్ధి చేస్తే అక్కడ ఆపుతామంటే ఎలా అని ప్రశ్నించారు. ప్రజలు కోరుకున్నది తప్పకుండా చేసి తీరుతామన్నారు. వేలాది కోట్లు పెడతామని మల్టీ నేషనల్ కంపెనీలు వస్తున్నాయని.. ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామంటే పెట్టుబడిదారులు భయపడరా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో కాంగ్రెస్ తెచ్చిన మెట్రోనే ముందుకు సాగిందని మంత్రి తెలిపారు. తాము ఎన్ని కిలోమీటర్లు తెచ్చామో అన్ని కిలోమీటర్లు మాత్రమే మెట్రో వచ్చిందని చెప్పారు. మెట్రోను విస్తరిద్దామంటే అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. పెరిగిన

జనాభాకి అనుగుణంగా మెట్రో విస్తరించకూడదా అని ప్రశ్నించారు. అధికారంలోకి వస్తామని మాజీ మంత్రి హరీశ్ రావు పగటి కలలు కంటున్నారని విమర్శించారు. అసెంబ్లీ, పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోయిందని.. అయినా ఆ పార్టీ నేతల బుద్ధి మారడం లేదని వ్యాఖ్యానించారు. నగరాన్ని విస్తరించాలని ప్రభుత్వం భావిస్తోందని మంత్రి తెలిపారు. ప్రజల అవసరాలను తీర్చడానికి ప్రణాళికలు రూపొందించామన్నారు. ఇతర నగరాల అభివృద్ధిపై అధ్యయనం చేశామన్నారు. రాబోయే తరాలకు ఉపయోగపడే కార్యాచరణ చేపట్టాలని నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడానికే బీఆర్ఎస్ ప్రయత్నం చేస్తోందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని అడ్డుకోవాలని బీఆర్ఎస్ ప్రయత్నిస్తోందని మంత్రి ఆరోపించారు. ఓటమితో ఎదురైన నిరాశ నుంచి ఇప్పటికీ బయటకి రాలేకపోతున్నారన్నారు. బుల్లెట్ ట్రైన్ తెస్తామంటే.. ఎందుకని బీఆర్ఎస్ నేతలు అడ్డుపడుతున్నారని ఫైర్ అయ్యారు. తెలంగాణ యువతకు మంచి భవిష్యత్తు ఇవ్వొద్దా అని అన్నారు. స్వార్థ రాజకీయాలే తమకి ముఖ్యమని బీఆర్ఎస్ నేతలు భావిస్తున్నారని మంత్రి శ్రీధర్ బాబు విరుచుకుపట్టారు.

# యాదగిరిగుట్టలో సిఎం పర్యటన

కలెక్టర్ అనురాగ్ జయంతి ఘన స్వాగతం పలికారు. సీఎంతో పాటు శాసనమండలి చైర్మన్ గుత్త సుఖేందర్ రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, అడ్లూరి లక్ష్మణ్, ఎంపీ వేంనరేందర్ రెడ్డి.. యాదాద్రికి చేరుకున్నారు. పవిత్ర పుణ్యక్షేత్రం యాదగిరిగుట్టపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంప్రదాయ వేదపాఠశాల భవనానికి శంకుస్థాపన చేశారు. కంచి కామకోటి పీఠాధిపది శ్రీశంకర విజయేంద్ర సర్వస్వతి స్వామి సమక్షంలో ఈ క్రతువు జరిగింది. రూ.43.79 కోట్లతో క్షేత్రంలోని పెద్దగుట్ట ఆలయ నగరి లేఅవుట్ వద్ద 15 ఎకరాల విస్తీర్ణంలో వేదపాఠశాల భవనం నిర్మించనున్నారు. వచ్చే రెండేళ్లలో నిర్మాణం పూర్తి చేసి తరగతులు ప్రారంభించనున్నారు. అనంతరం శ్రీలక్ష్మి నరసింహస్వామి వారిని సీఎం దర్శించుకున్నారు.

## తెలంగాణ ఎండల తీవ్రతపై ప్రభుత్వం అలర్ట్

ఉష్ణోగ్రతలపై మంత్రి పొంగులేటి సచివాలయంలో శనివారం అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై మంత్రి దిశానిర్దేశం చేశారు. వడగాల్పులతో 7 జిల్లాల్లో 16 మంది మృతిచెందారని తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ.4 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇస్తున్నట్లు ప్రకటించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో నష్టపరిహారం ఇస్తున్నామని స్పష్టం చేశారు. వచ్చే మూడు రోజులు మరింత తీవ్రంగా హీట్ వేవ్ ఉండనుందని తెలిపారు. జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని మార్గనిర్దేశర చేశారు. ప్రజల ప్రాణ రక్షణెళి తమ ప్రభుత్వ తొలి ప్రాధాన్యమని తెలిపారు. వడగాల్పులతో ఒక్క ప్రాణం కూడా కోల్పోకూడదని చెప్పుకొచ్చారు. ఎండ తీవ్రతపై ప్రజలకు గంట గంటకు హెచ్చరికలు జారీ చేశామని మంత్రి పొంగులేటి తెలిపారు. ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ప్రజలు బయటకు రావొద్దని సూచించారు. వృద్ధులు, గర్భిణులు, చిన్నారులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. వ్యవసాయ, భవన నిర్మాణ కార్మికులు ప్రత్యేక రక్షణ చర్యలు చేపట్టాలని నిర్దేశిరచారు. హీట్‌వేవ్‌పై గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఎండదెబ్బకు గురైన వ్యక్తులకు ఆయా ఆస్పత్రులు అత్యవసర చికిత్స అందించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఇదిలావుంటే తెలంగాణలో భానుడి భగభగలు తీవ్రరూపం దాల్చాయి. రాష్ట్రవ్యాప్తంగా ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతుండగా, 18కు పైగా జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 46 డిగ్రీల సెల్సియస్‌ను దాటాయి. పరిస్థితి తీవ్రంగా మారడంతో అధికారులు 18 జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు. హైదరాబాద్ లోనూ ఉష్ణోగ్రతలు భారీగా పెరిగి 43 డిగ్రీలకుపైగా నమోదయ్యాయి. రాష్ట్రంలోని ఉత్తర, తూర్పు జిల్లాలు తీవ్ర వడగాలుల ప్రభావానికి గురవుతున్నాయి. వడదెబ్బ ప్రభావం ఆందోళనకరంగా మారింది. రాష్ట్రవ్యాప్తంగా వడదెబ్బ కారణంగా 34 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో ప్రజలు అత్యవసరం అయితే తప్ప మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లవద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు.

అధిక ఉష్ణోగ్రతల కారణంగా అలసటగా ఉంటుంది, గాలిలో తేమ ఎక్కువగా ఉండటం, వేడిగా ఉన్నప్పుడు ఎక్కువగా అలసిపోయినట్లు అనిపిస్తుంది. కండరాల నొప్పి ఉంటుంది. హీట్ ఇంజురీలో శరీర భాగాలు దెబ్బతినే అవకాశం ఉంది. కిడ్నీ, గుండె సమస్యలు వచ్చే అవకాశం ఉంది. హీట్ స్ట్రోక్ తీవ్రమైన సమస్య.. దీనిలో శరీర భాగాలు తీవ్రంగా దెబ్బతింటాయి. దీని కారణంగా మెదడు పనితీరు దెబ్బతింటుంది. స్ట్రోక్ సంభవించవచ్చు. దీన్ని నిర్లక్ష్యం చేస్తే.. కోమాలోకి వెళ్లే ప్రమాదం ఉంది. ఈ వడదెబ్బ నుంచి తప్పించుకోవాలంటే.. శరీరాన్ని ఎప్పుడూ హైడ్రేట్‌గా ఉంచుకోవాలి. ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. మధ్యాహ్నం పూట బయటకు వెళ్లకపోవడం మంచిది. షుగర్, బీపీ పేషెంట్లు మెడికేషన్ సక్రమంగా తీసుకోవాలి. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 వరకు బయట తిరగకపోవడమే మంచిది. అత్యవసర పరిస్థితిలో వెళ్లాల్సి వస్తే.. తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ముదురు రంగు దుస్తులు కాకుండా తేలికపాటి లేత రంగు దుస్తులను ధరించాలి. ఆల్కాహాల్ శరీరంలోని నీటి శాతాన్ని తగ్గిస్తాయి. ఎండాకాలంలో మద్యానికి దూరంగా ఉండటం మంచిది. ఓఆర్ఎస్, కొబ్బరి నీళ్లు, ఉప్పు కలిపిన నిమ్మరసం లాంటివి శరీరం కోల్పోయిన లవణాలను తిరిగి భర్తీ చేస్తాయి. దోసకాయలు, పుచ్చకాయలు, దానిమ్మ, బత్తాయి లాంటి పండ్లు తీసుకోవాలి. వేసవిలో తేలికపాటి వ్యాయామాలు ఉదయం 8 గంటల్లోపే ముగించాలి. వడదెబ్బ లక్షణాలు కనిపించగానే చికిత్స అందించాలి. లేదంటే శరీరం పూర్తిగా నిర్జలీకరణం చెంది.. బీపీ, పల్స్ పడిపోయి కొన్నిసార్లు ప్రాణాలు పోవచ్చు.

# యువత ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలి



ఉద్యోగాల్లో చేరుతున్నారన్నారు. 2022లో దీపావళి రోజున మొదలైన రోజ్‌గార్ మేళా ద్వారా ఇప్పటివరకు 12.5 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించామని వెల్లడించారు. ఇది కేవలం ఉద్యోగాల కార్యక్రమం కాదని, యువత భవిష్యత్తు కోసం మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన పెద్ద మిషన్ అని చెప్పుకొచ్చారు. ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు ప్రైవేట్ కంపెనీల్లో కూడా కోట్ల సంఖ్యలో ఉద్యోగాలు వస్తున్నాయని అన్నారు. స్టార్టప్స్, యూనికార్న్ వల్ల యువత ఉద్యోగాలు అడిగే స్థాయి నుంచి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి వచ్చిందని కేంద్రమంత్రి అన్నారు. రోడ్లు, ఎయిర్‌పోర్టులు, రైల్వేలు, మెట్రోలు, ఇండస్ట్రియల్ కారిడార్లు వంటి ప్రాజెక్టులతో భారీగా ఉపాధి పెరుగుతోందన్నారు. దేశంలో ప్రతి సంవత్సరం రూ.12 లక్షల కోట్ల ఇన్‌ఫ్రా పనులు జరుగుతున్నాయని వివరించారు. ప్రతి లక్ష కోట్ల పెట్టుబడికి 14 నుంచి 15 లక్షల ఉద్యోగాలు వస్తున్నాయన్నారు. యువతను మోదీ 'వికసిత భారతానికి సూపర్ హీరోలు'గా చూస్తున్నారని అన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా కోట్ల మంది యువతకు శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. గ్రామీణ యువతకు కూడా ంఎ, ఎని వంటి ఆధునిక టెక్నాలజీని మాతృభాషలో నేర్పిస్తున్నామని తెలిపారు.భారత యువత ప్రపంచస్థాయిలో రాణిస్తోందని కిషన్ రెడ్డి అన్నారు. సెమికండక్టర్లు, స్పేస్, డ్రోన్ టెక్నాలజీలో భారత్ ముందుకు వెళ్తోందన్నారు. చంద్రుడి దక్షిణ ధృవానికి ముందుగా చేరిన దేశం భారత్ అని చెప్పుకొచ్చారు. 'ఆపరేషన్ సిందూర్' సమయంలో స్వదేశీ డ్రోన్లు శత్రు క్షిపణులను అడ్డుకున్నాయని అన్నారు. 2047 నాటికి వికసిత భారత్ లక్ష్య సాధనలో యువత పాత్ర కీలకమన్నారు. యూనివర్సిటీలు, కాలేజీలు, పీఎం-శ్రీ స్కూల్స్ సంఖ్య పెంచామని తెలిపారు. భారత్ ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని అన్నారు. 2014కు ముందు వందల స్టార్టప్స్ మాత్రమే ఉండగా, ఇప్పుడు 1.2 లక్షలకు పైగా ఉన్నాయన్నారు. మైనింగ్, బొగ్గు రంగాల్లో కూడా మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని యువతకు సూచించారు. మైనింగ్, ఇంజనీరింగ్ వంటి కోర్సులపై యువత దృష్టి సారించాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సూచనలు చేశారు.

## ఎపికి ప్రత్యేక హోదా కాంగ్రెస్‌తోనే సాధ్యం

ప్రత్యేక హోదా వస్తుందని అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ కోసమైనా రాహుల్ గాంధీని ప్రధానిని చేయాలని ఏపీ ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఆలోచన చేయాలని.. ఓటు ఎవరికో వేసి దేవుడిని ఏదో అడిగితే ఎవరూ ఏం చేయలేరని అన్నారు. హైదరాబాద్ గాంధీ భవన్‌లో జగ్గారెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీకి ప్రత్యేక హోదా సహా పలు అంశాలపై స్పందించారు. 'భక్తి అంటే నాది.. నేను రియల్ ఎస్టేట్‌లో సంపాదించిన డబ్బులతో సీతారాముల కల్యాణం చేస్తాను. తెలంగాణలో ఒక్క బీజేపీ నేత అయినా నాలాగా చేస్తారా?. రాములవారి కల్యాణం చేసి నేనెప్పుడైనా ఓట్లు అడిగానా?. ఛత్రపతి శివాజీకి లేని మతం మీకెందుకు?. శివాజీ దగ్గర ముస్లింలు మంత్రులుగా పనిచేశారు. బీజేపీ నేతలు చదువుకోవాలి. ఆ పార్టీ వాళ్లు మాట్లాడితే హిందువులు అంటారు. రాజ్యాంగాన్ని తీసేసే కుట్ర బీజేపీ చేస్తోంది. రాజ్యాంగ పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ పాటుపడు తున్నారు. ఆయన ఎక్కడికి వెళ్లినా ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. దేశ ప్రజలకు కవచం లాంటిది రాజ్యాంగం. కవచకుండలాలు ఉన్నంతకాలం కర్ణుడిని ఎవరూ చంపలేకపోయారు. అవి దానం చేశాక కర్ణుడి ప్రాణాలు పోయాయి. ఎన్నికల కమిషన్ ద్వారా ఓటు చోరీ చేసి కమలం పార్టీ అధికారంలోకి వచ్చింది. ఓట్లను దొంగిలించి ఎంపీ సీట్లు గెలిచింది. దేవుడి పేరుతో, మతం పేరుతో, దొంగ ఓట్లతో ఆ పార్టీ గెలుస్తోంది. దేశ ప్రజలు ఇప్పటికే ప్రమాదంలో ఉన్నారు. రాజ్యాంగాన్ని తీసేస్తే మరింత ప్రమాదంలో పడతారు. దేశం 67 ఏళ్ల పాలనలో రూ.54 లక్షల కోట్ల అప్పు చేస్తే.. బీజేపీ అధికారంలోకి వచ్చాక రూ.1,047 లక్షల కోట్ల అప్పులు చేసింది. ఞహుల్ కుటుంబం అధికారం కోసం ఏనాడూ తాపత్రయపడలేదు. ఆయనది ఆస్తులు, ప్రాణత్యాగం చేసిన కుటుంబం. ప్రధాని పదవిని రాహుల్ త్యాగం చేశారు. అధికారం చేపట్టిన తర్వాత మోదీ చేసిన మంచి ఒక్కటి చెప్పండి' అని మండిపడ్డారు.

## భద్రత, వాణిజ్య,సాంకేతిక రంగాల్లో సహకారం

తీసుకోవడానికి ఇరాన్ చేస్తున్న ప్రయత్నాలను తాము ఎప్పటికీ అంగీకరించబోమన్నారు. ప్రధాని మోదీకి, ట్రంప్‌నకు మధ్య మంచి స్నేహపూర్వక సంబంధాలు ఉన్నాయని రూబియో అన్నారు. వారిద్దరూ కేవలం తాత్కాలిక ప్రయోజనాల గురించే కాకుండా దీర్ఘకాలిక ప్రయోజనాలపైనా దృష్టిపెడతారని పేర్కొన్నారు. ఈ క్రమంలో దేశంలో మండుతున్న ఎండల గురించి మాట్లాడుతూ.. వేడిగా ఉన్నందున తన ప్రసంగాన్ని క్లుప్తంగా ముగించాలనుకుంటున్నానంటూ చమత్కరించారు. అమెరికా విదేశాంగ మంత్రి రూబియోతో భేటీపై ప్రధాని మోదీ స్పందించారు. భారత్-అమెరికా వ్యూహాత్మక భాగస్వామ్యం పురోగతితోపాటు ప్రాంతీయ, అంతర్జాతీయ శాంతి భద్రతలు తదితర అంశాలపై చర్చలు జరిపామన్నారు. భవిష్యత్తులో ఇరుదేశాల మధ్య బంధం మరింత బలపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రపంచ శ్రేయస్సు కోసం అమెరికాతో కలిసి పని చేస్తామన్నారు. ఇరాన్‌తో నెలకొన్న ఉద్రిక్తతలను పరిష్కరించుకోవడానికి శాంతియుత చర్చలు జరపాలని ఈ సందర్భంగా ప్రధాని సూచించారు.

## మాసాబ్ ట్యాంక్‌లో దారుణ ఘటన


- న్యాయవాదిని కారుతో ఢీకొటంటి చంపిన దుండుగుల
- కారు నంబర్ ఆధారంగా పోలీసుల దర్యాప్తు

హైదరాబాద్,మే23 హైదరాబాద్ మాసబ్ ట్యాంక్ ప్రాంతంలో న్యాయవాది ఖాజా మొహియుద్దీన్‌పై ప్రత్యర్థులు దాడికి తెగబడ్డారు. శనివారం ఉదయం ఇంటి నుంచి బయటకు వచ్చిన న్యాయవాదిని దుండగులు కారుతో బలంగా ఢీకొట్టారు. పక్కా ప్లాన్‌తో న్యాయవాది కోసం వేచి చూస్తున్న దుండగులు.. ఖాజా మొహియుద్దీన్ బయటకు వచ్చిన వెంటనే అత్యంత వేగంగా వచ్చి ఢీకొట్టి పరారయ్యారు. కారు ఢీకొట్టిన వెంటనే న్యాయవాది గాల్లోకి ఎగిరి కిందపడ్డారు. దీంతో ఆయనకు తీవ్రమైన గాయాలయ్యాయి. వెంటనే గమనించిన కుటుంబసభ్యులు.. మొహియుద్దీన్‌ను హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు.అయితే ఆయన అప్పటికే మృతి చెందారు. న్యాయవాదిపై హత్యాయత్నం దృశ్యాలు సీసీటీవీ కెమెరాలో రికార్డ్ అయ్యాయి. న్యాయవాదిపై దాడి సమాచారం తెలుసుకున్న తోటి న్యాయవాదులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖాజా మొహియుద్దీన్‌ను కారుతో ఢీకొట్టిన దుండగులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఇది న్యాయవ్యవస్థపైనే దాడి అని వారు అభివర్ణించారు. ఈ ఘటనపై నాంపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. న్యాయవాదిపై దాడికి గల కారణాలు, ఆయనపై ఎవరు దాడి చేశారనే దానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. కారు నంబర్ ఆధారంగా నిందితులను గుర్తించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఇకపోతే మాసబ్‌ట్యాంక్ వద్ద కారు ఢీకొన్న ఘటనలో తీవ్రంగా గాయపడ్డ న్యాయవాది ఖాజా మొయినుద్దీన్ కన్నుమూశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ న్యాయవాది తుదిశ్వాస విడిచారు. న్యాయవాది తన కారు వద్దకు వచ్చి వెనక సీట్లో బ్యాగు పెట్టి.. డ్రైవింగ్ సీట్‌లో కూర్చోబోతున్న సమయంలో ఒక్కసారిగా దుండగులు కారుతో అతివేగంగా దూసుకొచ్చి బలంగా ఢీకొట్టారు. క్షణాల్లోనే ఈ ఘటన చోటు చేసుకుంది. న్యాయవాదికి తీవ్రమైన గాయాలవడంతో వెంటనే కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే న్యాయవాది పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. చివరకు చికిత్స పొందుతూ మొయునుద్దీన్ ప్రాణాలు కోల్పోయారు. సీసీటీవీ కెమెరాలను పరిశీలించిన పోలీసులు.. కారు నంబర్ ఆధారంగా నిందితులను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

## పవన్‌తో పోలవరం ఎమ్మెల్యే భేటీ

### నియోజకవర్గ అభివృద్ధి తదితరాలపై చర్చ

### అభివృద్ధి పనులను సకాలంలో పూర్తిచేయాలని సూచన



అమరావతి,మే23 ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా.. పోలవరం ఎమ్మెల్యేగా ఆయన పని తీరుపై డిప్యూటీ సీఎం సమీక్ష నిర్వహించారు. పోలవరం నియోజకవర్గం పరిధికి సంబంధించి పార్టీ దృష్టికి వచ్చిన విషయాలు, ఆరోపణలపై ఎమ్మెల్యేను పవన్ వివరణ అడిగినట్లు తెలుస్తోంది. తన వ్యక్తిగత విషయాలను కుటుంబ సభ్యులతో కలిసి కూర్చొని చక్కదిద్దుకొనేందుకు కొంత గడువు ఇవ్వాలని ఎమ్మెల్యే కోరగా.. నాలుగు వారాల్లోగా చక్కదిద్దుకోవాలని పవన్ సూచించినట్లు సమాచారం. పోలవరం నియోజకవర్గంలో పంచాయతీల్లో అభివృద్ధి పనులకు ఇప్పటి వరకు రూ.147 కోట్లు కేటాయించారు. ఆ పనుల పురోగతిపైనా డిప్యూటీ సీఎం సమీక్ష చేశారు. పనుల సకాలంలో వేగంగా పూర్తి చేయకపోవడంపై పవన్ ప్రశ్నించారు. అధికారులను సమన్వయం చేసుకుంటూ పనులను వేగవంతం చేస్తానని, వ్యక్తిగత వ్యవహారాలు చక్కదిద్దుకోవాలని సూచించినట్లు సమాచారం.


## దంపతుల ఆదర్శ నిర్ణయం..! పెళ్లి రోజున నేత్ర, అవయవ దానానికి అంగీకారం



జ్యోతి నగర్ ఎన్టిపిసి మే 23 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

సమాజానికి ఆదర్శంగా నిలిచే నిర్ణయం తీసుకుంటూ గోదావరిఖనికి చెందిన భద్రకాళి ఫ్లెక్సీ ప్రింటర్స్ అధినేత గంధం మల్లేశం -- మంజుల దంపతులు తమ 35వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా మరణానంతరం నేత్రాలు, అవయవాలను దానం చేయాలని ప్రకటించారు. ఈ సందర్భంగా సదాశయ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు, కమాన్‌పూర్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సానా రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో దంపతులను శాలువాతో సత్కరించి అభినందన పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సానా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సమాజానికి సందేశమిచ్చేలా నేత్ర, అవయవ దానానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఇలాంటి నిర్ణయాలు మరెందరికో స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో లింగమూర్తి, కే.ఎస్. వాసు, నల్లవెల్లి శంకర్, పందిళ్ల శ్యామ్‌సుందర్ పాల్గొని దంపతుల నిర్ణయాన్ని అభినందించారు. కార్యక్రమంలో దంపతుల కుమారుడు వినోద్‌కుమార్, కుమార్తె నవ్యశ్రీ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఎస్.సి సెల్ జిల్లా చైర్మన్ గా పైడిమల్ల నర్సింగ్




మంచిర్యాల జిల్లా/ మందమర్రి/ మే 23/ అక్షరం న్యూస్ –:

కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మంచిర్యాల జిల్లా చైర్మన్ గా మందమర్రి పట్టణానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు పైడిమల్ల నర్సింగ్ ను నియమిస్తూ శనివారం హైద్రాబాద్ గాంధీ భవన్ లో జరిగిన ఒక కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ సెల్ చైర్మన్ కవ్వంపల్లి సత్యనారాయణ, వైస్ చైర్మన్ సుదర్శన్ రావు లు నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం మర్యాదపూర్వకంగా రాష్ట్ర ఎస్సీ సెల్ చైర్మన్ కవ్వంపల్లి సత్యనారాయణకి పుష్ప గుచ్ఛం ఇచ్చి శాలువాతో ఘనంగా సన్మానించడం జరిగింది. నాపై నమ్మకంతో నాకు ఈ బాధ్యతగా పదవిని ఇచ్చినందుకు తెలంగాణ కార్మిక శాఖ మంత్రివర్యులు డాక్టర్ గడ్డం డాక్టర్ వివేక్ వెంకటస్వామి, మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, బెల్లంపల్లి ఎంఎల్ఏ గడ్డం వినోద్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పిన్నింటి రఘునాథరెడ్డి లకి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

## నాలుగు నెలలుగా జీతాలు రాక నరకయాతన

- జి.ఎం సార్ కనికరించండి.
- సులభ్ కార్మికుల ఆక్రందన.



మంచిర్యాల జిల్లా/మందమర్రి/ మే 23/అక్షరం న్యూస్ –:

మందమర్రిలోని సులబ్ కాంప్లెక్స్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు గత నాలుగు నుంచి ఐదు నెలలుగా జీతాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం పట్టణంలోని ప్రెస్ క్లబ్లో ఏర్పాటుచేసి విలేకరుల సమావేశంలో వారి గోడును వెల్లబోసుకున్నారు. నాలుగు నెలల జీతాలు రాక కుటుంబ పోషణ కూడా కష్టంగా మారిందని వారు వాపోయారు. ఈ విషయమై సూపర్వైజర్ అఖిలేష్ కుమార్‌ను పలుమార్లు సంప్రదించగా, కొత్తగా వచ్చిన జీఎం రాధాకృష్ణ తమ బిల్లులపై సంతకం చేయడం లేదని, అందువల్ల జీతాలు విడుదల కావడం లేదని చెప్పినట్లు కార్మికులు పేర్కొన్నారు. ఇప్పటికే ఆర్థిక ఇబ్బందులతో తీవ్రంగా నష్టపోతున్నామని, రోజువారీ అవసరాలు తీర్చుకోవడం కూడా భారంగా మారిందని కార్మికులు వాపోయారు. స్థానిక జీఎం వెంటనే చొరవ తీసుకుని సులబ్ కాంప్లెక్స్‌లలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను గుర్తించి, పెండింగ్‌లో ఉన్న జీతాలను త్వరితగతిన చెల్లించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో రామ్ అజయ్, ఎరుకల పద్మ, మిరియాల సారయ్య, పల్ల మహేశ్వరి, కనకయ్య, సమ్మయ్య, అమృత, సునీత, సువక్త, సంపత్, గణేష్, సాయి,లు పాల్గొన్నారు.

# మరో ఇద్దరికి వెలుగైన హోంగార్డ్ శ్రీనివాస్..!

- కన్నీళ్ల మధ్య నేత్రదానం...
- నివాళులర్పించిన డీసీపీ, ఎసిపి, సీఐలు, హోంగార్డులు
- భార్య చేతుల మీదుగా అంతిమ వీడ్కోలు



జ్యోతి నగర్ ఎన్టిపిసి ఎమ్ 23 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

పోలీస్ డ్రెస్‌లో మూడు దశాబ్దాలపాటు ప్రజా సేవ చేసిన ఓ హోంగార్డ్... చివరికి తన మరణానంతరం కూడా మరో ఇద్దరి జీవితాల్లో వెలుగు నింపాడు. ఇంటి ముందర విషాదం ముసురుకున్నా, కన్నీరే కళ్లల్లో నిండినా... "అతని చూపు మరో ఇద్దరిలో బతికుండాలి" అన్న కుటుంబ సభ్యుల నిర్ణయం అందరినీ కదిలించింది. పెద్దపల్లి జిల్లా గోదావరిఖని శ్రీనగర్ కాలనీలో శనివారం చోటుచేసుకున్న ఈ ఘటన ప్రతి ఒక్కరి హృదయాన్ని తాకింది. గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో హోంగార్డ్‌గా పనిచేస్తున్న బుట్టి శ్రీనివాస్ (51) శుక్రవారం రాత్రి అకాల మరణం చెందాడు. ఆ వార్త తెలిసిన క్షణం నుంచి ఇంటి వద్ద విషాదం అలుముకుంది. భార్య జ్యోతి, తల్లి లింగమ్మ గుండెలవిసేలా విలపించారు. తోటి హోంగార్డులు, కాలనీ ప్రజలు, బంధువులు ఇంటి వద్దకు చేరుకుని కన్నీటి నివాళులు అర్పించారు. అలాంటి క్లిష్ట సమయంలో మాజీ కానిస్టేబుల్, సదాశయ ఫౌండేషన్ జిల్లా సలహాదారుడు, మృతుని దగ్గరి బంధువు దేవి లక్ష్మీనర్సయ్య కుటుంబ సభ్యులకు నేత్రదానం గురించి అవగాహన కల్పించారు. "శ్రీనివాస్ చూపు మరో ఇద్దరిలో బతికే ఉంటుంది" అన్న మాట భార్య, తల్లి మనసులను తాకింది. తీవ్ర దుఃఖంలో ఉన్నప్పటికీ వారు గొప్ప మనసుతో నేత్రదానానికి అంగీకరించారు. సదాశయ ఫౌండేషన్ జాతీయ ప్రచార కార్యదర్శి కే.ఎస్. వాసు ఆధ్వర్యంలో, ఐ టెక్నీషియన్ ప్రదీప్ నాయక్ సహకారంతో కార్నియాలను సేకరించి హైదరాబాద్‌లోని ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంక్‌కు తరలించారు. మరణానంతరం కూడా ఇద్దరు అంధుల జీవితాల్లో వెలుగు నింపిన శ్రీనివాస్‌కు అక్కడున్న ప్రతి ఒక్కరూ నివాళులర్పించారు.



### "మా శ్రీనివాస్ సేవలను ఎప్పటికీ మర్చిపోలేం.."

శ్రీనివాస్ మృతదేహానికి డీసీపీ రాంరెడ్డి స్వయంగా నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ...1996లో హోంగార్డ్‌గా చేరిన శ్రీనివాస్ గత 30 ఏళ్లుగా నిజాయితీతో, నిబద్ధతతో ప్రజా సేవలో పనిచేశారని గుర్తు చేశారు. ఆయన మరణం పోలీస్ శాఖకు తీరని లోటని అన్నారు. పోలీస్ శాఖ తరఫున కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఏసీపీ రమేష్, సీఐలు ఇంద్రసేనా రెడ్డి, కృష్ణ, హోంగార్డ్ ఆర్ఐ పెద్దన్న, ఎంటీవో మల్లేశం, తోటి హోంగార్డులు కుటుంబాన్ని పరామర్శించారు. శ్రీనివాస్ సేవలను స్మరించుకుంటూ గౌరవ వందనం సమర్పించారు.

### భర్తకు భార్యే అగ్గిపట్టిన వేళ...

ఈ ఘటనలో ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టించింది మాత్రం చివరి ఘట్టం. ప్రేమించి పెళ్లి చేసుకున్న భర్త మృతదేహం ముందు జ్యోతి విలపించిన తీరు అక్కడున్నవారి హృదయాలను కదిలించింది. "నన్ను చదివించి లెక్చరర్ చేశాడు... నా జీవితాన్ని నిలబెట్టాడు..." అంటూ ఆమె రోదించిన మాటలు వినగానే చాలామంది కన్నీళ్లు ఆపుకోలేకపోయారు. శవయాత్రలో భర్తకు అగ్గిపట్టుకొని భార్య జ్యోతి ముందుకు నడిచిన దృశ్యం చూసి కాలనీ ప్రజలు, తోటి హోంగార్డులు మౌనంగా కన్నీరు మున్నీరయ్యారు. జీవితాంతం తోడుగా ఉంటానన్న వ్యక్తికి చివరి వీడ్కోలు ఇస్తూ ఆమె వేసిన ప్రతి అడుగు అక్కడ విషాదాన్ని మరింత గాఢం చేసింది. శ్మశానవాటికలో అంత్యక్రియలు పూర్తయ్యే వరకు అక్కడున్న ప్రతి హృదయం భారంగా మారింది. అయితే తన చూపుతో మరో ఇద్దరి జీవితాల్లో వెలుగు నింపిన శ్రీనివాస్ మాత్రం అందరి మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోయాడు.

## కాలిబూడిదైనమొక్కజోన్న పంట



మహబూబాబాద్ జిల్లా/ గంగారం/ మే24(అక్షరం న్యూస్ )

మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం బావురుగొండ గ్రామానికి చెందిన వజ్జ జంపయ్య 5 ఎకరాలు చుంచ పాపయ్య 4 ఎకరాలు రైతులు ఆరబోసిన మొక్కజొన్న ధాన్యానికి అకస్మాత్తుగా ఎరగలు (నిప్పురవ్వలు/మంటలు) అంటుకున్నాయి. ఎండ తీవ్రతకు మంటలు క్షణాల్లో వ్యాపించడంతో, ఆరబోసిన మొక్కజొన్న పంట పూర్తిగా కాలి బూడిదైంది. కళ్లముందే తమ ఏడాది కష్టం అగ్నికి ఆహుతి కావడంతో బాధితుడు, అతని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. సమాచారం అందుకున్న స్థానికులు మంటలను అదుపు చేయడానికి ప్రయత్నించినప్పటికీ, అప్పటికే నష్టం జరిగిపోయింది. లక్షల రూపాయల మేర నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం స్పందించి తమను ఆర్థికంగా ఆదుకోవాలని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## తునికి ఆకు కోసం అడవికి వెళ్లి.. మృత్యుఒడిలోకి!?

- కుటుంబ పోషణ కోసం అడవికి వెళ్లిన ఓ మహిళను విధి విషాదంగా వెంటాడింది.



మహబూబాబాద్ జిల్లా/ కొత్తగూడ/ మే23(అక్షరం న్యూస్ )

కుటుంబ పోషణ కోసం అడవికి వెళ్లిన ఓ మహిళను విధి విషాదంగా వెంటాడింది. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం కర్ణగండి గ్రామానికి చెందిన మద్దెల పల్లవి తునికి ఆకులు సేకరిస్తుండగా పాముకాటుకు గురై చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయింది. గ్రామస్థుల వివరాల ప్రకారం.. పల్లవి తన భర్త సారయ్యతో కలిసి అడవికి వెళ్ళింది. తునికి ఆకులు తెంపుతున్న సమయంలో అకస్మాత్తుగా విషసర్పం ఆమెను కరిచింది. వెంటనే అప్రమత్తమైన కుటుంబ సభ్యులు, తోటి కూలీలు ఆమెను కొత్తగూడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆరోగ్య పరిస్థితి క్షీణించడంతో వైద్యులు వరంగల్ ఏరియా ఆసుపత్రికి రిఫర్ చేశారు. అక్కడ చికిత్స కొనసాగుతున్నప్పటికీ శనివారం తెల్లవారుజామున పల్లవి మృతి చెందింది. కూలి పనులతో జీవనం సాగించే కుటుంబంలో ఈ ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. పల్లవి మృతితో కర్ణగండి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటనపై తుడుం దెబ్బ కొత్తగూడ మండల అధ్యక్షులు పూనెం సందీప్ స్పందిస్తూ.. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

## కుమారుల జ్ఞాపకార్థం అమ్మ పరివార్లో అన్నదానం



జ్యోతి నగర్ ఎన్టిపిసి మే 23 పెద్దపల్లి జిల్లా అక్షర న్యూస్

కరోనా కారణంగా వారం రోజుల వ్యవధిలో ఇద్దరు కుమారులను కోల్పోయిన గోదావరిఖని మార్కండేయ కాలనీకి చెందిన రామిళ్ల రామలింగం--మంగళ దంపతులు గత ఐదు సంవత్సరాలుగా వారి జ్ఞాపకార్థం సమాజహిత కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. శనివారం తమ కుమారుడు రామిళ్ల శైలేంద్రకుమార్ ఐదవ వర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి స్థానిక ఫైవ్ ఇంక్లైన్ ఏరియాలోని అమ్మ పరివార్ ఆశ్రమంలో నిరాశ్రయులకు అన్నదానం చేసారు. పండ్లు, స్వీట్లు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తీవ్ర విషాదాన్ని తట్టుకొని సేవా కార్యక్రమాలు చేపడుతున్న రామిళ్ల దంపతుల సేవాభావం అభినందనీయమన్నారు. సమాజంలోని దాతలు కూడా వీరిని ఆదర్శంగా తీసుకొని నిరాశ్రయులను ఆదుకోవడానికి ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో రామిల్ల కుటుంబ సభ్యులు శైలజ, వైష్ణవి, వణుష్ణ, రాజేంద్రకుమార్, జ్యోతి, విశ్వజిత్, నిత్యసాయి, మహేంద్ర కుమార్, సుప్రియ, కృతిక్, రవీంద్రకుమార్, గురుపాదం, మిత్రులు మేజిక్ రాజా, మేజిక్ హరి, చంద్రపాల్, ఆశ్రమ నిర్వాహకులు నాగరాజు, కరణ్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక నేత మిరియాల రాజిరెడ్డికి ఆత్మీయ సన్మానం...



జ్యోతి నగర్ ఎన్టిపిసి మే 22 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

: తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం కేంద్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డికి మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు ఇన్చార్జిగా బాధ్యతలు అప్పగించినందుకు గాను యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ జాహెద్ పాషా ఘనంగా సన్మానించారు. గోదావరిఖని ప్రెస్ క్లబ్ ఆవరణలో శనివారం జరిగిన కార్యక్రమంలో మిర్యాల రాజిరెడ్డి కి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా జాహెద్ పాషా మాట్లాడుతూ... గత కొన్నేళ్లుగా కార్మిక నేతగా కొనసాగుతున్న రాజారెడ్డి కార్మికుల హక్కులను సాధిస్తూ... కార్మికుల సమస్యలను నిరంతరం పరిష్కరించిన ఆయన భవిష్యత్తులో మరెన్నో పదవులను అధిరోహించాలని కోరుకున్నారు. సభ్యత్వ నమోదు ఇన్చార్జిగా బాధ్యతలు తీసుకున్న సందర్భంగా పలువురు కార్మిక నేతలు రాజిరెడ్డి కి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు అడ్డగట్ల గోపి, నూతి రాజ్ కుమార్, జనగామ మల్లేష్, దూట శేషగిరి, చల్ల రవీందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## రామగుండం రైల్వే వాగన్ వర్క్‌షాప్ కార్మికులకు వేసవి ఉపశమన చర్యలు చేపట్టాలి



జ్యోతి నగర్ ఎన్టిపిసి, మే 23:
పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్ ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో రామగుండం రైల్వే వాగన్ వర్క్‌షాప్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ మరియు పర్మినెంట్ కార్మికులకు టోపీలు, మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు మరియు చల్లని తాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ అసిస్టెంట్ డివిజనల్ మెకానికల్ ఇంజనీర్ ప్రభాకర్కి రైల్వే బోర్డు మెంబర్ అనుమాస శ్రీనివాస్ మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా రైల్వే అధికారులు కార్మికుల సమస్యలపై సానుకూలంగా స్పందించడం పట్ల కార్మికుల తరఫున డివిజనల్ రైల్వే మెంబర్ అనుమస శ్రీనివాస్ జీన్స్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. వేసవి తీవ్రత దృష్ట్యా కార్మికులు మరియు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రతి అరగంటకోసారి తాగునీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ తీసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో గొల్లపల్లి వెంకటేష్, ఈ. లక్ష్మణ్, మాచర్ల వినోద్, ఆర్. కనకపాల్ తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి విక్రయించినా, సేవించినా కఠిన చర్యలు : గోదావరిఖని టూ టౌన్ సీఐ ప్రసాదరావు



జ్యోతి నగర్ ఎన్టిపిసి మే 23 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్
గంజాయి విక్రయించినా, సేవించినా చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని గోదావరిఖని టూ టౌన్ సీఐ ప్రసాదరావు హెచ్చరించారు. గోదావరిఖని టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని 8 ఇంక్లైన్ కాలనీ, సిర్కే చౌరస్తా, ఆటోస్టాండ్, టీస్టాళ్లు, పాన్ షాపులు, ప్రభుత్వ హైస్కూల్ ప్రాంతం, కేకే నగర్‌తో పాటు ప్రజలు రద్దీగా ఉండే ప్రాంతాల్లో గోదావరిఖని టూ టౌన్ సీఐ ప్రసాదరావు, నార్కోటిక్ ఇన్‌స్పెక్టర్ ఎం.రాజ్‌కుమార్, నార్కోటిక్ బృందం సంయుక్తంగా శనివారం జాగిలాలతో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ... గంజాయి, ఇతర మత్తు పదార్థాలను సేవించినా, విక్రయించినా, రవాణా చేసినా కఠినచర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వారు వెంటనే పోలీసులకు లేదా డయల్-100కు సమాచారం అందించాలని కోరారు. ఈ తనిఖీల్లో గోదావరిఖని టూ టౌన్ సీఐ ప్రసాదరావు, నార్కోటిక్ వింగ్ ఇన్‌స్పెక్టర్ ఎం. రాజ్‌కుమార్, పెద్దపల్లి నార్కోటిక్ టీమ్ సిబ్బంది, డాగ్ స్క్వాడ్ సిబ్బంది, స్థానిక పోలీసుసిబ్బంది పాల్గొన్నారు.

## పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : మేయర్ మహంకాళి స్వామి



జ్యోతి నగర్ ఎన్టిపిసి మే 23 పెద్దపల్లి జిల్లా అక్షరం
పేద ప్రజల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి అన్నారు. ఎన్‌టీపీసీలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో రెండవ డివిజన్ లబ్ధిదారులకు శనివారం ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మేయర్ మాట్లాడుతూ, మహిళలను మహాలక్ష్మిగా భావిస్తూ వారి సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, సబ్సిడీ గ్యాస్, ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా కోట్లాది రూపాయల రుణాలు అందిస్తూ మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని తెలిపారు.

రామగుండం నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో మహిళల పాత్ర ఎంతో కీలకమని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ తమ ఇంటిని శుభ్రంగా ఉంచుకున్నట్లే పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచేందుకు నగర పాలక సంస్థకు సహకరించాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు వెంగళ బాపు, భరత్ గౌడ్ కొలని కవిత, గట్ల రమేష్, వడ్లూరి రవి తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల వేతనాల పెంపుపై ప్రభుత్వ ప్రకటనలో స్పష్టత కొరవడి ఉంది

- **ప్రస్తుతం పొందుతున్న వేతనాలు తగ్గే ప్రమాదం ఉందని టీయూసీఐ ఆందోళన**




జ్యోతి నగర్ ఎన్టిపిసి మే 23 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్
గోదావరిఖనిలో ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) ఆధ్వర్యంలో జరిగిన ముఖ్య సమావేశంలో టీయూసీఐ పెద్దపెల్లి జిల్లా అధ్యక్షులు తోకల రమేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కార్మికుల వేతనాల పెంపుపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. రాష్ట్రంలో ఉన్న 73 షెడ్యూల్డ్ ఉద్యోగ రంగాలలో 2021లో నిర్ణయించిన రూ.18 వేల ప్రాథమిక వేతనంపై స్పష్టత ఇవ్వకుండా కొత్త ప్రతిపాదనలు తీసుకురావడం కార్మికుల్లో అయోమయానికి దారితీస్తోందన్నారు. వేతనాల పెంపులో ప్రాథమిక వేతనం, కరువు భత్యం (వీడీఏ) అంశాలపై పూర్తి వివరాలు లేకపోవడం వల్ల కార్మికులకు నష్టం జరిగే అవకాశముందని తెలిపారు. ప్రస్తుతం ప్రైవేట్ రంగంలో ఒప్పంద కార్మికులకు అమలులో ఉన్న జీవో-11 ప్రకారం నైపుణ్యం కలిగిన కార్మికులకు రూ.23,683 వరకు వేతనం లభిస్తుండగా, ప్రభుత్వం ప్రకటించిన రూ.20 వేల వేతనం వల్ల ఇప్పటికే పొందుతున్న జీతాలు తగ్గే పరిస్థితి తలెత్తవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మిక సంఘాలు చాలాకాలంగా కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించాలని డిమాండ్ చేస్తున్నాయని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా శాస్త్రీయ పద్ధతిలో వేతన సవరణ చేయాల్సిన అవసరం ఉందన్నారు. డాక్టర్ అక్రాయిడ్ సూత్రం ఆధారంగా వేతనాలు నిర్ణయించి, కరువు భత్యాన్ని తప్పనిసరిగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. 2021లో ప్రకటించిన రూ.18 వేల ప్రాథమిక వేతనాన్ని అన్ని షెడ్యూల్డ్ ఉద్యోగ రంగాలకు వర్తింపజేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న ఒప్పంద, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాల పెంపుపై జీవో-60ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో టీయూసీఐ నాయకులు గొల్లపల్లి చంద్రయ్య, ఆడేపు శంకర్, గుమ్మడి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# భానుపురిపై భానుడి ప్రతాపం..

- **వేడితో విలవిలలాడుతున్న జనజీవనం..**
- **ఉదయం నుంచే మండిపోతున్న ఎండలు..**
- **సాయంత్రం వరకు తగ్గని వేడి ఇళ్లకే పరిమితమైన ప్రజలు..**
- **వెలవెలబోతున్న రహదారులు..**
- **వాతావరణ మార్పుల ప్రభావంతో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు..**
- **వర్షాల కోసం ఎదురుచూపులు..**



సూర్యాపేట మే 23 (అక్షరం న్యూస్)
సూర్యాపేట జిల్లా భానుపురి ప్రాంతం ప్రస్తుతం భానుడి ప్రతాపంతో అల్లాడిపోతోంది. ప్రతి రోజు ఉదయం సూర్యుడు ఉదయించిన కొద్దిసేపటికే మండుటెండలు మొదలవుతుండగా, మధ్యాహ్నానికి వేడి తారాస్థాయికి చేరుకుంటోంది. రహదారులపై నుంచి వేడి ఆవిరి ఎగిసిపడుతున్నట్లుగా కనిపిస్తుండటంతో ప్రజలు బయటకు రావడానికే భయపడుతున్నారు. సాయంత్రం వరకు వేడి గాలులు వీచడంతో జనజీవనం పూర్తిగా అస్తవ్యస్తమవుతోంది. గతంలో వేసవి కాలంలో మధ్యాహ్నం సమయంలో మాత్రమే తీవ్ర వేడి ఉండేదని, కానీ ఇప్పుడు ఉదయం నుంచే ఎండలు మండిపోతుండటంతో పరిస్థితి మరింత దారుణంగా మారిందని స్థానికులు చెబుతున్నారు. “ఇంట్లో నుంచి బయట అడుగు పెడితేనే ఒళ్లంతా మంటలు వేసినట్టుగా ఉంది. మధ్యాహ్నం వేళ బయట నిలబడటం కూడా కష్టంగా మారింది” అని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భానుపురి ప్రధాన రహదారులు, బజార్లు సాధారణ రోజుల్లో జనసంచారంతో కిటకిటలాడుతుంటాయి. కానీ ప్రస్తుతం ఎండ తీవ్రత కారణంగా మధ్యాహ్నం సమయంలో ఆ ప్రాంతాలు నిర్మానుష్యంగా మారిపోతున్నాయి. అత్యవసర పనులు ఉన్నవారు తప్ప మరెవరూ బయటకు రావడం లేదు. చాలామంది తమ పనులను ఉదయం లేదా రాత్రి వేళల్లో పూర్తి చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఎండ ప్రభావం వ్యాపార రంగంపైనా తీవ్రంగా పడుతోంది. చిన్న చిన్న దుకాణాలు, టీ స్టాళ్లు, పండ్ల వ్యాపారులు, వీధి వ్యాపారులు కస్టమర్లు లేక తీవ్ర నష్టాలు ఎదుర్కొంటున్నారు. ఉదయం కొంతమంది వచ్చినా, మధ్యాహ్నం తర్వాత వ్యాపారం పూర్తిగా నిలిచిపోతుందని వ్యాపారులు చెబుతున్నారు. కొందరు వ్యాపారులు వేడి తట్టుకోలేక మధ్యాహ్నానికే షాపులు మూసివేస్తున్నారు. “రోజంతా షాప్ తెరిచి పెట్టినా కస్టమర్లు రావడం లేదు. వేడి వల్ల రోడ్లపై ఎవరూ కనిపించడం లేదు. విద్యుత్ బిల్లులు, అద్దెలు చెల్లించడం కూడా కష్టమవుతోంది” అని ఒక వ్యాపారి వాపోయాడు. మరోవైపు చల్లని పానీయాలు, కొబ్బరి నీళ్లు, ఐస్ క్రీమ్ దుకాణాల వద్ద మాత్రం కొంత రద్దీ కనిపిస్తోంది. వృద్ధులు, చిన్నారులు, అనారోగ్యంతో బాధపడుతున్నవారిపై ఈ ఎండల ప్రభావం మరింత ఎక్కువగా కనిపిస్తోంది. డీహైడ్రేషన్, అలసట, తలనొప్పి, వడదెబ్బ వంటి సమస్యలతో ఆసుపత్రులకు వచ్చే వారి సంఖ్య పెరుగుతోందని వైద్యులు చెబుతున్నారు. తగినంత నీరు తాగడం, మధ్యాహ్న సమయంలో బయట తిరగకుండా ఉండడం, తేలికపాటి దుస్తులు ధరించడం వంటి జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని సూచిస్తున్నారు. రోజు వ్యాపారం చేసి పుటగడుపుకునే చిరు వ్యాపారాలు, రోడ్లపై కూరగాయల వ్యాపారులకు జీవనోదు కోల్పోయింది అని చెప్పాలి. పశువులకు తాగునీటి సమస్యలు తలెత్తుతున్నాయని రైతులు చెబుతున్నారు. చెరువులు, బోర్లు ఎండిపోతుండటంతో వేసవి ప్రభావం మరింతతీవ్రంగామారుతోంది. పర్యావరణ నిపుణుల అభిప్రాయం ప్రకారం చెట్ల సంఖ్య తగ్గిపోవడం, పట్టణీకరణ పెరగడం, కాలుష్యం అధికమవడం, వాతావరణ మార్పులు వంటి కారణాలతో ఉష్ణోగ్రతలు ప్రతి ఏడాది పెరుగుతున్నాయి. గతంతో పోలిస్తే ఇప్పుడు వేసవి కాలం మరింత ప్రమాదకరంగా మారుతోందని వారు హెచ్చరిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, చెట్లు నాటడం ద్వారా మాత్రమే భవిష్యత్ తరాలకు రక్షణ కల్పించగలమని సూచిస్తున్నారు. సాయంత్రం అయ్యాక కూడా వేడి పూర్తిగా తగ్గకపోవడంతో ప్రజలు ఇళ్ల ముందు, పార్కులు, చెట్ల నీడల్లో కూర్చొని కొంత ఉపశమనం పొందేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే రాత్రి వేళల్లో కూడా ఉక్కపోత తగ్గకపోవడంతో చిన్నారులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక ప్రజలందరూ వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు. ఒక మంచి వర్షం పడితేనే ఈ భానుడి భగభగల నుంచి ఉపశమనం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు కూడా తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. భానుపురిలో కొనసాగుతున్న ఈ మండుటెండలు ప్రజల సహనానికి పరీక్షగా మారాయి.

## డిస్కౌంట్ లో పేరుతో మెడిప్లస్ మోసాలను అరికట్టాలి..

- **డాక్టర్ రాసినవి కాకుండా వారి కంపెనీకి చెందిన మందులను ఇవ్వడం ఏమిటి...??**
- **జిల్లా కెమిస్ట్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు యామా ప్రభాకర్..**



సూర్యాపేట, మే 23(అక్షరం న్యూస్)
సూర్యాపేట జిల్లా కేంద్రంలో మెడిప్లస్ మెడికల్ దుకాణాల్లో డిస్కౌంట్ల పేరుతో భారీ మోసం జరుగుతుందని జిల్లా కెమిస్ట్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు యామా ప్రభాకర్ ఆరోపించారు. అధిక ధరలకు డాక్టర్ రాసిన మందులు కాకుండా వారి కంపెనీకి చెందిన మందులు ఇవ్వడం పట్ల శనివారం సదరు మెడిప్లస్ మెడికల్ దుకాణం ఎదుట ఆయన మీడియాతో మాట్లాడారు. డాక్టర్ రాసిన ప్రిస్క్రిప్షన్తో సంబంధం లేకుండా తమ కంపెనీలకు చెందిన మందులపై అధిక ధరలను వేసి విక్రయిస్తున్నారని తెలిపారు. డాక్టర్ రాసిన ప్రిస్క్రిప్షన్ చిట్టిపై ఉన్న మందులు వారి వద్ద లేనప్పుడు రోగికి ఆ విషయాన్ని చెప్పకుండా తమ వద్ద ఉన్న మందులు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. డాక్టర్ రాసిన మందుల విలువ బయట ఒక టాబ్లెట్ ఫార్మసీలో రూ 90, జనరిక్లో రూ 160 ఉంటే ఇక్కడ వారి కంపెనికి చెందిన టాబ్లెట్పై రూ 220ల పైచీలుకు ధర వేసి 25 శాతం డిస్కౌంట్ అంటూ రూ 190కి విక్రయిస్తున్నారని ఇక్కడ వారు ఏం డిస్కౌంట్ ఇచ్చారని ప్రశ్నించారు. ప్రజలు ఇలాంటి రకాల మోసాలను గుర్తించి కార్పోరేట్ కంపెనీలకు చెందిన మెడికల్ దుకాణాలను నమ్మవద్దని సూచించారు. ఆయన వెంట భిక్షపతి, మనసాని నాగేశ్వరరావు, వెంకట్, జి.రవి, వెంకటరెడ్డిలు పాల్గొన్నారు.

## 88.60 కోట్ల యూఐడీఎఫ్ నిధులతో నగరంలో నీటి సరఫరా మెరుగుదల : మేయర్ మహంకాళి స్వామి



జ్యోతి నగర్ ఎన్టిపిసి మే 23 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్
రామగుండం నగరంలో నీటి సరఫరాను మరింత మెరుగుపరచేందుకు రూ.88.60 కోట్ల అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ ఫండ్ (యూఐడీఎఫ్) నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులపై రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి శనివారం సమీక్ష నిర్వహించారు. పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ విభాగం, మునిసిపల్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు, సంబంధిత కాంట్రాక్టర్‌తో కలిసి ఆయన పనుల పురోగతిపై చర్చించారు.

ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, నీటి సరఫరా అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా కొత్తగా నిర్మించనున్న ఎనిమిది ఎలివేటెడ్ లెవెల్ సర్వీస్ రిజర్వాయర్ల (ఈఎల్ఎస్ఆర్) కోసం తక్షణమే స్థలాలను గుర్తించాలని మునిసిపల్ ఇంజనీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ రంగ సంస్థలకు చెందిన భూములు అందుబాటులో ఉన్నట్లయితే ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ సహకారంతో ఆయా సంస్థల ఉన్నతాధికారులతో చర్చించి స్థలాల కేటాయింపుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇప్పటివరకు పూర్తిస్థాయిలో నీటి సరఫరా అందని లేదా పాక్షికంగా మాత్రమే సరఫరా జరుగుతున్న ప్రాంతాలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన సూచించారు. ముఖ్యంగా పి.కె., రామయ్య కాలనీ ప్రాంతాల్లో ఈఎల్ఎస్ఆర్ నిర్మాణం చేపడితే లింగాపూర్, మేడిపల్లి తదితర ప్రాంతాలకు ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. ప్రాజెక్ట్‌లో భాగంగా 76 కిలోమీటర్ల మేర డిస్ట్రిబ్యూషన్ పైప్‌లైన్ నెట్‌వర్క్ నిర్మాణం చేపట్టనున్నట్లు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని లీకేజీలు రాకుండా నాణ్యతతో కూడిన డీఐ పైప్‌లైన్లు వేయాలని, దీని వల్ల ఎక్కువకాలం మన్నికగా ఉండే అవకాశాలు ఉంటాయని మేయర్ సూచించారు. పనులను త్వరితగతిన ప్రారంభించి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో రామగుండం నగర పాలక సంస్థ ఎస్ఈ గురువీర, పబ్లిక్ హెల్త్ డీఈ నరసింహస్వామి, మున్సిపల్ డీఈ జగదీశ్వర్, ఏఈలు మీర్, మనోజ్, మౌనిక, కోయ కన్స్ట్రక్షన్స్ ప్రతినిధి రావత్ తదితరులు పాల్గొన్నారు.

## రఘునాథపాలెం పోలీస్ స్టేషన్ ను సందర్శించిన పోలీస్ కమిషనర్



ఖమ్మం స్టాఫ్ రిపోర్టర్ మే 23 (అక్షరం న్యూస్)

రఘునాథపాలెం పోలీస్ స్టేషన్ ను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ శనివారం సందర్శించారు. పోలీస్ స్టేషన్ కు చేరుకున్న పోలీస్ కమిషనర్ స్టేషన్ నిర్వహణ, పోలీసుల పనితీరు, విచారణ నివేదికలు, జనరల్ డైరీ రికార్డులను, సీజ్ చేసిన వాహనాలు, పరిసరాలను పరిశీలించారు. రానున్న ఎన్నికలకు క్షేత్రస్థాయిలో అవగాహన ఉండాలని సెక్టర్ పోలీస్ ఆఫీసర్లకు సూచించారు. నిఘా వ్యవస్థను బలోపేతం చేసేందుకు సీసీటీవీ కెమెరాల ఏర్పాటుపై ప్రజలలో అవగాహన పెంపొందించాలన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదు అయిన కేసులు, డయల్ 100 కాల్స్ ప్రతిస్పందన సమయం, పెండింగ్ కేసులు పరిశీలించారు. విధిగా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తూ.. వాహనాల తనిఖీలు ముమ్మరం చేయాలని అన్నారు. పాత నేరస్థుల కదలికలను నిఘా పెట్టాలన్నారు.

## ఉపాధి హామీ, ఇందిరమ్మ ఇళ్లు, గ్రామ పంచాయతీ పనులపై అదనపు కలెక్టర్ సమీక్ష..



ఖమ్మం స్టాఫ్ రిపోర్టర్ మే 23/ తల్లాడ (అక్షరం న్యూస్)

ఖమ్మం జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) డా..శ్రీజ శనివారం తల్లాడ మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనుల పురోగతి, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ లక్ష్యాలు మరియు గ్రామ పంచాయతీల అభివృద్ధి పనుల అమలు తీరుపై వివరంగా సమీక్షించారు. జల్ సంచాయి జన్ భాగీదరి అనే కేంద్ర ప్రభుత్వ పథకం లక్ష్యమైన జల సంరక్షణ జల పొదుపు ప్రజల భాగస్వామ్యం యొక్క ప్రాముఖ్యతను వివరించి లక్ష్యాలను నిర్దేశించారు ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ఉపాధి హామీ పనులను వేగవంతం చేసి కూలీలకు సకాలంలో వేతనాలు చెల్లించాలని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను నిర్ణీత గడువులోగా నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామ పంచాయతీలలో పారిశుధ్యం, వీధి దీపాలు, మంచినీటి సరఫరా, వేస్ట్ టు వెల్త్ సెంటర్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.ప్రతి పనికి సంబంధించిన ఫోటోలను ఎన్ ఎం ఎం ఎస్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని, ఫీల్డ్ విజిట్లు పెంచాలని, లబ్ధిదారుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులకు స్పష్టం చేశారు.ఈ సమీక్షా సమావేశంలో ఎంపీడీవో ఏ. శ్రీధర్ రాజు , ఏపీ డి కల్లూరు చలపతి రావు, ఏపిఓ-ఈజీఎస్, ఏఈ-పిఆర్,ఏఈఈ మిషన్ భగీరథ (ఇంట్రా) సింధు, ఏఈ హౌజింగ్ అస్మా, ఏపిఎం రవి కుమార్, మండల పరిషత్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, సాంకేతిక సహాయకులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## రెండో రోజుకు చేరిన గ్రామ దీపికుల సమ్మె..



ఖమ్మం స్టాఫ్ రిపోర్టర్ మే 23 వైరా (అక్షరం న్యూస్)

వైరా రింగ్ రోడ్డు వద్ద గ్రామ దీపికలు సమస్యలు పరిష్కరించాలంటూ చేపట్టిన రిలే నిరాహార దీక్ష రెండో రోజుకి చేరుకుంది . గ్రామ దీపికల వేతనాల పెంపుదల తో పాటు ఉద్యోగ భద్రత కూడా కల్పించాలని దీక్షణ చేపట్టడం జరిగింది. గ్రామ దీపకులకు వేతనం పెంచి ప్రభుత్వం వారిని ఉద్యోగులుగా గుర్తించాలని ప్రతి గ్రామంలో గ్రామ దీపికాలు మహిళా సమైక్యాల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారని, ప్రభుత్వ పథకాలను సైతం ప్రజలకు వివరిస్తున్నారని, గ్రామ దీపికల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని వేతనం పెంచాలని అన్నారు. ప్రభుత్వం సంక్షేమ పథకాల విషయంలో గ్రామ దీపికలు పూర్తిస్థాయిలో ఆ పథకాల అమలను ప్రజలకు వివరించడంలో ముందున్నారని విషయాన్ని వారు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో గద్దె నీరజ, పద్మావతి, శైలజ , నిర్మల , మమత, తేజ, ప్రభావతి , రమాదేవి, రాధా, మణి, మల్లేశ్వరి ,విజయలక్ష్మి ,స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

### రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు

# విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలి....

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
- అధికారిక డీలర్ల వద్ద నుంచే విత్తనాలు,
- ఎరువులు కొనుగోలు చేయాలి..
- బిల్లు తప్పనిసరిగా తీసుకొని భద్రపరచుకోవాలి..
- ఎరువులు, విత్తనాల కొనుగోలుపై పత్రిక ప్రకటన విడుదల చేసిన జిల్లా కలెక్టర్..

ఖమ్మం స్టాఫ్ రిపోర్టర్ మే 23 (అక్షరం న్యూస్)

రాబోయే సాగు సీజన్‌లను దృష్టిలో ఉంచుకుని రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.తక్కువ ధరలకు విత్తనాలు అందిస్తామని, అధిక దిగుబడి వస్తుందని ప్రచారం చేస్తూ రైతులను మోసం చేసే ప్రయత్నాలు చేసే అవకాశం ఉందని, రైతులు అలాంటి మోసపూరిత ప్రచారాలను నమ్మకుండా అధికారిక లైసెన్స్ కలిగిన డీలర్ల వద్ద నుంచే విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాలని



సూచించారు.

అనధికారిక వ్యక్తులు లేదా గుర్తింపు లేని వ్యాపారుల వద్ద నుండి ఎట్టి పరిస్థితుల్లోనూ విత్తనాలు కొనుగోలు చేయవద్దని కలెక్టర్ సూచించారు.ప్రతి కొనుగోలుకు తప్పనిసరిగా బిల్లు తీసుకొని భద్రపరచుకోవాలని, వ్యవసాయ శాఖ సూచించిన ధృవీకరించిన రకాల విత్తనాలనే వినియోగించాలని, తెలియని కొత్త రకాల విత్తనాలు కొనుగోలు చేస్తే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. విత్తనాలను కొనుగోలు చేసే ముందు సంబంధిత వ్యవసాయ అధికారుల సలహాలు తీసుకోవాలని సూచించారు.నకిలీ విత్తనాలు, నకిలీ ఎరువులపై సమాచారం తెలిసినా లేదా ఎవరైనా అనుమానాస్పదంగా విక్రయించే ప్రయత్నం చేసినా వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1077 కు సమాచారం అందించాలని కలెక్టర్ తెలిపారు. ఖమ్మం జిల్లా కంట్రోల్ రూమ్ తక్షణమే స్పందించి అవసరమైన చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.జిల్లాలో నకిలీ విత్తనాల, ఎరువుల విక్రయాలను అరికట్టేందుకు ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నామని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. రైతులు అప్రమత్తంగా వ్యవహరించి నాణ్యమైన విత్తనాలను మాత్రమే వినియోగించి అధిక దిగుబడులు సాధించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

# బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకం క్రింద ప్రతిపాదనలు ఆహ్వానం...

- గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ విజయలక్ష్మి
- గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య, సమాన సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం..
- మే 30 సాయంత్రం 5 గంటలలోగా
- దరఖాస్తులు సమర్పించాలి..
- బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకం క్రింద ప్రైవేట్ పాఠశాలల నుండి దరఖాస్తులు ఆహ్వానం..

ఖమ్మం స్టాఫ్ రిపోర్టర్ మే 23 (అక్షరం న్యూస్)

3వ తరగతి నుండి 8వ తరగతిలో గిరిజన బాలురు, బాలికలను చేర్చుకునే విధంగా రాష్ట్ర ప్రభుత్వ బెస్ట్ అవైలబుల్ స్కూల్ (దీూూ) పథకం క్రింద 2026-27 విద్యా సంవత్సరానికి ఖమ్మం జిల్లాలోని ప్రసిద్ధ ఇంగ్లీష్ మీడియం ప్రైవేట్ హై స్కూళ్ల నుండి ప్రతిపాదనలు ఆహ్వానిస్తున్నట్లు గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎన్. విజయలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ పథకం క్రింద ఎంపికకు దరఖాస్తు చేసుకునే పాఠశాలలు మంచి ప్రతిష్ట కలిగి ఉండటంతో పాటు సహపాఠ్య, పాఠ్యేతర కార్యక్రమాలలో జిల్లా/రాష్ట్ర స్థాయి విజయాలు సాధించి, నాణ్యమైన విద్య అందిస్తున్న గుర్తింపు కలిగి ఉండాలని తెలిపారు.గత ఐదేళ్లుగా నిరంతరంగా 7వ, 10వ తరగతి పరీక్షల్లో 90 శాతం కంటే ఎక్కువ ఉత్తీర్ణతతో పాటు కనీసం 50 శాతం ఫస్ట్ క్లాస్ ఫలితాలు నమోదు చేసి ఉండాలని పేర్కొన్నారు. పాఠశాలలో తరగతి గదులు, డార్మిటరీలు, హాస్టళ్లు, ఇండోర్, అవుట్‌డోర్ క్రీడా సదుపాయాలు, ప్రయోగశాలలు, లైబ్రరీ, ఫర్నిచర్, ఆటస్థలాలు తదితర తగిన మౌలిక సదుపాయాలు ఉండాలని తెలిపారు.పాఠశాల, హాస్టల్ భవనాలకు ధృవీకరించిన భవన ప్రణాళిక (సర్టిఫైడ్ ప్లాన్) తప్పని సరిగా ఉండాలని పేర్కొన్నారు.విద్యార్థులకు సరైన వైద్య సేవలు అందించేందుకు తగిన వైద్య సదుపాయాలు కలిగి ఉండాలని తెలిపారు. తరగతి గదులు, హాస్టల్ భవనాలు అనుబంధ సదుపాయాలన్నీ ఆర్‌సీసీ పైకప్పుతో, మంచి ఫ్లోరింగ్, తగిన గాలి వెలుతురు కలిగి ఉండాలని,విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తగిన స్థలం ఉండాలని చెప్పారు.విద్యాశాఖ/సీబీఎస్ఈ నిర్దేశించిన నమూనా ప్రకారం తగిన సంఖ్యలో అర్హత కలిగిన ఉపాధ్యాయులు ఉండాలని తెలిపారు. కనీసం 50 శాతం బోధనా సిబ్బంది మూడు సంవత్సరాలకు పైగా అదే విద్యాసంస్థలో పనిచేస్తున్న శాశ్వత ఉద్యోగులుగా ఉండాలని పేర్కొన్నారుపాఠశాలకు సంబంధిత అధికారుల నుండి తాజా గుర్తింపు (=వఘశీస్త్రఅఙఱశీఅ), అనుబంధం (ూాటటఱశ్రీఱఫుఱశీఅ) తప్పనిసరిగా ఉండాలని, బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకానికి ఎంపిక పరిగణనలోకి రావడానికి కనీసం ఐదేళ్లుగా గుర్తింపు పొందిన పాఠశాలగా కొనసాగి ఉండాలని తెలిపారు.గిరిజన విద్యార్థులకు వసతి, భోజనం ఇతర సదుపాయాలు పాఠశాలలోని ఇతర విద్యార్థులకు కల్పించే విధంగానే సమానంగా అందించాలని, ఎటువంటి వివక్ష చూపరాదని స్పష్టం చేశారు.ప్రతి గిరిజన విద్యార్థికి సంవత్సరానికి 42 వేలు చొప్పున ప్రభుత్వ ఆమోదిత బడ్జెట్ మేరకు ఆన్‌లైన్ ద్వారా పాఠశాలకు చెల్లించబడుతుందని తెలిపారు. ఈ మొత్తంలో బోర్డింగ్, లాడ్జింగ్, ట్యూషన్ ఫీజులు, సహపాఠ్య కార్యక్రమాలు, యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, ఇతర రెసిడెన్షియల్ విద్యార్థులకు సాధారణంగా అందించే అన్ని సదుపాయాల వ్యయాలు ఉంటాయని పేర్కొన్నారు.ఎంపికైన పాఠశాలలకు గిరిజన విద్యార్థులను జిల్లా స్థాయి కమిటీ ద్వారా కేటాయించడం జరుగుతుందని తెలిపారు. పై అర్హతలు కలిగిన పాఠశాల యాజమాన్యాలు ఖమ్మం కలెక్టరేట్ లోని ఉప సంచాలకులు, గిరిజన సంక్షేమం శాఖ కార్యాలయంలో సంప్రదించి దరఖాస్తు ఫారాలను పొంది తిరిగి మే 30వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా సమర్పించాలని గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎన్. విజయలక్ష్మి ఆ ప్రకటనలో తెలిపారు.

### మూడో విద్యుత్ పంపిణీ సంస్థ రైతు డిస్కం ఏర్పాటు

# స్మార్ట్ మీటర్ల కోసం తెలంగాణ విద్యుత్ రంగాన్ని నిర్వీర్యం చేసే యత్నాలు ..

- కేంద్ర ప్రభుత్వ నిర్ణయాల కు అనుగుణంగా తెలంగాణ విద్యుత్ రంగాన్ని నిర్వీర్యం చేసే యత్నాలు ..
- వ్యవసాయ డిస్ట్రిబ్యూషన్,ట్రాన్స్ ఫార్మర్లకు స్మార్ట్ మీటర్ల పెట్టడం పై రైతులు తిరుగుబాటు తప్పదు .
- తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, సినీయర్ నాయకులు తాతా భాస్కరరావు



ఖమ్మం స్టాఫ్ రిపోర్టర్ మే 23 /తల్లాడ (అక్షరం న్యూస్)

తల్లాడ:- తెలంగాణ ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని నిర్వీర్యం చేసే యత్నాలు చేస్తుంది అని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, జిల్లా సినీయర్ నాయకులు తాతా భాస్కరరావు అన్నారు. కుర్ణవల్లి గ్రామం లో తెలంగాణ రైతు సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో రైతు సదస్సు నిర్వహించారు. రైతు సంఘం సత్తుపల్లి డివిజన్ అధ్యక్షులు నల్లమోతు మోహన్ రావు అధ్యక్షతన జరిగిన రైతు సదస్సులో బొంతు రాంబాబు, తాతా భాస్కర్ రావు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం జీవో 44 ద్వారా రైతు డిస్కం పేరుతో మూడోవ డిస్కం ఏర్పాటు చేసి వ్యవసాయ విద్యుత్, తోపాటు ఇతర సబ్సిడీ విద్యుత్ సరఫరా విభాగాలను మూడో విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలో చేర్చి భవిష్యత్తులో వ్యవసాయ ఉచిత విద్యుత్ ప్రభుత్వం కు భారం అవుతుందని ప్రచారం చేసి ఉచిత వ్యవసాయ విద్యుత్ కు మంగళం పాడే అవకాశం ఉంటుంది అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన విద్యుత్ సంస్కరణలు అమలు చేయడం కోసం రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తుంది అని అందులో భాగంగానే కేంద్ర ప్రభుత్వం కూడా వెంటనే మూడో విద్యుత్ పంపిణీ సంస్థ ఏర్పాటు కు అనుమతి వేగం గా ఇచ్చింది అని



అన్నారు. వ్యవసాయ విద్యుత్ డిస్ట్రిబ్యూషన్ మరియు ట్రాన్స్ ఫార్మర్లకు స్మార్ట్ మీటర్ల పెట్టడం మూడోవ డిస్కం ప్రధాన ఉద్దేశం అన్నారు. మొత్తం విద్యుత్ పంపిణీ వ్యవస్థ నుంచి ప్రభుత్వం ఉచిత విద్యుత్ పొందే వ్యవసాయ మోటార్లు, ఎత్తిపోతల పథకాలు, మీషన్ భగీరథ, ఉచిత విద్యుత్ పొందే అవకాశం ఉన్న ప్రతి సంస్థ, వ్యక్తులు భవిష్యత్తులో తీవ్రంగా నష్టపోతారు అని అన్నారు.విద్యుత్ సంస్కరణలు కి వ్యతిరేకంగా రైతులు ఉద్యమ బాట పట్టాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన ఎరువులు పెట్రోల్ డీజిల్ ధరలు వ్యవసాయ రంగ ఉత్పత్తుల పై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుందని అన్నారు.భూ సమస్యలు పరిష్కారం కోసం రైతులు ఉద్యమం లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ నాయకులు శీలం సత్యనారాయణ రెడ్డి, మండల అధ్యక్షులు కళ్యాణం కృష్ణయ్య, ఐనాల రామలింగేశ్వరరావు, కట్టా దుర్గయ్య, ఐలూరి రాంరెడ్డి, పేరసాని వెంకటేశ్వరరావు, దొబ్బల సురేష్, కొటి రెడ్డి , కృష్ణారెడ్డి, హనుమంతరావు, డొకుపర్తి రాంమూర్తి, కొమ్మినేని బాబు,గుర్రుల గోపాల కృష్ణారెడ్డి, వెంకట్రామిరెడ్డి, అప్పిరెడ్డి, ఐలూరి పెద్ద కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వైరా ఏసీపి సారంగపాణి ని కలిసిన ఖమ్మం జిల్లా కాంగ్రెస్ హెల్త్ అండ్ మెడికల్ అధ్యక్షులు డాక్టర్ కాపా మురళీకృష్ణ



ఖమ్మం స్టాఫ్ రిపోర్టర్ మే 23 వైరా (అక్షరం న్యూస్)

వైరా ఏసీపి సారంగపాణి ని మర్యాదపూర్వకంగా కలిసిన ఖమ్మం జిల్లా కాంగ్రెస్ హెల్త్ అండ్ మెడికల్ అధ్యక్షులు డాక్టర్ కాపా మురళీకృష్ణ లయన్ ఐ కేర్ హాస్పిటల్ నిర్వాహకులు ఉంద్రు శ్యాంబాబు ,తోటకూర శ్రీకాంత్ , ఉయ్యూరి రామకృష్ణ ,ఈ సందర్భంగా డాక్టర్ కాపా మురళీకృష్ణా, ఉంద్రు శ్యాంబాబు వైరా ఎస్సై పుష్పాల రామారావు తో కలిసి ఏసిపి సారంగపాణి కి శాలువా కప్పి సన్మానించారు.

## పంట అవశేషాలను కాల్చవద్దు.. జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

- పర్యావరణ పరిరక్షణతో పాటు భూసారం కాపాడాలి..
- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు..



ఖమ్మం స్టాఫ్ రిపోర్టర్ మే 23 (అక్షరం న్యూస్)

పంట అవశేషాలను కాల్చడం వల్ల మంటలు అదుపు తప్పి పక్కనున్న పంటలు,ఆస్తులు, విద్యుత్ లైన్లు దెబ్బతినే ప్రమాదం ఉందని, పశువులకు కూడా ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల పర్యావరణానికి, భూసారానికి, రైతుల ఆర్థిక పరిస్థితికి తీవ్ర నష్టం కలుగుతుందని, పంట అవశేషాలను కాల్చవద్దని ఖమ్మం జిల్లాలో పంట కోత అనంతరం పంట అవశేషాలను విస్తృతంగా కాల్చుతున్న ఘటనలు గమనించబడుతున్నాయని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. పంట అవశేషాలను కాల్చినపుడు హానికర వాయువులు విడుదలై గాలి కాలుష్యం పెరుగుతుందని, దీని వల్ల ప్రజల్లో శ్వాసకోశ సమస్యలు పెరిగే ప్రమాదం ఉందన్నారు.పంట అవశేషాల దహనం వల్ల నేలలోని సేంద్రియ కర్బనం, నత్రజని, ఫాస్ఫరస్, పొటాష్ వంటి కీలక పోషకాలు నశించి భూసారం తగ్గిపోతుందని, దీని ఫలితంగా రైతులు అధికంగా రసాయన ఎరువులపై ఆధారపడాల్సి రావడంతో ఖర్చులు పెరిగి, దిగుబడి తగ్గుతుందని చెప్పారు.రైతులు పర్యావరణాన్ని కాపాడే విధంగా వ్యవహరించి, పంట అవశేషాలను కాల్చకుండా రోటవేటర్ ద్వారా నేలలో కలియదున్నడం, కంపోస్ట్ లేదా వర్మీ కంపోస్ట్ తయారు చేయడం, పశుగ్రాసంగా వినియోగించడం, మల్చింగ్ పద్ధతులు అనుసరించడం వంటి ప్రత్యామ్నాయాలను అవలంబించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆ ప్రకటనలో తెలిపారు.

## గంజాయి రహిత సమాజమే లక్ష్యం

- పట్టణంలో పోలీసుల ప్రత్యేక తనిఖీలు.



మంచిర్యాల జిల్లా/ మందమర్రి/ మే 23/ అక్షరం న్యూస్ –:

గంజాయి నివారణే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర పోలీసులు కఠిన చర్యలు చేపడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రత్యేక దృష్టి సారించిన నేపథ్యంలో రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు మందమర్రి సీఐ పర్స రమేష్, ఎస్ఐ గోపతి నరేష్ ఆధ్వర్యంలో అనుమానాస్పద ప్రాంతాల్లో నార్కోటిక్ డాగ్ సహాయంతో విస్తృత స్థాయిలో తనిఖీలు నిర్వహించారు. యువత భవిష్యత్తును నాశనం చేసే గంజాయి వంటి మత్తు పదార్థాలపై ఉక్కుపాదం మోపుతూ, సమాజాన్ని మత్తు రహితంగా మార్చేందుకు పోలీసులు నిరంతరం అప్రమత్తంగా పనిచేస్తున్నారని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## గుడి ని తిరిగి పునరుద్ధరణ, నూతన దర్గా

# ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు..

- కార్యక్రమంలో పాల్గొన్నమల్లి బాబు యాదవ్, షేక్ పతే మహమ్మద్ ఏపూరి మహేందర్ ...

ఖమ్మం స్టాఫ్ రిపోర్టర్ మే 23 (అక్షరం న్యూస్)

కామేపల్లి మండలం జోగుగూడెం గ్రామంలో ని పురాతన ఆంజనేయ స్వామి గుడి కి రహదారి సౌకర్యం లేక, రోడ్డుకు దిగువ కావడం వలన భక్తులు అసౌకర్యానికి గురువుతున్నందుకు తిరిగి గుడిని పైకి లేపి, నూతన కట్టడాలతో పునరుద్ధరణ కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఊట్కూరు గ్రామంలో నూతనంగా ముస్లింల ప్రార్థనా మందిరం ( దర్గా)ను నిర్మించడం జరిగింది. శనివారం నాడు జరిగిన దర్గా ప్రారంభోత్సవ కార్యక్రమంలో మరియు గుడి పునరుద్ధరణ కార్యక్రమంలో డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి షేక్ పతే మహమ్మద్, జిల్లానాయకులు ఏపూరి మహేందర్, రాయల ఉపేందర్ పాల్గొని ఊటుకూరు లోని జాన్ పహాడ్ సైదులు దర్గాకొరకు విరాళం ఇచ్చిన స్థలదాత ప్రొద్దుటూరు అనంతరాములు - జయమ్మ ను మరియు దర్గా నిర్మాణానికి 500000/-రూపాయలు విరాళం ఇచ్చిన షేక్ పెద్ద మల్సూర్ -లతిఫీ గార్ల జ్ఞాపకార్థం షేక్ రఫీ - సమీరా బేగం (వైజాగ్) ను ఈ సందర్భంగా అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ తరతరాలుగా మన దేశంలో గుడి మసీదు చర్చి లలో ప్రజలు ప్రార్థన చేసుకుంటూ సర్వమత సమానత్వంతో ఉంటున్నారని, మధ్యలో వచ్చిన కొన్ని మతతత్వ పార్టీలు అవిచ్ఛిన్నకర శక్తులతో మతాల మధ్య చిచ్చు పెడుతూ రాజకీయంగా లబ్ధి పొందుతున్నారని, ఇది మన దేశానికి సంబంధించిన సాంప్రదాయం కాదని, పేర్కొన్నారు. దేశ అభివృద్ధి కోసం మాత్రమే రాజకీయాలు వాడుకోవాలని, ప్రజల మనోభావాలపై మత చాందసవాదాన్ని రుద్ది, దేశంలో అశాంతి



కలిగించకూడదని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భూక్యా సైదమ్మ లక్ష్మణ్, జర్పల అనిత గణేష్, హట్కర్ శంకర్ బట్టు శంకర్, జరపల రామోజీ ఇస్లావత్ స్వామి, జర్పల రాము జర్పల చంద్రు, జర్పల బాలాజీ, జర్పల మోతిలాల్, సలీం, ముస్లిం మత పెద్దలు మరియు తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యకరమైన జీవితానికి క్రీడలు ఎంతో అవసరం...

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
- యువత ప్రతిభకు అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం..
- జాబ్ మేళాలో ఎంపికైన 618 మంది అభ్యర్థులకు ప్రొవిజనల్ ఆఫర్ లెటర్లు అందజేత...
- కంఫర్ట్ జోన్ నుంచి బయటకు వస్తేనే విజయాలు సాధిస్తాం..
- 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన యువజన, క్రీడల అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్..



ఖమ్మం స్టాఫ్ రిపోర్టర్ మే 23 (అక్షరం న్యూస్)

ఆరోగ్యకరమైన జీవితానికి క్రీడలు ఎంతో అవసరమని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో యువజన, క్రీడల అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా "ఉద్యోగ సాధన -- కనెక్టింగ్ టాలెంట్ విత్ ఆపర్చునిటీస్" కార్యక్రమం జాబ్ మేళా క్రింద ఎంపికైన 618 మంది అభ్యర్థులకు జాబ్‌మేళా ప్రొవిజనల్ ఆఫర్ లెటర్లు అందజేశారు. అలాగే సీఎం కప్- 2026 రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాలు సాధించిన 72 మంది యువ క్రీడాకారులను సన్మానించారు. మొత్తం 433 మంది క్రీడాకారులు వివిధ విభాగాల్లో పతకాలు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ గతంలో సాధారణంగా కుటుంబాల్లో క్రీడలకు అంతగా ప్రోత్సాహం ఉండేది కాదని, ప్రస్తుతం సానియా మీర్జా, తిలక్ వర్మ వంటి యువత క్రీడల్లో రాణిస్తూ ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తున్నారని అన్నారు. ప్రస్తుతం క్రికెట్ మాత్రమే కాకుండా అనేక క్రీడల్లో యువత ప్రతిభ కనబరుస్తోందని, ఇటీవల ఒలింపిక్స్‌లో భారత క్రీడాకారులు అథ్లెటిక్స్ విభాగంలో కూడా పతకాలు సాధించడం గర్వకారణమని తెలిపారు.ప్రస్తుతం ప్రపంచం వేగంగా మారుతోందని, ప్రముఖ ఇన్వెస్టర్ రాకేష్ ఝున్‌ఝున్‌వాలా సుమారు 50 వేల కోట్ల సంపద సంపాదించి నప్పటికీ ఆరోగ్య సమస్యలతో చిన్న వయసులోనే మరణించారని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. తాను అన్ని చోట్ల పెట్టుబడులు పెట్టానని, కానీ ఆరోగ్యంపై పెట్టుబడి పెట్టలేదని ఆయన చెప్పిన మాటలను గుర్తు చేశారు. సంపద కంటే ఆరోగ్యం ముఖ్యమని, ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి క్రీడలు ఎంతో అవసరమని కలెక్టర్ తెలిపారు. శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కూడా క్రీడలు అందిస్తాయని అన్నారు.ఖమ్మం జిల్లా క్రీడల్లో ఎప్పుడూ ముందంజ లో ఉంటుందని, ఇక్కడ మంచి మౌలిక వసతులు ఉన్నాయని, కోచ్‌లు అందుబాటులో ఉన్నారని తెలిపారు. క్రీడల్లో విజయాలు సాధించాలంటే శరీరాన్ని దేవాలయంలా భావించి సరైన పోషకాహారం తీసుకోవాలని గాయాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టితే దీర్ఘకాలం క్రీడల్లో




కొనసాగవచ్చని సూచించారు.ప్రతి ఒక్కరిలోనూ ప్రత్యేక ప్రతిభ ఉంటుందని, కొందరికి మేధస్సు, కొందరికి సంగీతం, నృత్యం, మరికొందరికి క్రీడల్లో ప్రతిభ ఉంటుందని, వాటిని పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని యువతకు సూచించారు.ఉద్యోగాలు సాధించిన యువతకు ఇది మొదటి అడుగు మాత్రమేనని, కంఫర్ట్ జోన్ నుంచి బయటకు వచ్చి కష్టపడి పనిచేస్తే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని అన్నారు. చిన్న స్థాయి ఉద్యోగంతో ప్రారంభించి ప్రస్తుతం మంచి స్థాయికి ఎదిగిన యువత ఉదాహరణలు తమకు తెలిసి ఉన్నాయని, కృషి, పట్టుదలతో మంచి భవిష్యత్తు సాధించవచ్చని యువతకు ప్రోత్సాహం ఇచ్చారు.అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ జాబ్‌మేళాలో ఎంపికైన యువతకు అభినందనలు తెలిపారు. జాబ్‌మేళాలో 618 మంది ఎంపిక కావడం అభినందనీయమని అన్నారు. సీఎం కప్ రాష్ట్ర స్థాయి పతక విజేతలకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.ప్రతి విజయం జీవితంలో ఒక మైలురాయిగా నిలవాలని, అది భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించేందుకు స్ఫూర్తినివ్వాలని ఆకాంక్షించారు. యువత అందరికీ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో డివైఎస్ఓ సునీల్ రెడ్డి, జిల్లా ఉపాధి అధికారి ఎన్.మాధవి, కోచ్ లు, క్రీడాకారులు, విద్యార్థినీ, విద్యార్థులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పర్యాటక రంగ అభివృద్ధికి యువత భాగస్వామ్యం కీలకం...

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
- పర్యాటక ప్రాంతాలపై ప్రజల్లో అవగాహన పెంపు లక్ష్యం..
- పర్యాటక వారోత్సవాల్లో భాగంగా టూరిజం కిట్ ప్రారంభం..
- పర్యాటక రంగంపై ఆసక్తి పెంపొందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు..

ఖమ్మం స్టాఫ్ రిపోర్టర్ మే 23 (అక్షరం న్యూస్)

పర్యాటక రంగ అభివృద్ధికి యువత భాగస్వామ్యం ఎంతో కీలకమని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న పర్యాటక వారోత్సవాల సందర్భంగా శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో టూరిజం కిట్ ప్రారంభ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ తో కలిసి పాల్గొన్ని టూరిజం కిట్‌ను విడుదల చేసి అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో




సహజసిద్ధమైన పర్యాటక ప్రాంతాలను ప్రజలకు మరింత చేరువ చేయడానికి పర్యాటక వారోత్సవాలు దోహద పడతాయని అన్నారు. యువతలో పర్యాటక రంగంపై ఆసక్తి పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తోందని, పర్యాటక రంగం ద్వారా ఉపాధి అవకాశాలు కూడా విస్తరిస్తాయని పేర్కొన్నారు.జిల్లాలోని పర్యాటక ప్రాంతాలపై ప్రజల్లో అవగాహన పెంపుతో పాటు పర్యాటక రంగ అభివృద్దే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. జిల్లాలోని పర్యాటక ప్రదేశాలను ప్రోత్సహించేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో డీవైఎస్ఓ టి. సునీల్ రెడ్డి, తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏఈ నరేష్ నాయక్, ఖమ్మం టూరిజం సిబ్బంది జె. చంద్రశేఖర్ ఆజాద్, యువత, తదితరులు పాల్గొన్నారు.

## వడదెబ్బ తగలకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలి.... జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



ఖమ్మం స్టాఫ్ రిపోర్టర్ మే 23( అక్షరం న్యూస్)

ఉష్ణోగ్రతలు అధికంగా నమోదు అవుతున్నందున, ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని వడదెబ్బ తగలకుండా ప్రజలు అవసరమైన జాగ్రత్తలు పాటించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎండదెబ్బ తగలకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని, ఎండలో బయట తిరగవద్దని, అత్యవసర పరిస్థితి అయితే తప్ప ప్రజలు బయటికి రాకూడదని, చిన్నారులు, వయోవృద్దులు ఇంటికే పరిమితం కావాలని, ప్రతిరోజు సరిపడ త్రాగునీరు తీసుకోవాలని, వదులుగా ఉన్న దుస్తువులను ధరించాలని, బయటికి వెళ్ళేటప్పుడు గొడుగు, టోపిని, సన్నని లేత రంగు కాటన్ వస్త్రాలను దరించాలని, ద్విచక్ర వాహనాలపై సుదూర ప్రయాణాలు చేయకూడదని, సూర్యుని కిరణాలు శరీరంపై నేరుగా పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. అలాగే ఎండలో పనిచేసే కార్మికులు తరచుగా నీటీతో పాటు ఓ.ఆర్.ఎస్. ద్రావణాన్ని తీసుకోవాలని తద్వారా వడదెబ్బ నుండి శరీరాన్ని కాపాడుకోవచ్చున్నారు.అధిక మాంసకృత్తులు కలిగిన ఆహారాన్ని , నిల్వ ఆహారాన్ని తినవద్దని, నిలిపి ఉంచిన వాహనంలో పిల్లలను లేదా పెంపుడు జంతువులను వదిలివేయవద్దని, వాహనం లోపల ఉష్ణోగ్రత పెరిగి ప్రమాదకరంగా మారవచ్చని అన్నారు.అధిక చమట, దాహం, బలహీనత, తల తిప్పడం, కండరాలు పట్టేయడం వంటి లక్షణాలు వున్నచో వడదెబ్బగా భావించి సమీప ఆరోగ్య కేంద్రం తీసుకెళ్లాలని, అవసరమైన జాగ్రత్తలు పాటించాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## చెక్ పోస్టుల వద్ద నిఘా కట్టుదిట్టం..

- అక్రమ రవాణా జరగకుండా పూర్తిస్థాయిలో కట్టడి..
- పోలీస్ కమిషనర్ సునీల్ దత్



ఖమ్మం స్టాఫ్ రిపోర్టర్ మే 23 (అక్షరం న్యూస్)

అక్రమ రవాణా జరగకుండా పూర్తిస్థాయిలో కట్టడి చేయడానికి చెక్ పోస్టుల వద్ద నిఘా కట్టుదిట్టం చేయాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు.

శనివారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో కల్లూరు డివిజన్ పోలీస్ అధికారులతో పోలీస్ కమిషనర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. సరిహద్దు నుండి ఇసుక అక్రమంగా రవాణా చేసే వాహనాలపై (ట్రాక్టర్లు, టిప్పర్లు) చట్టపరమైన కేసులు నమోదు చేసి సీజ్ చేయాలన్నారు. గంజాయి రవాణాను అడ్డుకోవడానికి స్థానిక పోలీసులతో పాటు టాస్క్‌ఫోర్స్ బృందాలు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. అదేవిదంగా రేషన్ బియ్యం అక్రమంగా ఇతర రాష్ట్రాలకు లేదా మిల్లులకు తరలకుండా గోదాములు, వాహనాలపై నిఘా పెంచి, కఠినమైన కేసులు నమోదు చేయాలన్నారు. అక్రమ రవాణాకు పాల్పడే వారిపై నాన్-బైలబుల్ కేసులు పీడీ యాక్ట్ అమలు చేయాలన్నారు.పండుగల సమయంలో చట్టవిరుద్ధంగా పశువుల రవాణా, వధింపులు జరగకుండా జిల్లా సరిహద్దుల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల వద్ద వాహనాల విస్తృత తనిఖీలు చేయన్నారు. ప్రజల్లో అవగాహన కల్పించడం, సమాచారం ఇచ్చే వారి వివరాలను గోప్యంగా ఉంచడం చాల కీలకమన్నారు.సమావేశంలో ఏసీపీ వసుంధర యాదవ్, ఏసీపీ సాంబరాజు, ఇన్స్పెక్టర్ శ్రీహరి, ముత్తులింగం, సర్వయ్య, ఎస్సై లు పాల్గొన్నారు.

## రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం

- రైతులకు శాస్త్రీయ సాగుపై అవగాహన.



హన్మకొండ జిల్లా/భీమదేవరపల్లి/మే 23/అక్షరం న్యూస్-:

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం రాజేంద్రనగర్ ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ సహకారంతో నిర్వహిస్తున్న రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం శనివారం హన్మకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి గ్రామ రైతు వేదికలో ఘనంగా ముగిసింది. ఈ కార్యక్రమం ఏప్రిల్ 27 నుండి మే 23 వరకు నిర్వహించారు.ముగింపు కార్యక్రమానికి వరంగల్ వ్యవసాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కోట శివకృష్ణ, టీచింగ్ అసోసియేట్ డా. సౌజన్య, మండల వ్యవసాయ అధికారి ఎల్. పద్మ, గ్రామ సర్పంచ్ ఎం. వెంకన్న హాజరై రైతులను ఉద్దేశించి ప్రసంగించారు.ఈ సందర్భంగా డాక్టర్ కోట శివకృష్ణ మాట్లాడుతూ రైతులు పంటలలో సమతుల్య ఎరువుల వినియోగంపై దృష్టి పెట్టాలని సూచించారు. యూరియా అధిక వినియోగం వల్ల నేల సారవంతత తగ్గడంతో పాటు దిగుబడులపై ప్రతికూల ప్రభావం పడుతుందని తెలిపారు. సుస్థిర వ్యవసాయానికి అనుసరించాల్సిన పద్ధతులను వివరించి, పంట అవశేషాలను కాల్చకుండా భూమిలో కలియదున్నడం ద్వారా నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చున్నారు. అలాగే రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ విధానాలను ప్రోత్సహించాలని రైతులకు సూచించారు.మండల వ్యవసాయ అధికారి ఎల్. పద్మ మాట్లాడుతూ రైతుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, సబ్సిడీలు, వ్యవసాయ శాఖ అందిస్తున్న సేవలను వివరించారు. రైతులు ప్రభుత్వ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని కోరారు.కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల విద్యార్థులు శివాజీ, దేవేందు నాయిర్‌తో పాటు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# పేదలకు ఆరోగ్య భరోసా.. 'సీఎంఆర్ఎఫ్'..

- 150 మంది లబ్ధిదారులకు రూ.44 లక్షల చెక్కులు పంపిణీ ?చేసిన..
- ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి
- ఆటో డ్రైవర్లకు ఖాకీ చొక్కాలు అందజేత..



ఖమ్మం స్టాఫ్ రిపోర్టర్ మే 23 (అక్షరం న్యూస్)

ఖమ్మం:కార్పొరేట్, ప్రైవేట్ ఆసుపత్రులలో అత్యవసర వైద్య చికిత్సలు చేయించుకుని ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాలకు కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం కొండంత అండగా నిలుస్తోందని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి అన్నారు. శనివారం నగరంలోని గట్టయ్య సెంటర్ లో గల తన క్యాంప్ కార్యాలయంలో ఉభయ జిల్లాలైన ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం పరిధిలోని ఏడు నియోజకవర్గాలకు చెందిన 150 మంది లబ్ధిదారులకు తన సిఫారసుతో మంజూరైన రూ.44 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను ఆయన పంపిణీ చేశారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి మద్దినేని స్వర్ణకుమారి లతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు.

ఈ సందర్భంగా ఎంపీ రఘురాం రెడ్డి మాట్లాడుతూ.. పేద ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తూ, లబ్ధిదారుల దరఖాస్తులను వేగవంతంగా పరిశీలించి సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరయ్యేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్క పేదవానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించి, అండగా నిలవడమే తన ప్రధాన లక్ష్యమని ఆయన వివరించారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులంతా ఈ సందర్భంగా ఎంపీ రఘురాం రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

### ఆటో డ్రైవర్లు, కార్మికులకు అండగా ఉంటాం..

అనంతరం వివిధ ఆటో అడ్డాలకు చెందిన వందమంది ఆటో డ్రైవర్లకు ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి ఖాకీ చొక్కాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో నిరంతరం శ్రమిస్తూ రవాణా రంగంలో కీలక పాత్ర పోషిస్తున్న ఆటో కార్మికులందరికీ తమ ప్రభుత్వం, తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని అభయమిచ్చారు.ఈ కార్యక్రమాల్లో నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దీపక్ చౌదరి, కాంగ్రెస్ నాయకులు కొప్పుల చంద్రశేఖర్, టెలిఫోన్ అడ్వైజర్ కమిటీ సభ్యులు ఉమ్మినేని కృష్ణ, రంజిత్ నాయక్, సీనియర్ నాయకులు వడ్డెబోయిన నరసింహారావు, మాజీ ఎంపీపీ గోసు మధు, డీసీసీ సెక్రెటరీ రాంపుడి రోశయ్య, మాజీ ఏఎంసీ చైర్మన్ గుమ్మా రోశయ్య, సేవాదళ్ జిల్లా అధ్యక్షులు ఎస్డి. గౌస్, కాంగ్రెస్ నాయకులు ఇమ్మడి తిరుపతిరావు, స్ఫూర్తి ఓం రాధాకృష్ణ, చల్లా రామకృష్ణా రెడ్డి, కేకేసీ జిల్లా అధ్యక్షులు విప్లవ్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు జంగిపల్లి ప్రసాద్, కాంగ్రెస్ నాయకులు బాణాల లక్ష్మణ్, మల్లెల నాగేశ్వరరావు, కాటేపల్లి కిరణ్, ఉమర్, ఎండి. గౌస్, మాజీద్, చెరుకుమల్లి రవి, దిరిశెల శ్రీనివాసరావు, ఒంటికొమ్ము శ్రీనివాసరెడ్డి, ఏలూరి శ్రీనివాసరావు, ఉభయ జిల్లాలకు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు మరియు లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఆధ్వర్యంలో విద్యావ్యవస్థ నిర్వీర్యం

- ముస్తాబాద్ బీ ఆర్ ఎస్



రాజన్న సిరిసిల్ల/ముస్తాబాద్ /మే -23(అక్షరం న్యూస్)

కాంగ్రెస్ ప్రభుత్వం లో విద్యావ్యవస్థ నిర్వీర్యం అయిందని ముస్తాబాద్ బీ ఆర్ ఎస్ నాయకులు ఆరోపించారు శనివారం ముస్తాబాద్ మండల కేంద్రంలో బీ ఆర్ ఎస్ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు పత్రిక సమావేశం నిర్వహించారు ఈ సందర్బంగా ముస్తాబాద్ మండల అధ్యక్షుడు భోంపెల్లి సురేందర్ రావు మాట్లాడుతూ :రేవంత్ రెడ్డి హయాంలో నిర్వీర్యమైన విద్యావ్యవస్థ. అయ్యిందిన్నారు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోని విద్యావ్యవస్థ పూర్తిగా నీరుగారి నిర్వీర్యమైనటువంటి పరిస్థితి రాష్ట్రంలో కనబడుతుందని, స్వయానా ముఖ్యమంత్రి విద్యాశాఖను తన వద్ద ఉంచుకొని విద్యా వ్యవస్థను ముందుకు తీసుకపోవడంలో పూర్తిగా విఫలమయ్యాడన్నారు . కాంగ్రెస్ ప్రభుత్వం, రేవంత్ రెడ్డి ఏరికోరి నియమించిన విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరు మురళి తన పదవీకాలం ముగుయకముందే కమిషన్ కి రాజీనామా చేయడం చూస్తుంటే అసలు ఆ శాఖలో ఏం జరుగుతుందో కనీసం రేవంత్ రెడ్డికైనా అవగాహన వుందానని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలోని ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైతున్నట్టుగానే విద్యాశాఖను రేవంత్ రెడ్డి పక్కన పెట్టుకొనిమరి నాశనం చేస్తూ రేపటి తెలంగాణ పిల్లల భవిష్యత్తును అంధకారం చేసే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు వెలుతున్నట్టు కనబడుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో ముస్తాబాద్ మాజీ ఉప సర్పంచ్ కొండ శ్రీనివాస్ గౌడ్, ముస్తాబాద్ మండల యూత్ అధ్యక్షులు శీలం స్వామి, చీకోడ్ గ్రామ సర్పంచ్ ఆంజనేయులు,మాజీ సర్పంచ్ ధమ్మ రవీందర్ రెడ్డి వెంకన్న గౌడ్ తదితరులు పాల్గొన్నారు

## గూడూరు లో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు పంపిణీ



రాజన్న సిరిసిల్ల /ముస్తాబాద్ /మే -23(అక్షరం న్యూస్ )

ముస్తాబాద్ మండలం గూడూరు గ్రామం లో పుల్లూరి అనిత కు రు 23000వేల రూపాయల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును కాంగ్రెస్ నాయకులు పంపిణి చేశారు. కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని చేయించుకోలేని నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ అండగా నిలుస్తుందని గూడూరు కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు చాకలి బాబు అన్నారు.ఈ సందర్భంగా లబ్ధిదారులు కాంగ్రెస్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు పుల్లూరి మధు, సీనియర్ నాయకులు చాకలి రాజశేఖర్, బత్తిని అనిల్, మహేష్, శంకరయ్య పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరంకు స్పందన



రాజన్న సిరిసిల్ల /ముస్తాబాద్ /మే -23(అక్షరం న్యూస్ )

ముస్తాబాద్ మండలంలోని బంధన్ కల్ గ్రామంలోని గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద అశ్విని హాస్పిటల్ వైద్యులు సత్యనారాయణ, మేనేజింగ్ డైరెక్టర్ అభినయ్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు.శిబిరంలో అత్యాధునిక కంప్యూటర్ యంత్రాల ద్వారా 50మంది రోగులకు కంటి పరీక్షలు నిర్వహించారు.గ్రామం లో ఇలాంటి ఉచిత కంటి వైద్య శిబిరాలను నిర్వహించి అందరికీ వైద్యం అందుబాటులో ఉండేలా కృషి చేస్తున్న అశ్విని ఆసుపత్రి సభ్యులకు ధన్యవాదాలు తెలిపారుఈ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ చిగురు నరేష్ ఎనగందుల నర్సింలు మోట్ల వెంకటేష్ చింతల వెంకటేష్ పి రాజు పాతూరి రాంరెడ్డి గ్రామ ప్రజలు పాల్గొన్నారు

## చట్టాన్ని ఎవరూ చేతిలోకి తీసుకోవద్దు... సోషల్ మీడియా వదంతులు నమ్మొద్దు పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి




జ్యోతి నగర్ ఎన్టిపిసి మే 23 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పండుగను పరస్పర సహకారంతో, శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి పిలుపునిచ్చారు. పండుగ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా,శాంతి భద్రతలను కాపాడేందుకు పోలీస్ యంత్రాంగం అన్ని రకాల చర్యలు చేపట్టిందని డీసీపీ తెలిపారు. గోదావరిఖని 1 టౌన్ పోలీస్ స్టేషన్‌లో ముస్లిం,హిందూ, క్రిస్టియన్ మత పెద్దలతో పోలీసుల శాంతి సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు.డీసీపీ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణతో పాటు పండుగ రోజుల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సమాజంలో మత సామరస్యం,ఐక్యత నెలకొనేలా అన్ని వర్గాల ప్రజలు ఒకరి మత విశ్వాసాలను మరొకరు గౌరవిస్తూ, సోదరభావంతో బక్రీద్ పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు.పశువులను తరలించే వాహనాలను అడ్డుకోవడం, వ్యక్తులపై దాడులు చేయడం, బలవంతంగా తనిఖీలు నిర్వహించడం వంటి చర్యలకు ఎవరూ పాల్పడరాదని, చట్టాన్ని ఎవరూ చేతిలోకి తీసుకోవద్దని హెచ్చరించారు. ఎక్కడైనా అనుమానాస్పద వాహనాలు లేదా అక్రమ రవాణా జరుగుతున్నట్లు గుర్తిస్తే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.పండుగ నేపథ్యంలో ఎలాంటి అపోహలు, వదంతులు వ్యాప్తి చెందకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ముఖ్యంగా సోషల్ మీడియా వేదికల ద్వారా వచ్చే అసత్య ప్రచారాలను నమ్మవద్దని,వాటిని ఇతరులకు షేర్ చేయవద్దని సూచించారు. ప్రభుత్వం అనుమతించిన నిర్ణీత ప్రదేశాల్లోనే జంతువధ (ఖుర్బానీ) నిర్వహించాలని తెలిపారు.బహిరంగ ప్రదేశాల్లో జంతు అవశేషాలను పారవేయకుండా పరిశుభ్రత పాటిస్తూ మున్సిపల్ సిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరారు.అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనలు కనిపిస్తే వెంటనే డయల్ 100 లేదా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.ఏవైనా సమస్యలు ఉంటే పోలీస్ అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.ఈ సమావేశంలో గోదావరిఖని ఏసీపీ రమేష్,గోదావరిఖని వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, హిందూ,ముస్లిం, క్రిస్టియన్ మత పెద్దలు పాల్గొన్నారు.

## హైటెన్షన్ వైర్లతో అగ్నిప్రమాదం.. దగ్ధమైన మామిడి తోటలు



రాజన్న సిరిసిల్ల / ఇల్లంతకుంట / మే 23 / అక్షరం న్యూస్ –:
ఇల్లంతకుంట మండలం చిక్కుడువాని పల్లె గ్రామ శివారులో శనివారం జరిగిన అగ్నిప్రమాదంలో మామిడి తోటలు దగ్ధమయ్యాయి. గాలి దుమారంతో హైటెన్షన్ విద్యుత్ వైర్లు ఒకదానికొకటి తాకడంతో మంటలు చెలరేగి సమీపంలోని మామిడి తోటలకు వ్యాపించాయి. దీంతో కోతకు వచ్చిన మామిడికాయలు, చెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. సమాచారం అందుకున్న సర్పంచ్ చింతమడక కళ్యాణ్, ఉపసర్పంచ్ చిక్కుడు సత్యం, గ్రామస్థులు , పోలీస్ కానిస్టేబుల్ రాధారపు సురేష్, జీపీఓ రాజు, యువకులు ట్యాంకర్ సహాయంతో మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనలో సుమారు నాలుగు టన్నుల మామిడి పంట నష్టం జరిగిందని ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరారు .

## రామోజీపేట శ్రీ సీతారాముల ఆలయంలో విహెచ్ ప్రత్యేక పూజలు



రాజన్న సిరిసిల్ల / ఇల్లంతకుంట / మే 23 / అక్షరం న్యూస్ –:
ఇల్లంతకుంట మండలం రామోజీపేటలో ప్రసిద్ధిగాంచిన శ్రీ సీతారాముల ఆలయాన్ని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, బీసీ సంక్షేమ శాఖ ప్రభుత్వ సలహాదారుడు వి. హనుమంతరావు శనివారం వారి కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ప్రభుత్వ సలహాదారుడిగా నియమితులైన అనంతరం తొలిసారిగా ఆలయానికి విచ్చేసిన ఆయన, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు. ప్రతి సంవత్సరం శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవానికి ముందుగా ఆలయానికి వచ్చి స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించడం తన ఆనవాయితీ అని అయన తెలిపారు. స్వామివారి కృపాకటాక్షాలతోనే మరోసారి ప్రజాసేవ చేసే అవకాశం లభించిందని, రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులతో, సుభిక్షంగా ఉండాలని దేవుడిని ప్రార్థించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, నాయకులు సూర దేవరాజు, పసుల వెంకటి, ఆలయ అర్చకులు సీతారామ శర్మ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు ఉచిత డ్రైవింగ్ శిక్షణ ఉపాధిపై అవగాహన



మంచిర్యాల జిల్లా/ మందమర్రి/ మే 23/ అక్షరం న్యూస్ –:
మందమర్రి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శనివారం మోవో సంస్థ, కార్మిక శాఖ సహకారంతో మహిళలకు డ్రైవింగ్ శిక్షణ మరియు ఉపాధి అవకాశాల కార్యక్రమాలను ప్రారంభించేందుకు ఏర్పాటు చేసిన ప్రణాళికలో భాగంగా స్థానిక మహిళలను కలిసి, డ్రైవింగ్ శిక్షణ, ఉపాధి అవకాశాలు మరియు భవిష్యత్ అవసరాలపై అభిప్రాయాలు, ఆసక్తులు తెలుసుకునేందుకు ప్రత్యేక సమావేశం నిర్వహించారి.ఈ సమావేశానికి మోవో వ్యవస్థాపకురాలు మరియు ప్రముఖ బైకర్ జై భారతి, ఆస్ట్రేలియా నుండి డా" జానెల్ హాజరై మహిళల భవిష్యత్ ఉపాధి అవకాశాలకు కొత్త మార్గాలను సూచించారు. ఈ కార్యక్రమంలో మెప్మా టి.ఎం.సి ఏనుగు రఘు రామ్, మందమర్రి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మంద తిరుమల్ రెడ్డి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు గడ్డం రజనీ, మహిళ నాయకురాళ్ళు పోచంపల్లి లక్ష్మి, రాధ, బత్తుల సరిత, శ్రీలత, సమత, స్రవంతి, రాజేశ్వరి, కవిత, మెప్మా ఆర్.పి లు పాల్గొన్నారు.

# తల్లాడ కాంగ్రెస్ పార్టీలో ముదిరి పాకానపడ్డ వర్గపోరు

- రాష్ట్ర నాయకులు దయానంద్ ఏకపక్ష నిర్ణయాలు..
- మా సత్తా చాటుతాశీ..
- జండా మోసిన సీనియర్లకు ప్రాధాన్యత లేదా..
- రగిలిపోతున్న కాంగ్రెస్ కార్యకర్తలు ..



ఖమ్మం స్టాఫ్ రిపోర్టర్ మే 23 తల్లాడ (అక్షరం న్యూస్)
తెలంగాణ రాష్ట్రంలోగత పది సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేకపోయినా అనేక కష్టనష్టాలకు ఓర్చి కాంగ్రెస్ పార్టీని అధికారంలోనికి తీసుకొచ్చిన నాయకులకు నియోజకవర్గ బాధ్యులు పదవుల విషయంలో కాంగ్రెస్ పార్టీని కష్టకాలంలో ఆదుకున్న నాయకులకు ప్రాధాన్యం లేకుండా చేస్తుండడంతో డాక్టర్ మట్టా దయానంద్ ఒంటెద్దు పోకడలతో, కాంగ్రెస్ పార్టీకే కాక కార్యకర్తలకు తీవ్ర అన్యాయం చేస్తుండటంతో తల్లాడ మండల కాంగ్రెస్ నాయకులు ఇటీవల హైదరాబాదులో కాంగ్రెస్ అధిష్టానానికి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఫిర్యాదు చేయడంతో అధిష్టానం కాంగ్రెస్ పార్టీ పదవులు, నూతన సొసైటీ అధ్యక్షుల నియామకాలను నిలుపుదల చేయడంతో విధి లేక మొక్కుబడిగా సత్తుపల్లిలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో తల్లాడ మండల ముఖ్య కార్యకర్తల సమావేశం పేరిట సభ నిర్వహించి అందులో తనకు అనుకూలమైన కార్యకర్తలతో సీనియర్ కాంగ్రెస్ నాయకులను అసభ్యకరంగా పలు దూషణలు చేయించడంతో , సమావేశంలో వాతావరణం వేడెక్కిఅక్కడి సభ అర్ధాంతరంగా తోపులాట జరిగి ఎక్కువమంది కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మనస్థాపం చెంది అక్కడి సభ నుంచి వెళ్లిపోవడం జరిగింది. అయినను దయానంద్ ప్రవర్తనలో మార్పు రాకపోగా పక్షపాత ధోరణితో, వర్గ రాజకీయాలకు తావిచ్చి, కక్ష సాధింపు ధోరణితో ప్రవర్తిస్తుండటంతో విసిగి వేసారిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్తలు నేడు సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కాపా అప్పయ్య ఇంటి వద్ద పాత తరం కాంగ్రెస్ నాయకులు అందరూ మండల పార్టీ అధ్యక్షులు కాపా సుధాకర్ అధ్యక్షతన సమావేశమై భవిష్యత్ కార్యాచరణ నిర్ణయాలను గురించి చర్చించడం జరిగింది. ఈ సందర్భంగా తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాపా సుధాకర్ , సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మలీదు కోటేశ్వరరావు, తూము వీరభద్రరావు, సొసైటీ చైర్మన్ గంగాదేవిపాడు, నారా పోగు వెంకట్ ,ఎక్స్ సర్పంచ్, ఎర్రమల రామ్మోహన్ రెడ్డి ,సర్పంచ్ ముద్దునూరు, కిరణ్ కుమార్ కటికి. సర్పంచ్ మల్లారం, దమ్మలపాటి ప్రకాష్ రావు, మువ్వ రోశయ్య, అడపా అనిల్ యూత్ కాంగ్రెస్ నాయకులు, గుజ్జర్లపూడి చింటూ వైస్ ప్రెసిడెంట్ మంగాపురం, చిత్తలూరి రమేష్ ఐ ఎన్ టి యు సి ప్రెసిడెంట్, గోగుల రాఘవ బిసి సెల్ కాంగ్రెస్ మండల ప్రెసిడెంట్ , ధర్మ సోత్ దశరద్ నాయక్ లు మాట్లాడుతూ పార్టీ కష్ట కాలంలో ఉన్నప్పుడు ఆదుకొన్న పాత కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు పార్టీ పదవుల్లో ప్రాధాన్యత కల్పించాలని ,వర్గ విభేదాల వల్ల ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో అనేక పంచాయతీలను కోల్పోవడం జరిగిందని, దీనికి కారణం నాయకుల ఒంటెద్దు పోకడలు కారణమని కనీసం రాబోయే ఎంపీటీసీ మరియు జడ్పిటిసి ఎన్నికలలో అందరూ సమన్వయంతో కృషిచేసి ముందుకు పోవాలని ముక్త కంఠంతో కోరారు. లేకపోతే తమ దారి తాము చూసుకుంటామని గ్రామస్థాయి నాయకులకు కనీస గుర్తింపు లేకపోవడం, అభివృద్ధి పనులకు సైతం ఆహ్వానించకుండా శుభకార్యాల విషయంలో కూడా రాజకీయాలు చూపిస్తూ అసలైన కార్యకర్తలను విస్మరిస్తూ ఇప్పటికైనా గ్రూప్ రాజకీయాలు లేకుండా అందర్నీ కలుపుకొని పోవాలని కోరారు. ఇప్పటికైనా మేల్కొని ఏకపక్ష ధోరణి విడనాడి సమర్థులైన కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్తలను గుర్తించి పార్టీ పదవుల్లో వివిధ నామినేటెడ్ పార్టీ పదవుల్లో తగిన ప్రాధాన్యత ఇవ్వవలసినదిగా కోరుతూ ఈ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు.



ఈ కార్యక్రమంలో తల్లాడ మండలంలోని అన్ని గ్రామాల నుంచి అధిక సంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# యాదగిరిగుట్టలో రూ.100కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

యాదాద్రి భువనగిరి జిల్లా / యాదగిరిగుట్ట / మే 23 : అక్షరం న్యూస్ – :
శనివారం రోజు పవిత్ర పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్టలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి మరియు సహచర మంత్రులతో కలిసి దర్శించుకన్నారు. వేద పాఠశాల నిర్మాణ భూమిపూజ మహోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పాల్గొన్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం పరిధిలో తెలంగాణలోనే అతిపెద్ద వేద పాఠశాల సముదాయ నిర్మాణానికి భూమిపూజ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. కంచికామకోటి పీఠాధిపతి జగద్గురు శ్రీ శ్రీ శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామి వారి దివ్య సమక్షంలో





జరిగిన ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పాల్గొని భూమిపూజ చేశారు.
వేద పాఠశాలతో పాటు టెంపుల్ సిటీ పరిధిలో రూ. 99.55 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు ఆలయ అనుబంధ అభివృద్ధి పనులకు ఈ సందర్భంగా శంకుస్థాపనలు చేశారు.
ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి తో పాటు శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి , మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి , కొండా సురేఖ , అడ్లూరి లక్ష్మణ్ కుమార్ , ఎంపీలు వేం నరేందర్ రెడ్డి , చామల కిరణ్ కుమార్ రెడ్డి తో పాటు పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అనంతరం ఆలయ అర్చకులు ముఖ్యమంత్రి కి ఆశీర్వచనం ,లడ్డు ప్రసాదం అందించారు.

## అంబులెన్స్ సేవలను ఆకస్మికంగా తనిఖీ చేసిన అధికారులు



రాజన్న సిరిసిల్ల /ఇల్లంతకుంట మే 23/అక్షరం న్యూస్ :-
అంబులెన్స్ సేవలపై నాణ్యతా ప్రమాణాలు మెరుగుపరచాలన్న ఉద్దేశంతో అంబులెన్స్ విభాగ ప్రధాన అధికారి ఫకీర్ దాస్ శుక్రవారం అంబులెన్స్ ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. అంబులెన్స్ వాహనాల్లో సిబ్బంది హాజరు, అత్యవసర వైద్య పరికరాల అందుబాటు, మందుల నిల్వలు, అలాగే సేవల వేగం వంటి అంశాలను ఆయన పరిశీలించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు తక్షణ సేవలు అందించడంలో ఎలాంటి అలసత్వం ఉండకూడదని సిబ్బందికి సూచించారు. అలాగే ప్రతి అంబులెన్స్ పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలని, రోగులకు సేవలందించడంలో సమయపాలన అత్యంత కీలకమని ఆయన స్పష్టం చేశారు. లోపాలు గుర్తించిన చోట వెంటనే సరిచేసుకోవాలని ఆదేశించారు. ఈ తనిఖీలలో ఈ ఎం ఈ అరుణ్, అంబులెన్స్ సిబ్బంది శ్రీకాంత్, బాబు పాల్గొన్నారు.

## కనీస వేతనం, ఉద్యోగ భద్రత డిమాండ్‌తో వీఓఏల నిరవధిక సమ్మె



రాజన్న సిరిసిల్ల /ఇల్లంతకుంట మే 23/అక్షరం న్యూస్ – :
మండలంలోని గ్రామ సంఘాల సహాయకుల నిరవధిక సమ్మె ప్రారంభించారు. ఎంపీడీఓ కార్యాలయం ఎదుట బైఠాయించి తమ డిమాండ్ల సాధన కోసం ఆందోళన చేపట్టారు. వీఓఏలు కనీస వేతనం రూ.20 వేలు చెల్లించాలని, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని ప్రధానంగా డిమాండ్ చేస్తున్నారు. అర్హులకు సీసీలుగా పదోన్నతి కల్పించడంతో పాటు రూ.20 లక్షల ఆరోగ్య బీమా, ట్యాబ్, నెట్ సౌకర్యం ఇవ్వాలని కోరారు. అలాగే 58 జీవోను సవరించి 58 ఏళ్లకు పదవీ విరమణ వయసు నిర్ణయించి రిటైర్మెంట్ ప్రయోజనాలు కల్పించాలని కోరారు . పదేళ్లుగా క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నా కనీస వేతనం, ఉద్యోగ భద్రత లేక ఇబ్బందులు పడుతున్నామని, తమ డిమాండ్లు నెరవేరే వరకు సమ్మె కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గొడుగు బాలలక్ష్మి, బంగారు అంజలి, మహంకాళి ఉమారాణి లతో పాటు వీఓఏలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ 26వ డివిజన్ అధ్యక్షుడు జన్ను
# భాస్కర్ ను పరామర్శించిన మహమ్మద్ అయూబ్



వరంగల్ జిల్లా / వరంగల్ టౌన్ / మే 23 / అక్షరం న్యూస్ -:

వరంగల్ తూర్పు నియోజకవర్గం కు చెందిన కాంగ్రెస్ పార్టీ 26వ డివిజన్ అధ్యక్షుడు జన్ను భాస్కర్ పక్షవాతం కు గురై గత కొంతకాలంగా ఇంటికి పరిమితమైనారూ. ఆయన ఆర్థిక స్థితిగతుల కారణంగా సరైన వైద్యం అందకపోవడం వల్ల భాస్కర్ ఎంతో మానసికంగా కుంగ తీయడం జరిగినది. కానీ హాస్పిటల్లో ఉన్నప్పుడైతేనేమి ఇంటికి తీసుకువచ్చిన తర్వాత కూడా అనేకమార్లు వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహ్మద్ అయూబ్ భాస్కర్ కి మనోధైర్యం చెపుతూ నీకు అండగా మేము ఉంటామని చెప్పి భరోసా కల్పించడం జరిగినది. దీనిలో భాగంగా శనివారం అతనికి నడవడానికి మెడికల్ స్టిక్ ను అందిస్తూ అతనికి మందులు ఖర్చుకై ఆర్థిక సాయం చేయడం





జరిగినది. కాంగ్రెస్ పార్టీకి ఎంతో కష్టపడ్డా జన్ను భాస్కర్ ని ఆయన యొక్క స్థితిగతులను రాష్ట్ర నాయకత్వానికి తెలియపరచి అతని మేలు జరిగే విధంగా సహకరిస్తానని వరంగల్ జిల్లా అధ్యక్షుడు మొహమ్మద్ అయూబ్ భాస్కర్ కుటుంబానికి భరోసా కల్పించినారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా యూత్ అధ్యక్షుడు కొరివి పరమేష్, జిల్లా మైనార్టీ నాయకుడు కమాలుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## రంగనాయక సాగర్ అధికారులను కలిసిన ప్రజాప్రతినిధులు



రాజన్న సిరిసిల్ల / ఇల్లంతకుంట / మే 23 / అక్షరం న్యూస్ -:

రంగనాయక సాగర్ ఎల్ఎం-6 కాల్వ పనులను త్వరగా పూర్తి చేయాలని కోరుతూ శనివారం సర్పంచులు, ఉపసర్పంచులు రంగనాయక సాగర్ ఈఈ, డీఈలను కలిసి వినతిపత్రం అందజేశారు. కాల్వ పనుల కోసం ప్రభుత్వం రూ.3.19 కోట్లు మంజూరు చేసిందని, త్వరలో భూసేకరణ నోటిఫికేషన్ జారీ చేసి పనులు ప్రారంభిస్తామని డీఈ తెలిపారు. సర్వే పనులు ఇప్పటికే పూర్తయ్యాయని చెప్పారు. పెద్దలింగాపూర్ రైతుల దీక్షల అనంతరం ప్రభుత్వం నిధులు విడుదల చేసినప్పటికీ రైతులకు ఇప్పటికీ చెక్కులు అందలేదని ప్రజాప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. 12 గ్రామాల రైతులకు సాగునీరు అందేలా పనులు వేగవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెద్దలింగాపూర్ సర్పంచ్ గన్నేరం వసంత నర్సయ్య, అంకుసపురం సర్పంచ్ అంచ శ్రీనివాస్ రెడ్డి, రామన్నపల్లి సర్పంచ్ ఆత్మకూరి జ్యోతి అనిల్, చిన్నలింగాపూర్ సర్పంచ్ శ్యాగ విజయ దేవేందర్, ఉపసర్పంచులు ఎల్లవేణి రమేష్, గణపురం శ్రీనివాస్, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి కరికె నవీన్ కుమార్, బొనుగాని ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడే మెగా రక్తదాన శిబిరం

- **యువత రక్త దానానికి ముందుకు రావాలి**
- **తల సేమియా బాధిత చిన్నారుల ప్రాణాలను కాపాడుదాం**
- **ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్,రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు**



కామారెడ్డి జిల్లా/ఎల్లారెడ్డి/మే 23/అక్షరం న్యూస్:తల సేమియా వ్యాధితో బాధపడు తున్న చిన్నారుల కోసం ఆదివారం(నేడు) ఉదయం తొమ్మిది గంటల నుండి సిరిసిల్ల రోడ్ లోగల ఆదిత్య వైద్యశాలలో మెగా రక్త దాన శిబిరాన్ని నిర్వహించడం జరుగుతుందని, ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్,రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు, ఐ విఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిలువేరి మా రుతి తెలిపారు. వేసవికాలం కావడంతో త లసేమియా వ్యాధితో బాధపడుతున్న చి న్నారులకు రక్తం దొరకక తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారి ప్రాణాలను కా పాడడం కోసమే ఈ రక్తదానం శిబిరం నిర్వ హిస్తున్నామని, ఈ శిబిరంలో యువత పెద్ద సంఖ్యలో పాల్గొని, రక్తదానంచేసి, చిన్నారు ల ప్రాణాలను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. మొదటగా రక్తదానం చేసే 120 మంది రక్త దాతలకు హెల్మెట్లను ఆ తరువాత రక్తదా తలకు ప్రశంసాపత్రాలను కీచైన్ లనుఅంద జేయడం జరుగుతుందని తెలిపారు. మరి న్ని వివరాలకు 9492874006 నెంబర్ కి సంప్రదించాలనిఅన్నారు.ఈ కార్యక్రమంలో ఎర్రంచంద్రశేఖర్, జమీల్ అహ్మద్, డాక్టర్ వే ద ప్రకాష్, పర్షవెంకటరమణ,డాక్టర్ పుట్ల అ నిల్,జలిగామ శ్రీకాంత్,దొంతి సుధాకర్, క స్వ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## వరిధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలి

- **ఆర్ డి ఓ: ఆర్ ప్రభాకర్**



కామారెడ్డి జిల్లా/ఎల్లారెడ్డి/ఏప్రిల్ 23/అక్షరంన్యూస్: వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆర్ డి ఓ ఆర్ ప్రభాకర్ సొసైటీ సిఈఓ రామచందర్ ను ఆదేశించారు. శనివారం తిమ్మారెడ్డి కొ నుగోలు కేంద్రాన్ని తాసిల్దార్ ప్రేమ్ కుమార్ తో కలిసి ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహిం చారు.ఈసందర్భంగాకొనుగోలు ప్రక్రియను, సేకరించిన ధాన్యం వివరాలను కేంద్ర నిర్వా హకులను అడిగితెలుసుకున్నారు. కొనుగో లు వివరాలను ఎప్పటికప్పుడు రిజిస్టర్ లో నమోదు చేయాలని, నమోదులో అవకత వకలుజరగకుండా చూసుకోవాలని,ధాన్యం కొనుగోలు కూడా వేగవంతం చేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రంలో ఉన్న ధాన్యాన్ని పరిశీలించి అక్కడున్న వసతు లను స్వయంగా రైతులను అడిగి తెలుసు కున్నారు. రైతులు ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోకుండా నాణ్యమైన ధాన్యా న్ని కొనుగోలు కేంద్రాలలోనే అమ్ముకొని ప్ర భుత్వ మద్దతు ధర పొందాలని రైతులకు సూచించారు. లారీలు సమయానికి రావ డం లేదని లారీలు రాకపోవడంతో ధాన్యం బస్తాలు కొనుగోలు కేంద్రంలోనే నిలిచిపో తున్నాయని రైతులు తెలుపగా వెంటనే స్పందించిన ఆర్డిఓ ఒక లారీనీ సెంటర్ కు రప్పించి ధాన్యాన్ని తరలించే ఏర్పాటు చే శారు. ఎటువంటి సమస్యలు తలెత్తినా వెం టనే తమ దృష్టికి తీసుకురావాలని సూచిం చారు.ఈ కార్యక్రమంలో ఆర్డిఓ ఆర్ ప్రభాక ర్ తో పాటు తాసిల్దార్ ప్రేమ్ కుమార్ గిర్దవ ర్ శ్రీనివాస్ తిమ్మారెడ్డి గ్రామసర్పంచ్ గంగా రెడ్డి పాల్గొన్నారు.



# ఎల్లారెడ్డిమున్సిపల్ లో అభివృద్ధిపనులకు ఆమోదం

కామారెడ్డి జిల్లా/ఎల్లారెడ్డి/మే 23/అక్షరం న్యూస్:

ఎల్లారెడ్డి పట్టణ ప్రగతి, మౌలిక వ సతుల కల్పన లక్ష్యంగా శనివారం మున్సి పల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ ప ద్మశ్రీకాంత్ అధ్యక్షతన ప్రత్యేక సమావేశా న్ని ఏర్పాటుచేశారు. ఈ సమావేశంలో ప్రజ ల సమస్యల పరిష్కారానికి సంబంధించిన పలు కీలక అంశాలపైకౌన్సిల్ సభ్యులు ఏక గ్రీవంగా ఆమోదించి తీర్మానం చేశారు. ము నిసిపల్ పరిధిలోని 12 వార్డులలో నీటి ఎ ద్దడి నివారణకు, మోటార్లకు కొనుగోలుకు 20 లక్షల నిధులను ఆమోదించి తీర్మానిం చారు. మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డు లలో ఐమాక్స్ లైట్ల కొనుగోలుకు 10 లక్షలు ఆమోదించి తీర్మానించారు. మునిసిపల్ ప రిధిలోని పలు వార్డులలో అవసరం ఉన్న చోట కల్వర్టులు చిన్న మురికి కాలువల ని ర్మాణానికి10 లక్షలు ఆమోదించారు. ముం దస్తు వర్షాకాలం దృశ్యపట్టణ ప్రజలు దోమ ల బారిన పడకుండా తీసుకునే ముందస్తు చర్యలకుఏకగ్రీవంగా తీర్మానించి ఆమోదిం చారు.మునిసిపల్ శానిటేషన్ సిబ్బందికి నె లసరి సబ్బులు, ఇతర వస్తువులతో పాటు సిబ్బందికి ఇన్సూరెన్స్ కల్పించడానికి 10 లక్షలు ఆమోదించి తీర్మానించారు.ముని సిపల్ పరిధిలోని అన్ని వార్డులకు బాడీ ఫ్రీ జర్ ల కొనుగోలుకు ఆమోదించి తీర్మానిం చారు. దీనితోపాటు పట్టణ ప్రజలు ఎన్నో రోజులుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్న కోతులు, పందులు, కుక్కల బెడద నివా రణకు ఏకగ్రీవంగా ఆమోదించి తీర్మానిం చారు. ఈ సమావేశానికి మునిసిపల్ వైస్ చైర్ పర్సన్ మత్తమాల భాగ్యవతి, మున్సి పల్ కౌన్సిలర్లు, మునిసిపల్ కోఆప్షన్ మెం బర్లు, మునిసిపల్ కమిషనర్ జగ్జీవన్, ము నిసిపల్ మేనేజర్ వాసంతి తదితరులు పా ల్గొన్నారు.





## రైతులు వరి కొయ్యలను కాల్చవద్దు

- **రుద్రూర్ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త: ఫిర్దోస్**



కామారెడ్డి జిల్లా/ఎల్లారెడ్డి/మే 23/అక్షరం న్యూస్: వరి కోత అనంతరం మిగిలిన పం ట ఆవశేషాలను కాల్చవద్దని రుద్రూర్ వ్య వసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త ఫిర్దోస్ సూచించారు. శనివారం ఎల్లారెడ్డి మండల కేంద్రంలోనిశబ్దల్పూర్ గ్రామంలోరైతు ముం గిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమాన్ని ఏర్పాటు చే శారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా మా ట్లాడుతూ వరి కోత అనంతరం మిగిలిన వ రి కొయ్యలను కాల్చడం వల్ల, నేలలో పంట కు మేలుచేసే సూక్ష్మజీవులు,వానపాములు చనిపోతాయని, దీనివల్ల భూమిలోని సేంద్రి య కర్బలం తగ్గి, నేలసారం తగ్గుతుందని అన్నారు. రానున్న వర్షాకాలంలో రైతులు పండించే వరిలో అధిక దిగుబడులు వచ్చే మేలు రకాల విత్తనాలు, వివిధ పంటల సా గు విధానంతో పాటు, పంటలపై చీడపీడల నివారణతో పాటు ఎరువుల వాడకంపై రై తులకు అవగాహన కల్పించారు.ఈ కార్య క్రమంలో మండల వ్యవసాయ విస్తరణ అ ధికారిని శోభ, గ్రామ సర్పంచ్, రైతులు గ్రా మస్తులు పాల్గొన్నారు.



## ఎల్ ఓ సీ చెక్కును అందజేసిన మాజీ ఎమ్మెల్యే : భూపాల్ రెడ్డి



సంగారెడ్డి జిల్లా /నారాయణఖేడ్ :కంగ్టి/ మే 23/అక్షరం న్యూస్ /

కంగ్టి మండలం బోర్గి గ్రామానికి చెందిన భూమప్ప కూతురి ఆసుపత్రి వైద్య ఖర్చులకు మంజూరైన 1, 10000 రూపాయల ఎల్ ఓ సీ చెక్కును నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యుడు మ హారెడ్డి భూపాల్ రెడ్డి శనివారం అందజేశా రు.ఈకార్యక్రమంలోఆయనతోపాటు యు వ నాయకులు మహారెడ్డి రోషన్ రెడ్డి, సం జీవ్ పాటిల్, ఇసాక్ తదితరులు ఉన్నారు.

## పశ్చిమాసియాలో సడలని ఉద్రిక్త పరిస్థితులు

- ఇరాన్‌పై దాడులకు అమెరికా సన్నద్ధమైనట్లుగా వార్తలు
- తమ గగన తలాన్ని మూసేస్తూ ఇరాన్ ఆదేశాలు

టెహ్రాన్,మే23 పశ్చిమాసియాలో పరిస్థితులు ఎప్పటికప్పుడు మారిపోతున్నాయి. ఓవైపు చర్చలు కొనసాగుతుండగానే.. ఇరాన్‌పై మరోసారి దాడికి దిగేందుకు అమెరికా సన్నద్ధమవుతుందంటూ వార్తలు వెలువడ్డాయి. ఈ క్రమంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇరాన్ తన గగనతలాన్ని మూసివేసింది. దేశంలోని పశ్చిమ ప్రాంతం వైపున్న గగనతలాన్ని మూసివేస్తున్నట్లు ఇరాన్ పౌర విమానయాన సంస్థ విమానయాన సిబ్బందికి నోటమ్ జారీ చేసింది. ఈనెల 25 వరకు అన్ని విమానాల రాకపోకలను నిలిపివేస్తున్నట్లు తెలిపింది. ఈ నోటమ్ జారీ చేసే సమయంలో ఖతార్ ప్రభుత్వానికి చెందిన ఓ వీఐపీ విమానం ఇరాన్ గగనతలాన్ని దాటింది. ఆ విమానం శాంతి ఒప్పందానికి సంబంధించిన చర్చల కోసం టెహ్రాన్‌కు వచ్చిన ఖతార్ ప్రతినిధి బృందానికి చెందినదిగా తెలుస్తోంది. ఇక, అమెరికా– ఇరాన్ మధ్య చర్చలు తుది దశకు చేరుకున్నాయని, ఒప్పందానికి సంబంధించిన చాలా అంశాల్లో ఇరుదేశాల మధ్య సయోధ్య కుదిరినట్లు తెలుస్తోంది. దీంతో ఏ క్షణమైనా ఒప్పంద ప్రకటన వెలువడే అవకాశముంది. అదే సమయంలో ఈ దౌత్య ప్రయత్నాలు చివరి నిమిషంలో విఫలమైతే.. టెహ్రాన్‌పై మళ్లీ దాడులు చేసే విషయాన్ని అధ్యక్షుడు ట్రంప్ తీవ్రంగా పరిశీలిస్తున్నట్లు వార్తలు వచ్చాయి. ఈ క్రమంలో ఇరాన్ కూడా తన గగనతలాన్ని మూసివేయడంతో.. పశ్చిమాసియాలో ఏ క్షణాన ఏం జరుగుతుందోననే భయాందోళనలు నెలకొన్నాయి. అమెరికా మరోసారి దాడులకు సిద్ధం అవుతోందన్న వార్తల నేపథ్యంలో ఇరాన్ ఇలా అప్రమత్తమైంది. ఈ పరిణామంతో గల్ఫ్‌లో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. యూఎస్ మరోసారి యుద్ధాన్ని ప్రారంభించిన పక్షంలో దీటుగా ఎదుర్కొనేందుకు ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్, ఇతర సాయుధ దళాలు సిద్ధమవుతున్నట్టు ఇరాన్ వార్తా సంస్థ తస్నిమ్ ఒక కథనాన్ని ప్రచురించింది. అమెరికా ఆస్తులకు నష్టం కలిగేలా, ప్రయోజనాలు దెబ్బతినేలా దాడులకు ప్రణాళికలను ఇరాన్ మిలిటరీ సిద్ధం చేసినట్టు సమాచారం. ఈ వారాంతాన్ని న్యూజెర్సీలో గడపాల్సిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చివరి నిమిషంలో తన ప్లాన్స్‌ను అకస్మాత్తుగా రద్దు చేసుకుని రాజధాని వాషింగ్టన్‌కు తిరిగొచ్చారు. దీంతో, పశ్చిమాసియాలో మళ్లీ ఘర్షణలు మొదలవుతాయన్న వార్తలు మీడియాలో వెలువడ్డాయి. ఈ వారాంతంలో మెమోరియల్ డే వేడుకల్లో పాల్గొనాల్సిన అమెరికా నిఘా సంస్థల సీనియర్ అధికారులు కూడా తమ ప్రణాళికలను రద్దు చేసుకుని వాషింగ్టన్‌కు తిరిగొచ్చేశారు. రాబోయే 24 గంటల్లో దౌత్యపరమైన పురోగతి లేని పక్షంలో దాడులు మొదలుపెట్టేందుకు ట్రంప్ కూడా సుముఖంగానే ఉన్నట్టు స్థానిక మీడియాలో కథనాలు వెలువడ్డాయి. పరిస్థితులు అంతకంతకూ ఉద్రిక్తంగా మారుతున్నా తెరవెనుక దౌత్యమార్గాల్లో ప్రయత్నాలు ముమ్మర స్థాయిలో జరుగుతున్నట్టు కూడా తెలుస్తోంది. చర్చల్లో కొంత పురోగతి కనిపించిందని విశ్వసనీయ వర్గాలు చెప్పినట్టు తస్నిమ్ వార్తా సంస్థ పేర్కొంది.

## గిరిజన ప్రాంతాల అభివృద్ధి, రవాణా సౌకర్యానికి పెద్దపీట



- రవాణా కష్టాల శాశ్వత పరిష్కారానికే సరికొత్త హై లెవల్ బ్రిడ్జిల నిర్మాణాలు.
- మౌలిక వసతుల కల్పనతో పల్లెల రూపురేఖలు మార్చడమే ప్రధాన ధ్యేయం.
- గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికే పిహెచ్సి.
- నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా నిరంతర శ్రమ, మరిన్ని నిధుల సాధన.
- సమస్యల పరిష్కారంలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరం.
- ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి.
- త్వరితగతిన పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తాం.
- కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు.

భద్రాద్రి కొత్తగూడెం చుంచుపల్లి/ మే 23 / అక్షరం న్యూస్ –: గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఐటిడిఏ నిధుల ద్వారా పెద్దపీట వేస్తున్నామని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివారం నియోజకవర్గ పరిధిలోని పలు అభివృద్ధి పనులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఇందులో భాగంగా చిట్టిరామవరం నుంచి చుంచుపల్లి రహదారిపై హై లెవల్ బ్రిడ్జి నిర్మాణానికి, అలాగే కొత్తగూడెం బైపాస్ రోడ్డు నుంచి పెనుబల్లి (గరిమెళ్ళపాడు) ప్రధాన రోడ్డుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. అదేవిధంగా పెనుబల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన పిహెచ్సి భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభల్లో ఆయన మాట్లాడుతూ మౌలిక వసతుల కల్పనతో పల్లెల రూపురేఖలు మార్చడమే తమ ప్రధాన ధ్యేయమన్నారు. ఈ బ్రిడ్జిల నిర్మాణంతో స్థానిక ప్రజల దశాబ్దాల రవాణా కష్టాలు తీరనున్నాయని, అత్యవసర సమయాల్లో వైద్యం కోసం ఇబ్బందులు పడకుండా పెనుబల్లిలో అధునాతన ప్రాథమిక వైద్యశాల అందుబాటులోకి తెచ్చామని ఆయన వివరించారు. రానున్న రోజుల్లో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దుతామని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, గ్రంధాలయ చైర్మన్ వీరబాబు, అధికారులు ఎంపిడివో శుభాషిణి, తహసీల్దార్ నాగరాజు, ట్రైబల్ వెల్ఫేర్ అధికారులు మధుకర్, శ్రీకాంత్, నాగేంద్ర, స్థానిక నాయకులు వాసిరెడ్డి మురళి, నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, భవాని, గోవిందు, సర్పంచి శాంతి శ్రీ, రెడ్డి అరుణ తదితరులు పాల్గొన్నారు.



# రిజర్వేషన్లతో కొందరికే లబ్ది !

హైదరాబాద్,మే23 స్వాతంత్ర్యం లభించి 80ఏళ్లకు చేరువలో ఉన్నాం. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ప్రజలు త్యాగాలు చేస్తుంటే కొందరు ఫలితాలు అనుభవిస్తున్నారు. ముఖ్యంగా భారతదేశంలో రాజకీయ నేతలు, ప్రజాప్రతినిధులు అనుభవిస్తున్న లగ్జరీ జీవితం అంతా ఇంతా కాదు. ఒక్కసారి ఎమ్మెల్యే, ఎంపి అయితే చాలు..జీవితాంతం సుఖంగా బతికేయవచ్చన పరిస్థితి ఏర్పడింది. పేరుకే ప్రజాస్వామ్యం కానీ.. అదృష్టమంతా ప్రజాప్రతినిధులదే. అధికారాన్ని గుప్పిట్లో పెట్టుకుని ప్రజలను ఓట్లేసే పురుగుల్లా చూస్తున్నారు. కొన్ని తాయిలాలు ప్రకటించి, మొత్తం అధికారం, ఆర్థిక స్వేచ్ఛ వారు అనుభవిస్తున్నారు. అందుకే ప్రజల్లో నివురుగప్పిన నిప్పులా ఉన్న ఆగ్రహం అప్పుడప్పుడు కట్టలు తెంచుకుంటోంది. ఒక్కోసారి చిన్న సమస్యగా ఉన్న వ్యవహారం పెద్ద ఎత్తున ఉవ్వెత్తున ఎగిసి పడుతోంది. ఇటీవల కాక్రోచ్ జనతా పార్టీ ఇందుకు నిదర్శనంగా చెప్పుకోవాలి. ప్రజల్లో ఏమూలో దాగివున్న ఆగ్రహం ఇలా బయటకు వస్తోంది. వివిధ రూపాల్లో ఉన్న వ్యతిరేకత ఒక్కటైతే రాజకీయ పార్టీల నేతలు తట్టుకోవడం కష్టం. అనేక దేశాల్లో ఇలాగే ప్రజాగ్రహం కట్టలు తెంచుకున్న సంగతి చూశాం. నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంక, వెనిజులా తదితర దేశాల్లో ప్రజల ఆగ్రం ఎలా పరిణమించిందో చూశాం. అందువల్ల పాలకులు ప్రజాసంక్షేమం కోరి నిర్ణయాలు తీసుకోవాలి. వాటిని ఆచరణలో పెట్టాలి. నిరంతరం సమస్యలతో పోరాడుతున్న ప్రజలను పట్టించుకోవాలి. తమ సుఖం కాదు..ప్రజల సంక్షేమం ముఖ్యమని గమనించాలి. ధాన్యం కొనుగోలల్లు కావచ్చు, ఫీజుల మోత కావచ్చు...నిరుద్యోగం కావచ్చు...ఇలా అనేక సమస్యలపై ప్రజల్లో ఆందోళనలు గూడుకట్టుకుని ఉన్నాయి. అండుదకే తరతరాలుగా అధికారంలో తామే ఉండాలన్న కుటిల రాజకీయాలు మానాలి. ఇకపోతే తాజాగా సుప్రీం ధర్మాసనం రిజర్వేషన్ల తీరుపై అసహనం వ్యక్తం చేసింది. దీనిపై చర్చ జరగాలి. చట్టసభల్లో ఇలాంటి వాటిపై చర్చించాలి. కొందరే రిజర్వేషన్ల ఫలాలు అనుభవించడంపై సుప్రీం సంచలన వ్యాఖ్యలు చేసింది. కొందరే వీటిని పదేపదే అనుభవించడం ద్వారా మిగతావారికి అడ్డుపడుతున్నారని అభిప్రాయపడింది. గతంలో సిజెఐగా పనిచేసిన బిఆర్ గవాయ్ కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. క్రిమీలేయర్ ఉండాలని ఆయన ఆనాడు అభిప్రాయ పడ్డారు. కొందరు రిజర్వేషన్లు అనుభవించాక, తమ కుటుంబంలోని వారంతా అదే రిజర్వేషన్ల మెట్లెక్కాలని చూస్తున్నారు. తాజాగా ఇప్పుడు సుప్రీం ధర్మాసనం కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేసింది. వెనుకబడిన తరగతుల్లోని ఆర్థికంగా, విద్యాపరంగా



అభివృద్ధి చెందిన కుటుంబాల పిల్లలకు రిజర్వేషన్ ప్రయోజనాలను కొనసాగించాలని కోరడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. ఉన్నత స్థితికి చేరుకున్న కుటుంబాలు పదేపదే రిజర్వేషన్ ప్రయోజనాలు పొందడంపై ఆందోళన వ్యక్తం చేసింది. ఎందుకంటే ఇలా ర ఇజర్వేషన్లు పొందిన వారు రాజకీయంగా వారే స్థిరపడిపోతున్నారు. ఉన్నత శ్రేణి ఉద్యోగలు సాధించిన ఐఎఎస్, ఐపిఎస్‌లు కూడా తమ పిల్లకు రిజర్వేషన్లు పొందుతున్నారు. దీనినే సుప్రీం ధర్మాసనం ప్రశ్నించింది. దేశంలో రిజర్వేషన్ల ఫలాలు అందుకొని సామాజికంగా, ఆర్థికంగా ఉన్నత స్థాయికి చేరిన కుటుంబాలు.. తరతరాలుగా అదే కోటాను కోరుకోవడంపై సుప్రీంకోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ’తల్లిదండ్రులు ఇద్దరూ ఐఏఎస్ అధికారులై, ప్రభుత్వ సర్వీసుల్లో ఉంటూ పూర్తి స్థాయిలో స్థిరపడినప్పుడు, ఇక వారి పిల్లలకు రిజర్వేషన్ల కోటా ఎందుకని అత్యున్నత న్యాయస్థానం సంచలన ప్రశ్నలు సంధించింది. ఇది చర్చించాలి. లేకుంటే ప్రజల్లో ఇలాంటి వ్యత్యాసాలపైనా వ్యతిరేకత వస్తుంది. ఎక్కడో ఒకచోట దీనికి చెక్ పెట్టాలి. రిజర్వేషన్లు ఎల్లకాలం కాదన్న నిజం బయటకు రావాలి. అవసరమైతే చట్టం చేయాలి. వెనుకబడిన వర్గాల్లోని ’క్రీమీలేయర్’ పరిమితులు, రిజర్వేషన్ల మినహాయింపులపై దాఖలైన పిటిషన్లను విచారించిన సందర్భంగా జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. విచారణ సందర్భంగా జస్టిస్ బి.వి. నాగరత్న మాట్లాడుతూ.. విద్య, ఆర్థిక సాధికారత ద్వారా సమాజంలో ఒక స్థాయి లభిస్తుందని పేర్కొన్నారు. ’రిజర్వేషన్ల ద్వారా ఒకసారి ఉన్నత స్థాయికి చేరుకున్నాక కూడా, మళ్లీ వారి పిల్లల కోసం రిజర్వేషన్ కోటాను ఆశించడం సరికాదన్నారు. ఇలాగైతే మనం రిజర్వేషన్ల వ్యవస్థ నుంచి ఎప్పటికీ బయటపడలేం. ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించాల్సి ఉందని వ్యాఖ్యానించారు. ఒక వ్యక్తి సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడి ఉండవచ్చుని.. కానీ, రిజర్వేషన్ల ప్రయోజనం పొంది తల్లిదండ్రులు ఉన్నత స్థానాలకు వెళ్లినప్పుడు వారి పిల్లల పరిస్థితి మారుతుందని, ఇక్కడ ఒక సమతుల్యత అవసరమని కోర్టు స్పష్టం చేసింది. ఒకే కుటుంబంలో ఉన్నత వర్గాలే అన్ని అవకాశాలను చేజిక్కించుకుంటే, అదే వర్గంలోని అత్యంత వెనుకబడిన పేదలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. రిజర్వేషన్ల ఫలాలు కేవలం కొందరికే పరిమితం కాకుండా, సమాజంలో కిందిస్థాయిలో ఉన్న చివరి వ్యక్తికి కూడా అందాల్సిన అవసరం ఉందని కోర్టు అభిప్రాయపడింది. రాజకీయంగా ఎస్సీ,ఎస్టీ రిజర్వేషన్లు పొందుతున్న వారు తమ కుటుంబాలకు కూడా రిజర్వేషన్ కోటాలో లబ్ది పొందుతున్నారు. ఒకే కుటుంబం నుంచి రిజర్వేషన్ల కోటాలో ఎన్నికై ఎమ్మెల్యేలు, ఎంపిలు అయి మంత్రి పదవులు అనుభవిస్తున్నారు. ఇలాంటి వారివల్ల పక్కన ఉన్నవారు ఎన్నటికీ రిజర్వేషన్లు పొందలేక పోతున్నారు. దీనిపై దేశవ్యాప్తం చర్చ జరగాలి. కాక్రోచ్ జనతాపార్టీ కూడా చర్చించాలి. వెనకబడిన తరగతుల్లోని ఆర్థికంగా, విద్యాపరంగా ఉన్నత స్థితిలో ఉన్న కుటుంబాలకు చెందిన పిల్లలకు రిజర్వేషన్లు ఎందుకని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. అలాంటి వారు కూడా రిజర్వేషన్లు కొనసాగించాలని కోరడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. కర్ణాటకకు చెందిన ఓ వ్యక్తి తల్లిదండ్రులిద్దరూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు అయినందున క్రీమీలేయర్ కిందకు వస్తారని.. రిజర్వేషన్ వర్తించదంటూ ఆ రాష్ట్ర హైకోర్టు తీర్పు ఇచ్చింది. దాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆ పిటిషన్‌పై శుక్రవారం జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌ల ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా రిజర్వేషన్లపై కీలక వ్యాఖ్యలు చేసింది. ఇప్పుడు రాజకీయాల్లోనూ రిజర్వేషన్లపై చర్చించాలి. అప్పుడే మిగతా వారికి రిజర్వేషన్ ఫలాలు దక్కుతాయి.

# బ్రిడ్జి నిర్మాణం సీతంపేట-రాఘవాపురం గ్రామీణుల చిరకాల వాంఛ





- కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు.
- సుజాతనగర్ మండలంలో శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు.

- రూ.4.75కోట్లతో హై లెవల్ బ్రిడ్జి నిర్మాణం చేపడుతున్నాం.
- నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తెస్తాం.
- రూ.34లక్షలతో రెడ్డిపాలెం సిసి రోడ్డు నిర్మాణం పూర్తి చేశాం.
- రూ.45లక్షలతో నిర్మించిన ఎంఆర్సి భవనం అందుబాటులోకి వచ్చింది.
- ప్రజా సంక్షేమమే ధ్యేయంగా నిరంతరం ప్రజల చెంతనే ఉంటాం.
- రాబోయే రోజుల్లో మరిన్ని నిధులతో పల్లెల రూపురేఖలు మారుస్తాం.

భద్రాద్రి కొత్తగూడెం సుజాతనగర్ / మే 23 అక్షరం న్యూస్ –: సీతంపేట–రాఘవాపురం గ్రామీణుల చిరకాల వాంఛ అయిన బ్రిడ్జి నిర్మాణాన్ని నెరవేరుస్తున్నామని, బ్రిడ్జి నిర్మాణం ప్రాధాన్యతను గుర్తించి ప్రత్యేక చొరవతో నిధులు మంజూరు చేయించడం జరిగిందని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. సుజాతనగర్ మండల పరిధిలో రూ.5.54 కోట్ల నిధులకు సంబంధించి శనివారం అయన శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభల్లో కూనంనేని మాట్లాడుతూ రూ.4.75 కోట్ల భారీ అంచనా వ్యయంతో హై లెవల్ బ్రిడ్జి నిర్మాణం చేపడుతున్నామని వెల్లడించారు. ఈ బ్రిడ్జి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు. అలాగే రూ.34 లక్షలతో రెడ్డిపాలెం సీసీ రోడ్డు నిర్మాణం పూర్తి చేసి విజయవంతంగా అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. రూ.45 లక్షలతో అత్యాధునిక వసతులతో నిర్మించిన ఎంఆర్సి భవనాన్ని కూడా ఈ రోజు ప్రారంభించడం సంతోషంగా ఉందని, మండలంలో విద్యాసంబంధిత సేవలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానున్నాయన్నారు. వేపలగడ్డ స్మశానవాటికలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి రెండు బోర్లు మంజూరు చేయడం జరిగిందని, వాటి శంకుస్థాపన పూర్తేచేశామన్నారు. నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తాము నిరంతరం శ్రమిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. పల్లెల్లో మౌలిక వసతుల కల్పనకు తమ ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే వివరించారు. రాబోయే రోజుల్లో మరిన్ని నిధులను మంజూరు చేయించి నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి పనుల నాణ్యతలో రాజీ పడకుండా సకాలంలో పూర్తి చేయాలని ఈ సందర్భంగా ఆయన ఆదేశించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, కొత్తగూడం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, తహసీల్దార్ వి వరప్రసాద్, ఎంపిడివో భారతి, ఆరడబ్ల్యూఎస్ ఏఈ గుప్తా, విద్యుత్ ఏఈ జి కిషన్, ఏడిఈ రవికుమార్, సిఐ వెంకటేశ్వర్, పిఆర్ ఏఈ రాజు, డిఈ నాగేందర్, ఎంఈ ఓ లీలా, ఎస్ఐ రమాదేవి, హన్మంతరావు, వ్యవసాయశాఖ అధికారి నర్మద, స్థానిక నాయకులు భూక్యా దస్రు, కొమారి హన్మంతరావు, జక్కుల రాములు, ఉపేందర్, భూక్యా శ్రీనివాస్, గుమ్మడిల్లి దర్గయ్య, బొడ్డు కేశవరావు, గారికే ఉపేందర్, నరేష్, ముక్కెర మురళి, దండు సురేష్, లావుడియా గోపి తదితరులు పాల్గొన్నారు.





# పెద్ది విజయంపైనే రామ్‌చరణ్ ఆశలు

### బుచ్చిబాబు దర్శకత్వానికి కూడా సవాలే

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్.... ఆర్ఆర్ఆర్ తర్వాత గ్లోబల్ స్టార్‌గా ఎదిగిన ఆయనకు అంతర్జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు లభించింది. అయితే ఆ తరువాత వచ్చిన సినిమాలు మాత్రం ఆశించిన స్థాయిలో విజయాలు అందుకోలేకపోయాయి. దీంతో ఇప్పుడు చరణ్ కెరీర్‌లో రాబోయే రెండు ప్రాజెక్టులు అత్యంత కీలకంగా మారాయి. ఆచార్యలో కీలక పాత్ర పోషించినప్పటికీ ఆ చిత్రం ప్రేక్షకులను ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోయింది. అనంతరం భారీ అంచనాల మధ్య విడుదలైన గేమ్ ఛేంజర్ కూడా బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేకపోయింది. స్టార్ దర్శకుడు, భారీ బ్జడెట్, భారీ తారాగణం ఉన్నప్పటికీ సినిమా ప్రేక్షకుల అంచనాలను పూర్తిగా అందుకోలేకపోయింది. దీంతో ఇప్పుడు అభిమానుల ఆశలన్నీ చరణ్ తదుపరి చిత్రం 'పెద్ది'పై నిలిచాయి. దర్శకుడు బుచ్చిబాబు సన తెరకెక్కిస్తున్న ఈ చిత్రం గ్రామీణ నేపథ్యంలో సాగే స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాగా రూపొందుతోంది. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్, గ్లింప్స్, పాటలు, టీజర్‌లకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. ముఖ్యంగా చరణ్ మాస్ లుక్, రగ్గడ్ బాడీ లాంగ్వేజ్ అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. చాలా కాలం తర్వాత ఆయనను పూర్తి స్థాయి మాస్ పాత్రలో చూడబోతున్నామనే అంచనాలు అభిమానుల్లో కనిపిస్తున్నాయి. బుచ్చిబాబు తన తొలి చిత్రం ఉప్పెన తోనే దర్శకుడిగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. భావోద్వేగాలను బలంగా తెరపై చూపించడంలో ఆయన ప్రత్యేక శైలి ఉందని సినీ విశ్లేషకులు చెబుతుంటారు. అదే ఎమోషనల్ టచ్ 'పెద్ది'లో కూడా కనిపించనుందనే టాక్ వినిపిస్తోంది. ఇక 'పెద్ది' తర్వాత చరణ్ చేయబోయే సినిమా మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఎందుకంటే ఆ చిత్రానికి దర్శకత్వం వహించబోయేది సుకుమార్. ఇప్పటికే వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన రంగస్థలం ఇండస్ట్రీ హిట్‌గా నిలిచింది. ముఖ్యంగా చిట్టిబాబు పాత్రలో చరణ్ నటనకు భారీ ప్రశంసలు వచ్చాయి. ఆ సినిమా ఆయన కెరీర్‌లో కీలక మలుపుగా నిలిచింది.




ఇప్పుడు మరోసారి అదే కాంబినేషన్ రిపీట్ అవుతుండటంతో అభిమానుల్లో అంచనాలు మరింత పెరిగాయి. ఒకవేళ 'పెద్ది' భారీ విజయాన్ని అందుకుంటే ఆయన మాస్ ఇమేజ్ మరింత బలపడే అవకాశం ఉంది. ఆ తర్వాత సుకుమార్ సినిమా కూడా విజయవంతమైతే గ్లోబల్ స్టార్‌గా ఆయన మార్కెట్ మరింత విస్తరించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# అనిరుధ్‌తో లవ్‌లో కావ్య మారన్

### త్వరలోనే వెడ్డింగ్ అంటూ సోషల్ మీడియాలో చక్కర్లు





సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు ఓనర్ కావ్య మారన్‌కు సోషల్ మీడియాలో ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఐపీఎల్ మ్యాచ్‌ల సమయంలో ఆమె హావభావాలు, రియాక్షన్స్ తరచూ వైరల్ అవుతూ అభిమానుల్లో ప్రత్యేక గుర్తింపును సంపాదించాయి. అభిమానులు ప్రేమగా 'కావ్య పాప' అని పిలుచుకునే ఆమెకు సంబంధించిన ఓ వార్త ప్రస్తుతం సోషల్ మీడియా, సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. కావ్య మారన్ త్వరలోనే వివాహ బంధంలోకి అడుగుపెట్టబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. అంతేకాదు, ప్రముఖ సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్‌తో ఆమె పెళ్లి జరగబోతుందనే వార్తలు పెద్ద ఎత్తున వైరల్ అవుతున్నాయి. అయితే ఈ ప్రచారం కొత్తది కాదు. గత ఏడాది నుంచే కావ్య మారన్, అనిరుధ్ మధ్య సాన్నిహిత్యం ఉందంటూ సోషల్ మీడియాలో పుకార్లు వినిపించాయి. ముఖ్యంగా ఇద్దరూ న్యూయార్క్‌లో కలిసి కనిపించారనే వార్తలు రావడంతో డేటింగ్ రూమర్స్ మరింత ఊపందుకున్నాయి. అప్పటి నుంచి వీరిద్దరి గురించి అనేక కథనాలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఇప్పుడు మరోసారి కొత్త ప్రచారం తెరపైకి వచ్చింది. కొన్ని మీడియా కథనాల ప్రకారం, ఇరువురి కుటుంబ సభ్యులు ఈ వివాహానికి అంగీకారం తెలిపారని, విదేశాల్లో వివాహం జరిపించే అవకాశాలపై చర్చలు జరుగు తున్నాయని సమాచారం. వివాహం అనంతరం చెన్నైలో ఘనంగా రిసెప్షన్ నిర్వహించే ఏర్పాట్లు కూడా జరుగుతున్నాయనే ప్రచారం నడుస్తోంది. ఇదిలా ఉండగా మరో ఆసక్తికర విషయం కూడా చర్చనీయాంశమైంది. అనిరుధ్‌కు కుటుంబ సంబంధాలు ఉన్న సినీ ప్రముఖులు ఈ వివాహం కోసం ప్రత్యేకంగా చొరవ తీసుకున్నారనే కథనాలు తమిళ మీడియా వర్గాల్లో వినిపిస్తున్నాయి. అయితే ఈ వార్తలపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. మరోవైపు కావ్య మారన్ క్రీడా, వ్యాపార వ్యవహారాల్లో చురుకుగా వ్యవహరిస్తున్నారు. అయితే ఇప్పటివరకు ఈ వివాహ వార్తలపై అటు కావ్య మారన్ కుటుంబం కానీ, ఇటు అనిరుధ్ వర్గాలు కానీ ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు.

# నాగార్జునకు మే 23 స్పెషల్

### తొలి చిత్రం విక్రమ్ విడుదలై 23 ఏళ్లు




తన జీవితంలో 'మే 23' ఎప్పటికీ ప్రత్యేకమేనని అగ్ర కథానాయకుడు నాగార్జున అన్నారు. అందులోనూ ఈ ఏడాది మరీ స్పెషల్ అని తెలిపారు. తన మొదటి చిత్రం 'విక్రమ్' విడుదలై నేటికి 40 ఏళ్లు అయిన సందర్భంగా ఆయన పోస్ట్ పెట్టారు. తనను ఆదరిస్తున్న అభిమానులకు ధన్యవాదాలు తెలిపారు. అందరికీ ధన్యవాదాలు. మే 23.. నేను ఎప్పటికీ మర్చిపోలేని రోజు.. మా నాన్న చివరి చిత్రం (మనం) 2014లో ఈరోజే విడుదలైంది. నాన్నతో పాటు నాగచైతన్య, అఖిల్‌లతో నటించే అవకాశం ఆ సినిమాతోనే దక్కింది. ఇక 40 ఏళ్ల క్రితం ఇదే రోజు నా మొదటి చిత్రం 'విక్రమ్' విడుదలైంది. మిమ్మల్ని అలరించడం కోసం, మీ ప్రేమాభిమానాలు పొందడం కోసం నేను ఇండస్ట్రీకి వచ్చాను. 'విక్రమ్' నాకు ఎంతోమంది అభిమానులను దగ్గర చేసింది. ఇన్నేళ్లుగా నాకు అండగా నిలిచిన అభిమానులందరికీ నా కృతజ్ఞతలు. భవిష్యత్తులో మరిన్ని మే 23లను ఇలానే సెలబ్రేట్ చేసుకోవాలని కోరుకుంటున్నా' అని నాగార్జున తన పోస్ట్‌లో పేర్కొన్నారు. నాగార్జున హీరోగా మధుసూధనరావు తెరకెక్కించిన చిత్రం 'విక్రమ్' 1986 మే 23న విడుదలై విజయాన్ని అందుకుంది. 1983లో బాలీవుడ్‌లో విడుదలైన 'హీరో' సినిమాకు రీమేక్‌గా రూపొందింది. ప్రస్తుతం కింగ్ తన 100వ సినిమాతో బిజీగా ఉన్నారు. తమిళ దర్శకుడు రా.కార్తీక్ తెరకెక్కిస్తున్నారు. 'కింగ్ 100'అనే వర్కింగ్ టైటిల్‌తో ప్రచారంలో ఉంది. నాగార్జున ఇందులో పలు రకాల గెటప్పుల్లో కనిపిస్తారని, ఆయన పేరు చెప్పగానే శివ, రక్షకుడుతోపాటు, 'కూలీ'లో పోషించిన సైమన్ లాంటి స్టైలిష్ పాత్రలు గుర్తొస్తాయని, వాటన్నిటినీ గుర్తుచేసేలా 'కింగ్ 100' ఉంటుందని దర్శకుడు ఇటీవల తెలిపారు.




# చరిత్ర సృష్టించిన హెన్రిచ్ క్లాసెన్

సౌతాఫ్రికా మాజీ బ్యాటర్, సన్‌రైజర్స్ హైదరాబాద్ స్టార్ ఆటగాడు హెన్రిచ్ క్లాసెన్ అరుదైన ఘనత సాధించాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో 600 పరుగుల మైలురాయిని చేరుకున్నాడు. శుక్రవారం ఉప్పల్ వేదికగా ఆర్‌సీబీతో జరిగిన మ్యాచ్‌లో 51 పరుగులు చేయడం ద్వారా ఈ మైలురాయిని అందుకున్నాడు. ఈ నేపథ్యంలో ఓ టీ20 టోర్నమెంట్‌లో 4వ స్థానం లేదా అంతకంటే దిగువన బ్యాటింగ్ చేస్తూ 600కి పైగా పరుగులు చేసిన తొలి క్రికెటర్‌గా క్లాసెన్ చరిత్ర సృష్టించాడు.ఆర్‌సీబీ మ్యాచ్‌కు ముందు హెన్రిచ్ క్లాసెన్ 4వ స్థానం లేదా అంతకంటే తక్కువ స్థానంలో బ్యాటింగ్ చేస్తూ 13 ఇన్నింగ్స్‌లలో 555 పరుగులు సాధించాడు. ఆర్‌సీబీతో జరిగిన మ్యాచ్‌లో 4వ స్థానంలో ఆడిన క్లాసెన్ కేవలం 24 బంతుల్లోనే మెరుపు వేగంతో 51 పరుగులు చేసి ఈ టోర్నమెంట్‌లో 600 పరుగులను పూర్తి చేసుకున్నాడు. ఈ క్రమంలోనే రిషబ్ పంత్‌ను అధిగమించాడు. ఐపీఎల్ 2018లో పంత్ 11 ఇన్నింగ్స్‌లలో 579 పరుగులు చేశాడు. ఈ పరుగులు నాలుగు లేదా నాలుగు కంటే దిగువన స్థానాల్లో బ్యాటింగ్ చేస్తూ సాధించాడు.



# ఎఐతో నకిలీ బికినీ ఫోటలు

### నెట్టింట వైరల్ కావడంపై నటి రుక్మిణీ ఆగ్రహం



'సప్త సాగరాలు దాటి' సినిమాతో తెలుగు ప్రేక్షకులలో మంచి గుర్తింపు తెచ్చుకున్న కన్నడ నటి రుక్మిణి వసంత్‌కు సంబంధించిన కొన్ని బికినీ ఫోటోషూట్ క్లిప్స్ సోషల్ మీడియాలో విపరీతంగా కనిపించడంపై న టి రుక్మిణీ వసంత్ ఆగ్రహం చెందారు. గ్రీన్ కలర్ బికినీ ధరించి ఆమె స్విమ్మింగ్ పూల్‌లోకి దిగుతున్నట్లు ఉన్న ఈ విజువల్స్ నెటిజన్లను ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురిచేశాయి. చుట్టూ కెమెరాలు, టెక్నీషియన్లు ఉండటంతో ఇది ఏదైనా అధికారిక షూట్ అయ్యి ఉంటుందని కొందరు భావించగా, మరికొందరు మాత్రం ఇది ఏఐ డీప్‌ఫేక్ అయ్యి ఉండవచ్చని అనుమానాలు వ్యక్తంచేశారు. అయితే ఈ వివాదంపై తాజాగా నటి రుక్మిణి వసంత్ అధికారికంగా స్పందిస్తూ ప్రకటన విడుదల చేశారు. ఇంటర్నెట్‌లో తన పేరిట సర్క్యులేట్ అవుతున్న బికినీ చిత్రాలన్నీ పూర్తిగా ఎఐ ద్వారా సృష్టించిన నకిలీ ఫోటోలని ఆమె స్పష్టం చేశారు. ఆ చిత్రాలు పూర్తిగా తప్పుడు సమాచారంతో, కల్పితంగా సృష్టించబడినవని ఆమె పేర్కొన్నారు. బాధ్యతా రాహిత్యంగా ఇతరుల వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగిస్తూ ఇటువంటి మార్ఫింగ్ కంటెంట్‌ను తయారు చేయడం మరియు వాటిని వైరల్ చేయడం తీవ్రమైన నేరమని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారాన్ని తన టీమ్ చాలా తీవ్రంగా పరిగణిస్తోందని, ఈ ఫోటోలను సృష్టించిన వారిపై, అలాగే వీటిని సోషల్ మీడియాలో షేర్ చేస్తూ ప్రచారం కల్పిస్తున్న వారిపై సైబర్ క్రైమ్ విభాగంలో ఫిర్యాదు చేసి కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోబోతున్నట్లు రుక్మిణి వెల్లడించారు. నెటిజన్లు ఎవరూ కూడా ఇటువంటి నకిలీ కంటెంట్‌ను ఇతరులకు షేర్ చేయవద్దని, వాటిని ప్రోత్సహించవద్దని ఆమె ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

# అఖిల్ లెనిన్ టీజర్ విడుదల


### అక్కినేని అభిమానుల్లో ఉత్సాహం




అక్కినేని అఖిల్ హీరోగా తెరకెక్కుతున్న తాజా చిత్రం 'లెనిన్'పై ప్రేక్షకుల్లో ఆసక్తి రోజురోజుకూ పెరుగుతోంది. యువ దర్శకుడు మురలీకిశోర్ అబ్బూరు దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తోంది. ఇప్పటికే సినిమా అనౌన్స్‌మెంట్‌తో మంచి అంచనాలు ఏర్పడగా, తాజాగా విడుదలైన టీజర్ సినిమాపై మరింత హైప్ తీసుకొచ్చింది. ఈ సినిమా జూన్ 26న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో చిత్రబృందం ప్రచార కార్యక్రమాలను వేగవంతం చేసింది. మరోవైపు అక్కినేని నాగార్జున సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టి 40 ఏళ్లు పూర్తి చేసుకున్న ప్రత్యేక సందర్భంగా, 'లెనిన్' టీజర్‌ను విడుదల చేయడం అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని నింపింది.

విడుదలైన టీజర్‌లో అఖిల్ స్టైలిష్ లుక్‌తో పాటు మాస్ ఎలిమెంట్స్ కూడా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా ఆయన చెప్పిన డైలాగులు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. మనోడు వస్తున్నాడు? నేను తప్పిపోయి రాలేదు.. మీ అందరినీ వెతుక్కుంటూ వచ్చా? అంటూ అఖిల్ చెప్పిన డైలాగులు సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతున్నాయి. ఈ డైలాగుల్లో కనిపించిన యాటిట్యూడ్, స్క్రీన్ ప్రెజెన్స్ అభిమానులను ఆకట్టుకుంటున్నాయని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇక టీజర్ విడుదలపై నాగార్జున కూడా స్పందించారు. తనకు ఈ టీజర్ ఒక సర్‌ప్రైజ్‌లా అనిపించిందని ఆయన పేర్కొన్నారు. టీజర్ మొత్తం ఎంతో హాయిగా, ఆకట్టుకునేలా అనిపించిందని అభిప్రాయపడ్డారు. మంచి కమ్‌బ్యాక్ కోసం ఎదురుచూస్తున్న ఆయనకు 'లెనిన్' మంచి మైలురాయిగా మారుతుందా అనే ఆసక్తి అభిమానుల్లో కనిపిస్తోంది. ఇప్పటికే విడుదలైన టీజర్ చూస్తుంటే సినిమాలో యాక్షన్, భావోద్వేగాలు, మాస్ అంశాలు సమపాళ్లలో ఉండబోతున్నట్లు సంకేతాలు కనిపిస్తున్నాయి. దీంతో జూన్ 26న విడుదల కానున్న ఈ సినిమాపై అక్కినేని అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

# సన్ రైజర్స్ ఐపీఎల్ టైటిల్ సాధించేనా?



ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 ఆఖరి అంకానికి చేరుకుంది. ఆదివారం జరిగే డబుల్ హెడర్ పోరుతో లీగ్ దశ ముగియనుంది. ప్రస్తుతం మరో మూడు మ్యాచ్‌లు మాత్రమే మిగిలి ఉన్నాయి. శనివారం పంజాబ్ కింగ్స్, లక్నో సూపర్ జెయింట్స్ మ్యాచ్‌లు తలపడతాయి. ఇక ఆదివారం జరిగే డబుల్ హెడర్‌లో కేకేఆర్‌తో ఢిల్లీ క్యాపిటల్స్.. రాజస్తాన్ రాయల్స్‌తో ముంబై ఇండియన్స్ జట్లు తలపడతాయి. ఇప్పటికే ఆర్సీబీ, గుజరాత్ టైటాన్స్, సన్ రైజర్స్ హైదరాబాద్ జట్లు ప్లే ఆఫ్స్ చేరుకున్నాయి. ఆర్సీబీ, గుజరాత్ టైటాన్స్ జట్లు టాప్ 2లో నిలిచాయి. ఇక ఆర్సీబీపై తమ ఆఖరి లీగ్ మ్యాచ్‌లో నెగ్గినా మెరుగైన నెట్ రన్ రేట్ లేకపోవడంతో సన్ రైజర్స్ హైదరాబాద్ మూడో స్థానంలో నిలిచింది. టాప్ 2లో నిలిచిన జట్లకు ఫైనల్ చేరేందుకు రెండు అవకాశాలు ఉంటాయి.ఇక 3, 4వ స్థానాల్లో నిలిచిన జట్లు ఫైనల్ చేరాలంటే వరుసగా రెండు మ్యాచ్‌ల్లో నెగ్గాల్సిందే. అయితే ఇలాంటి స్థితిలో నిలవడం సన్ రైజర్స్ హైదరాబాద్‌కు ఇదేం తొలిసారి కాదు. 2016లో కూడా ఇలాంటి పరిస్థితినే సన్ రైజర్స్ హైదరాబాద్ ఎదుర్కొంది. 2016 ఐపీఎల్‌లో గుజరాత్ లయన్స్.. ఆర్సీబీ జట్లు వరుసగా టాప్ 2లో నిలిచాయి. ఇక సన్ రైజర్స్ హైదరాబాద్ మూడు.. కేకేఆర్ 4వ స్థానంలో నిలిచాయి. క్వాలిఫయర్ 1లో గుజరాత్ లయన్స్‌పై ఆర్సీబీ నెగ్గి ఫైనల్ చేరగా.. కేకేఆర్ ను ఓడించిన సన్ రైజర్స్ హైదరాబాద్ క్వాలిఫయర్ 2కు అర్హత సాధించింది. అనంతరం క్వాలిఫయర్ 2లో గుజరాత్ లయన్స్‌పై నెగ్గింది. అనంతరం ఫైనల్లో ఆర్సీబీని ఓడించి టైటిల్ సాధించింది. ఆ సమయంలో సన్ రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్‌గా ఆస్ట్రేలియా ప్లేయర్ డేవిడ్ వార్నర్ ఉన్నాడు.ఈసారి కూడా ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్ ఉన్నాడు. 2016లో మాదిరే ఈసారి కూడా ఆర్సీబీ, గుజరాత్, సన్ రైజర్స్ జట్లు ప్లే ఆఫ్స్‌కు చేరాయి. కేకేఆర్ రేసులో ఉంది. కేకేఆర్ కూడా ప్లే ఆఫ్స్‌కు చేరితే అచ్చం 2016 సీజన్‌లానే ఉంటుంది. 2016 సెంటిమెంట్ వర్కౌట్ అయితే ప్యాట్ కమిన్స్ నేతృత్వంలోని సన్ రైజర్స్ హైదరాబాద్ కప్పు నెగ్గడం ఖాయం.ఇక సన్ రైజర్స్ హైదరాబాద్ మే 27న జరిగే ఎలిమినేటర్ పోరులో తలపడనుంది. అయితే ప్రత్యర్థి ఇంకా డిసైడ్ కాలేదు. ప్రస్తుతం సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టులో బ్యాటర్లు సూపర్ ఫామ్‌లో ఉన్నారు. అభిషేక్ శర్మ, క్లాసెన్, ఇషాన్ కిషన్, నితీశ్ కుమార్ రెడ్డిలు సూపర్ టచ్‌లో ఉన్నారు. ఇక బౌలింగ్ కూడా మెరుగైంది. ప్యాట్ కమిన్స్, సకీబ్ హుస్సేన్, ఈషాన్ మలింగలు లయలో ఉన్నారు.వీరు క్వాలిఫయర్స్‌లో కూడా రాణిస్తే సన్ రైజర్స్ హైదరాబాద్ ఫైనల్ చేరడం ఖాయం. ఆర్సీబీతో మరోసారి పోరు జరిగితే మాత్రం అభిమానులు పండగ చేసుకోవడం ఖాయం. మే 31న అహ్మదాబాద్ వేదికగా జరిగే ఫైనల్ జరగనుంది.

# హమ్మయ్య.. పంజాబ్ గెలిచింది..






ఎట్టకేలకు లీగ్ దశ ఆఖరి మ్యాచ్‌లో విజయంతో పంజాబ్ కింగ్స్ ఊపిరి పీల్చుకుంది. వరసగా ఆరు ఓటములతో ప్లే ఆఫ్స్ అవకాశాలు సంక్లిష్టంగా మారిన వేళ లక్నో సూపర్ జెయింట్స్ (ఎల్ఎస్‌జీ)పై భారీ విజయం సాధించింది. లక్నో నిర్దేశించిన 197 పరుగుల ఛేదనలో ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్(69) అర్ధ శతకంతో మెరవగా.. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్(101 నాటౌట్) తొలి శతకంతో కదం తొక్కాడు. ప్రత్యర్థి బౌలర్లను ఎడాపెడా ఉతికేసిన ఈ ద్వయం శతక భాగస్వామ్యంతో విజయానికి బాటలేసింది. మొత్తంగా ఏడో విజయం.. 5 పాయింట్లతో మూడో నాలుగో స్థానంలోకి దూసుకెళ్లింది పంజాబ్.

పంతొమ్మిదో సీజన్‌లో పంజాబ్ కింగ్స్ అదిరే విజయంతో లక్నోకు భారీ స్కోర్ కొట్టనిచ్చిన పంజాబ్ కింగ్స్‌కు ఆదిలోనే షమీ షాకిచ్చాడు. తొలి బంతికే అర్జున్ టెండూల్కర్ క్యాచ్ పట్టడంతో ప్రియాన్ష్ ఆర్య(0) ఔటయ్యాడు. ఆ తర్వాతి ఓవర్లో కూపర్ కొన్నొల్లి(18)ని బౌల్డ్ చేసిన రెండో వికెట్ అందించాడు షమీ. వెంటవెంటనే కీలక వికెట్లు పడడంత ప్రభ్‌సిమ్రన్ సింగ్(69), కెప్టెన్ శ్రేయస్ అయ్యర్(101 నాటౌట్ : 51 బంతుల్లో 11 ఫోర్లు, 5 సిక్సర్లు)లు ఆచితూచి ఆడారు. రఠ్వీ ఓవర్లో ఫోర్, సిక్సర్‌తో రన్స్ రాబట్టగా పంజాబ్ పవర్ ప్లేలో 65 పరుగులు చేసింది.

140 పరుగులతో

పవర్ ప్లేలో నింపాదిగా ఆడిన అయ్యర్, ప్రభ్‌సిమ్రన్ జోడీ లక్నో బౌలర్లకు చుక్కలు చూపించింది. విధ్వంసక ఆటతో అర్ధ శతకం బాదిన ప్రభ్‌సిమ్రన్ 62 పరుగుల లైఫ్ లభించింది. ప్రిన్స్ యాదవ్ ఓవర్లో అతడు ఆడిన బంతిని బదొని క్యాచ్ అందుకున్నాడు. కానీ, బదొని చేతిలో ఉండగానే బంతి నేలకు తాకడంతో టీవీ అంపైర్ నాటౌటిచ్చాడు. అయితే.. అర్జున్ టెండూల్కర్(1-36) సూపర్ యార్కర్‌తో అతడిని వెనక్కి పంపి మూడో 140 పరుగుల భాగస్వామ్యాన్ని విడదీశాడు. ఆ తర్వాత సూర్యాన్ష్ శెడ్గే(9 నాటౌట్) తోడుగా అయ్యర్ జట్టును గెలిపించాడు. విజయానికి 3 పరగులు అవసరమవ్వగా సిక్సర్ బాదిన అయ్యర్ సెంచరీ పూర్తి చేసుకోగా ఏడు వికెట్ల తేడాతో నెగ్గిన పంజాబ్ ప్లే ఆఫ్స్ రేసులో నిలిచింది.

**ఇంగ్లిస్, బదొని మెరుపులు**

ప్లే ఆఫ్స్ రేసులో లేని లక్నో సూపర్ జెయింట్స్ భారీ స్కోర్‌తో పంజాబ్ కింగ్స్‌కు సవాల్ విసిరింది. ఓపెనర్ జోష్ ఇంగ్లిస్(72) అర్ధ శతకంతో విరుచుకుపడగా.. అయుశ్ బదొని(43) ధనాధన్ ఆటతో అలరించాడు. మిడిలార్డర్‌ను చాహల్(2-21) కట్టడి చేయగా.. డెత్ ఓవర్లలో అబ్దుల్ సమద్(37 నాటౌట్) దూకుడుగా ఆడారు. దాంతో, పంజాబ్‌కు లక్నో 197 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించగలిగింది.

# సచిన్‌లో చూసిందే వైభవ్ లో కనిపించింది

**భారత మాజీ క్రికెటర్ కిరణ్ మోరే**




రాజస్థాన్ రాయల్స్ టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీపై భారత మాజీ క్రికెటర్ కిరణ్ మోరే ప్రశంసల జల్లు కురిపించాడు. క్రికెట్ గాడ్ సచిన్ టెండూల్కర్‌లో చూసిన తెగువ తనకు వైభవ్ సూర్యవంశీలో కనిపించిందని తెలిపాడు. వరల్డ్ క్లాస్ బౌలర్లను సైతం అలవోకగా ఎదుర్కొంటుండటం తనను విపరీతంగా ఆకట్టుకుందన్నాడు.ఐపీఎల్ 2026 సీజన్‌లో వైభవ్ సూర్యవంశీ విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగుతున్నాడు. 13 ఇన్నింగ్స్‌లలో 44.54 సగటు, 236.32 స్ట్రైక్‌రేట్‌తో 579 పరుగులు చేశాడు. ఆరెంజ్ క్యాప్ రేసులో కొనసాగుతున్నాడు. ఈ సీజన్‌లో వైభవ్ సూర్యవంశీ 53 సిక్సర్లు బాదాడు. ఐపీఎల్ చరిత్రలోనే ఒక సీజన్‌లో భారత బ్యాటర్ కొట్టిన అత్యధిక సిక్స్‌లు ఇవే కావడం గమనార్హం.తాజాగా ఓ ఇంటర్వ్యూలో వైభవ్ ఆటతీరుపై స్పందించిన కిరణ్ మోరే.. సచిన్‌తో పోల్చుతూ బుడ్డోడిని ఆకాశానికెత్తాడు. 'నేను తొలిసారి సచిన్ టెండూల్కర్‌ను చూసినప్పుడు అతను వరల్డ్ క్లాస్ బౌలర్లను ఎలా ఎదుర్కొన్నాడో నాకు ఇప్పటికీ గుర్తుంది. అప్పుడే నాకు అర్థమైంది సచిన్ చాలా ప్రత్యేకమైన ఆటగాడు అని. ఇప్పుడు వైభవ్ సూర్యవంశీని చూస్తుంటే నాకు మళ్లీ అదే ఫీలింగ్ కలుగుతోంది. వైభవ్ కూడా చాలా ప్రత్యేకమైన ఆటగాడు. దేవుడే అతన్ని క్రికెట్ కోసం ప్రత్యేకంగా తయారు చేసి పంపినట్లున్నాడు. వైభవ్‌ను తన సహజ సిద్ధమైన శైలిలోనే ఆడనివ్వండి.. దేశానికి గొప్ప పేరు తెస్తాడు." అంటూ ప్రశంసల వర్షం కురిపించారు. ఇటీవల ముగిసిన అండర్ 19 ప్రపంచ కప్‌లో వైభవ్ సూర్యవంశీ 7 మ్యాచ్‌ల్లో 439 పరుగులు చేశాడు. ఆ టోర్నీలో 30 సిక్సర్లు బాది డెవాల్డ్ బ్రెవిస్ రికార్డును బద్దలు కొట్టాడు. టీ20 క్రికెట్‌లో ఇప్పటివరకు 31 మ్యాచ్‌ల్లో 1280 పరుగులు చేసి 4 శతకాలు నమోదు చేశాడు.ఈ అద్భుత ప్రదర్శన నేపథ్యంలోనే వైభవ్ సూర్యవంశీని టీమిండియాలోకి తీసుకోవాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది. ఈ క్రమంలోనే భారత సెలెక్టర్లు వైభవ్ సూర్యవంశీని శ్రీలంక పర్యటనకు వెళ్లే భారత్-ఏ జట్టుకు ఎంపిక చేశారు.

# కోహ్లి వండర్ఫుల్ బ్యాటింగ్



రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి ఐపీఎల్ 2026 సీజన్ లో భాగంగా శుక్రవారం సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్ లో ఒక అద్భుతమైన ప్రపంచ రికార్డును బద్దలు కొట్టాడు. ఈ మ్యాచ్ లో వెంకటేష్ అయ్యర్‌తో కలిసి ఓపెనింగ్ వికెట్‌కు 60 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పిన కోహ్లి, ఓవరాల్ గా టీ20 క్రికెట్ లో 211వ సారి యాభై లేదా అంతకంటే ఎక్కువ పరుగుల పార్ట్‌నర్‌షిప్‌లో భాగమయ్యాడు. ఈ ఘనతతో మెన్స్ టీ20 క్రికెట్ చరిత్రలోనే అత్యధిక యాభై ప్లస్ భాగస్వామ్యాల్లో నిలిచిన ప్లేయర్‌గా కోహ్లి సరికొత్త చరిత్ర సృష్టించాడు. ఈ లిస్ట్ లో ఇంగ్లండ్ మాజీ బ్యాటర్ అలెక్స్ హేల్స్ (210) రికార్డును ఆయన అధిగమించాడు. వెస్టిండీస్ లెజెండ్ క్రిస్ గేల్ 191 భాగస్వామ్యాలతో ఈ జాబితాలో ఐదో స్థానంలో ఉన్నాడు.ఈ మ్యాచ్ లో మొదట బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్ బ్యాటర్లు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు బౌలర్లపై విరుచుకుపడ్డారు. నిర్ణీత 20 ఓవర్లలో ఎస్‌ఆర్‌హెచ్ 4 వికెట్ల నష్టానికి 255 పరుగుల భారీ స్కోరును బోర్డుపై ఉంచింది. ఓపెనర్ అభిషేక్ శర్మ 56 పరుగులతో మెరుపు ఇన్నింగ్స్ ఆడగా, మిడిలార్డర్ లో ఇషాన్ కిషన్ 79 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచారు. హెన్రిచ్ క్లాసెన్ 51 పరుగులతో రాణించాడు. ఇషాన్ కిషన్, క్లాసెన్ మూడో వికెట్‌కు కేవలం కొద్ది ఓవర్లలోనే 113 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని జోడించి ఆర్సీబీ బౌలింగ్ లైన్‌అప్‌ను దెబ్బతీశారు. బెంగళూరు బౌలర్లలో రసీఖ్ సలామ్ దార్ 52 పరుగులిచ్చి 2 వికెట్లు పడగొట్టాడు.ఇన్నింగ్స్ బ్రేక్ సమయంలో సన్‌రైజర్స్ హిట్టర్ హెన్రిచ్ క్లాసెన్ మాట్లాడుతూ, మొదట్లో టైమింగ్ దొరకక కొంచెం ఇబ్బంది పడ్డానని అంగీకరించాడు. జోష్ హేజిల్‌వుడ్ వేసిన ఒకే ఓవర్ లో 27 పరుగులు రావడంతో తన ఇన్నింగ్స్ ట్రాక్‌లోకి వచ్చిందని చెప్పాడు. టీమ్ రన్ రేట్ వేగంగా ఉన్నప్పుడు క్రీజులో ఎక్కువ బంతులు వేస్ట్ చేయలేమని, అందుకే గేర్ మార్చాల్సి వచ్చిందని వివరించాడు. ఈ సీజన్ లో మిడిలార్డర్ లో ఇషాన్ కిషన్‌తో కలిసి మంచి పార్ట్‌నర్‌షిప్స్ బిల్డ్ చేయడం జట్టుకు బాగా ప్లస్ అయిందని క్లాసెన్ పేర్కొన్నాడు. పిచ్ కాస్త స్లోగా ఉన్నప్పటికీ బ్యాటింగ్ కు అనుకూలించిందని అభిప్రాయపడ్డాడు.సన్‌రైజర్స్ హైదరాబాద్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు రెండు జట్లు ఇప్పటికే ప్లేఆఫ్ బెర్త్‌లను కన్ఫర్మ్ చేసుకోవడంతో ప్లేయర్లు ఎలాంటి ఒత్తిడి లేకుండా ఫ్రీ మైండ్‌తో ఆడారు. మ్యాచ్ ఫలితం ఎలా ఉన్నా సరికొత్త ప్రయోగాలు చేయడానికి ఈ మ్యాచ్ పనికొచ్చిందని క్లాసెన్ చెప్పాడు. ఇంతటి భారీ స్కోరు సాధించడం వల్ల ఛేజింగ్ లో ప్రత్యర్థి జట్టు ఒత్తిడికి గురయ్యే అవకాశం ఉంటుందని విశ్లేషించాడు.

## లేడీ ఫ్యాన్‌కు 'సారీ' చెప్పిన రోహిత్ శర్మ



రోహిత్ శర్మ అంటే అభిమానులకు ఎప్పుడూ ప్రత్యేకమే. అలాగే అభిమానులంటే కూడా రోహిత్‌కు స్పెషలే. మరోసారి దీనిని వి ా ట్ వ ా ్య న్ నిరూపించుకున్నాడు. ఇంతటీ బడా స్టార్ క్రికెటర్ అయినప్పటికీ, తాజాగా ఓ లేడీ ఫ్యాన్‌కు రోహిత్ 'సారీ' చెప్పాడు. తనను కలవలేకపోయానని ఏడుస్తూ బాధపడుతున్న ఓ యువతి కోసం రోహిత్ వీడియో సందేశం పంపించాడు. మళ్లీ కోల్‌కతాకు వచ్చినప్పుడు ఆ అమ్మాయిని తప్పకుండా కలుస్తానంటూ వీడియోలో చెప్పుకొచ్చాడు. దీంతో ఆ అమ్మాయి ఆనంధానికి అవధుల్లేకుండా పోయాయి!కోల్‌కాతా ఈడెన్ గార్డెన్స్ వేదికగా ముంబయి రీసెంట్‌గా కేకేఆర్?తో మ్యాచ్ ఆడింది. ఈ మ్యాచ్ సందర్భంగా రోహిత్‌ను కలవాలని ఓ లేడీ ఫ్యాన్ స్టేడియానికి వెళ్లింది. హిట్?మ్యాన్?ను కలిసేందుకు కొన్ని గంటల నుంచి వెయిట్ చేస్తున్నానని, అతడని కలవడమే తన డ్రీమ్ అని చెప్పింది. అయితే డ్రెస్సింగ్ రూమ్ నుంచి ప్లేయర్లు ఒక్కొక్కరు వస్తుండగా రోహిత్ కోసం ఆత్రుతగా ఎదురుచూసింది. అతడు రాగానే 'రోహిత్ భాయ్', 'రోహిత్ భాయ్' అంటూ గట్టిగా అరిచింది. అయితే క్రౌడ్ శబ్దం వల్ల రోహిత్ ఆమెను పట్టించుకోకుండా వెళ్లిపోయాడు. అంతే ఒక్కసారిగా ఆ యువతి ఏడ్చేశింది. ఈ మొత్తం సన్నివేశాన్ని పక్కనే ఉన్న ఆమె బంధువు వీడియో రికార్డ్ చేశాడు.

ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో రోహిత్? దాకా చేరింది. అయితే తనను కలవలేకపోయానన్న బాధతో ఆ అమ్మాయి ఏడవడం రోహిత్?ను కలచివేసినట్లుంది. దీంతో ఆమెకు సారీ చెబుతూ హిట్?మ్యాన్ ఓ వీడియో చేశాడు. 'హాయ్, జినియా! ఈడెన్ గార్డెన్స్?లో నిన్ను కలవలేకపోయినందుకు నన్ను క్షమించు. నీ వీడియో చూశాను. నాకూ బాధేసింది. అయితే క్రౌడ్ ఎక్కువగా ఉండడం వల్ల కొన్నిసార్లు ఎవరు పిలుస్తున్నారో గుర్తుపట్టడం కష్టంగా ఉంటుంది. నేనూ అలాగే మిస్ అయినట్లు ఉన్నాను. కానీ, నెక్ట్స్ ఈడెన్ గార్డెన్స్?కు వచ్చినప్పుడు మాత్రం నిన్ను కచ్చితంగా కలుస్తాను' అని వీడియో షేర్ చేశాడు. ఈ వీడియో ఓ అభిమాని ద్వారా సదరు యువతికి చేరింది. తన వీడియోకు రోహిత్? రెస్పాన్స్ ఇవ్వడంతో హ్యాపీగా ఫీల్ అయ్యింది. మహిళా అభిమానికి సారీ చెబుతూ రోహిత్ చేసిన వీడియో వైరల్ అయ్యింది. ఆయన రేంజ్? స్టార్ అభిమానికి సారీ చెప్పడంతో హిట్?మ్యాన్?పై ప్రశంసలు కురుస్తున్నాయి. రోహిత్ తన అభిమానులను ఎప్పుడూ నిరాశ పర్చడని, అతడి బంగారం అంటూ పోస్టులు షేర్ చేస్తున్నారు.

Printed, Published and Owned by Shaik Yacoob Pasha, Published at 7-4-29, Medarabasti Kothagudem, Bhadradri Kothagudem Districrt-507 101, Telangana. Printed at SUPHALA AKSHARAM Printers,
RNI ref.no PRESS/2026/126/7878/00001375, e-mail: aksharamnewsts@gmail.com, Editor: SHAIK YACOOB PASHA, RNI NO. TELTEL/2018/75419, e-mail: aksharamtsnews@gmail.com. Mobile : 9391690609